

ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
11-9-5
25 నయాపైసలు
ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



అందాల పాప "బోసి నేర్పిస్తే "

ఫొటో పి గురుమూర్తి, మద్రాసు]


జానకి
ఇలా చెప్పుచున్నది, "నేను ఎల్లప్పుడూ లక్స్ టాయిలెట్ సబ్బును వాడుచున్నాను —అది ఎంతో తెల్లనిది, గనుక అది శుద్ధమైనది అని నేనెరుగుదును!"
జానకి గొప్ప నటనా కౌశల్యమును— మృదువైన, కోమలమగు చర్మ సౌందర్యమును గలిగియున్నది. సంవత్సరాల తరబడిగా తాను తెల్లని, శుద్ధమైన, పరిమళమగు లక్స్ టాయిలెట్ సబ్బును ప్రతిరోజూ వాడుచున్నదని జానకి మాతో చెప్పుచున్నది —సినీమా తారవంటి చర్మ సౌందర్యము కోసం—దానిని ప్రతిరోజూ వాడండి.
LUX
TOILET SOAP
లక్స్
టాయిలెట్ సబ్బు
సినీమా తారలకు సౌందర్యమునిచ్చు సబ్బు
LTS. 540-X52 TL

సంవత్సర చందా
రు. 13—0—0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder: K. NAGESWARA RAO

సంపుటము 52
సంచిక 3
11-9-57

హేవిళంబి భాద్రపదం, బహుళ ద్వితీయ, బుధవారం

★ విషయానుక్రమణిక ★

ముఖచిత్రం:
నర్తకి సంధ్య

★

కొత్త నవల! ★ కొత్త సీరియల్!

ఆంధ్ర వారపత్రికలో ఒక సాంఘిక నవలను త్వరలో సీరియల్‌గా ప్రకటించనున్నాము.
ఇతర వివరాలకు, ప్రచురణ తేదీకి వచ్చేవారం పత్రిక చూడండి.

ఆ హా ర స మ స్య

ఎప్పటికైనా తీరుతుందా?

తిండికొరతను నివారించి, ఆహార విషయంలో దేశాన్ని స్వయం పోషకం చేసే మహత్తరాశయంతో మొదటి పంచవర్ష ప్రణాళికను భారత ప్రభుత్వం నిర్వహించింది. ఆహార రంగంలో విజయం సాధించాము గనక ఇక పారిశ్రామిక రంగంలో విజయం సాధించాలని రెండవ పంచవర్ష ప్రణాళికను ఇప్పుడు నిర్వహిస్తోంది. ప్రణాళిక ఉద్దేశాలైతే బాగానే ఉన్నాయి. ఎటొచ్చీ అవి నెరవేరే అవకాశాలే కనుచూపు మేరలో కనబడడం లేదు.

మొదటి ప్రణాళిక లక్ష్యాలు, ఆశయాలు చాలా పరిమితమైనవీ, అస్పష్టమైనవీ, కావడం చేత అది ఏదో విధంగా నెగ్గిందనే అనిపించింది. రెండవ ప్రణాళిక లక్ష్యాలు దేశాన్ని ఒక్కసారిగా పారిశ్రామికీకరించే ఉద్దేశంతో, స్పష్టమైన పంథాలో నిర్ణయించబడినవి. ఈ కారణంచేత రెండవ ప్రణాళిక నిర్వహణంలో ప్రభుత్వాలూ, ప్రజలూ కూడా దుర్లంఘనీయమైన అనేక అవరోధాల నెదుర్కోవలసి వస్తోంది.

ఈ అవరోధాల్లో అన్నిటికంటే ముఖ్యమైనది ఆహార సమస్య అని ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి ఇటీవల రాజ్యసభలో పేర్కొన్నారు. ఆహారాన్ని అధికంగా ఉత్పత్తి చేయడం, దానికి సరసమైన ధరలను ఏర్పాటు చేయడం ఇదే రెండవ ప్రణాళికలోకల్లా ముఖ్యాంశమని ఆయన అన్నారు. మొదటి ప్రణాళిక ఫలితంగా ఆహారోత్పత్తి అయితే పెరిగింది గాని, ఆహార సమస్య మాత్రం తీరలేదు. ఇప్పటి ఆహార ధరలను చూస్తే, ఈ దేశంలో తగినంతగా ఆహారం పండడం లేదుగావును, లేకపోతే పట్టిపుణ్యానికి ధరలిలా ఎందుకు పెరిగిపోతాయి అని అనుమానం కలుగుతుంది. భారత ప్రభుత్వం ఈ అనుమానాస్పద విషయాన్ని నమ్మినట్టే ప్రవర్తిస్తోంది. లేకపోతే ప్రస్తుత సంవత్సరంలో 35 లక్షల టన్నుల ఆహారాన్ని విదేశాలనుంచి దిగుమతి చేసుకునే కార్యక్రమానికి వేరే అర్థం ఏముంది?

రెండవ ప్రణాళిక నిర్వహణకు విదేశీ ద్రవ్యం అసలే కొరతగా ఉన్నది. ఈ కొరతను ఆహారధాన్యాల దిగుమతులు మరింత ఎక్కువ చేస్తున్నాయి. చివరికి ప్రణాళికలోకల్లా ఆహారోత్పత్తే ముఖ్యాంశం అనే పరిస్థితికి వచ్చింది. అంటే కథ మళ్ళీ మొదటికి వచ్చిందన్న మాట.

నిజంగా మొదటికి వచ్చిందా, వచ్చినట్లు అనిపిస్తోందా తేల్చుకోడానికి, ఇటీవల ప్రకటించిన 1956–57 సం॥పు లెక్కలు సహాయపడతాయి. ఈ లెక్కలే నిజమైతే, దేశంలో ఆహారోత్పత్తి బాగా పెరిగిందనీ, కొరత ఏమాత్రమూ లేకపోగా బోలెడు మిగులు కూడా ఉందనీ స్పష్టపడుతుంది.

1956–57 సం॥పు పంటల లెక్కలనుబట్టి ఆయా రాష్ట్రాలలో ధాన్యోత్పత్తి ఈవిధంగా ఉంది:

రాష్ట్రం	ఉత్పత్తి (టన్నులు)	జనాభా
ఆంధ్రప్రదేశ్	53,91,000	3,36,40,000
అస్సాం	17,17,000	96,70,000
బీహార్	48,34,000	4,12,30,000
బొంబాయి	77,84,000	5,18,90,000
జమ్మూ, కాశ్మీర్	4,88,000	47,40,000
మధ్యప్రదేశ్	78,96,000	2,88,10,000
మద్రాసు	47,22,000	3,22,30,000
ఒరిస్సా	22,97,000	1,57,50,000
పంజాబు	55,27,000	1,73,50,000
ఉత్తరప్రదేశ్	1,20,25,000	6,79,60,000
పశ్చిమ బెంగాల్	45,59,000	2,86,80,000
మైసూర్	35,94,000	2,08,50,000
రాజస్థాన్	42,01,000	1,71,30,000
కేరళ	8,78,000	1,45,50,000

ఇంత రేషన్ అవసరం లేదు. దేశజనాభాలో నూటికి 38 వంతుల మంది 14 ఏళ్ళలోపు పిల్లలు. వీరికి 12 ఔన్సుల చొప్పున రేషన్ ఇవ్వవచ్చును. ఇలాచేస్తే మొత్తం 5,40,00,000 టన్నుల ఆహారధాన్యం సరిపోతుంది. అంటే ఇంకా 1,40,00,000 టన్నులు మిగుల్తాయన్నమాట. ఇంకో తమాషా ఉంది. 6,70,00,000 మంది జనం పట్టణాల్లో నివసిస్తున్నారు. వీరు సాధారణంగా పల్లెవాసులంతగా అపరాలు ఉపయోగించరు. కనుక మరికొంత మిగులు లభిస్తుంది. దీనికితోడు మనిషి కేవలం అపరాలు, మాత్రమే తిని ఊరుకోడనీ, కాఫీలు, టీలు, పాలు తాగుతాడనీ, చేపలు, పండ్లు, మాంసం, బంగాళాదుంపలు, ఇతర కాయగూరలు, పళ్లుకూడా తింటాడనీ గుర్తుంచుకుంటే

అందరికీ సరిపడే పంట

మొత్తంమీద దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కలిపి 6,85,90,000 టన్నుల ఆహార ధాన్యాలు పండాయి. ప్రస్తుతం భారతీయ జనాభా 38,80,00,000 ఉన్నది. మనిషికి 16 ఔన్సుల చొప్పున దండిగా రేషన్ ఇచ్చినా బోలెడంత ధాన్యం మిగుల్తుంది గాని తక్కువ కాదు. అయితే ఒక చిత్రం ఉన్నది. దేశంలో ఇంతమందికీ

ఇంకా బోలెడు ధాన్యం మిగుల్తుంది. ఇదంతా కలిపి మరో దేశాన్ని పోషించగలిగినంత ఉంటుంది. అయినా, దేశంలో తగినంత ఉత్పత్తి కావడం లేదనేమాట వినబడుతూనే ఉంది; ప్రాణసమానమైన విదేశీ ద్రవ్యం ఆహార దిగుమతులకు ఖర్చయిపోతూనే ఉంది.

అయితే ఒక పెద్ద చిక్కు మాత్రం ఉన్నది. బాగా పండే రాష్ట్రాలు కొన్ని.

ఆహార సమస్య


పండని రాష్ట్రాలు కొన్ని ఉన్నాయి. పండే రాష్ట్రాలనుంచి, అవగా మిగులు రాష్ట్రాల నుండి తరుగు రాష్ట్రాలకు ధాన్యం సరఫరా చేయడమెలాగా అనేది పెద్ద సమస్య. ఈ సరఫరా సజావుగా సాగిపోతే దేశంలో ఆహార లోపమనే మాటే వినిపించగూడదు నిజానికి.

పైన చెప్పిన శేషన్ పద్ధతి ప్రకారం, ఆంధ్ర, పంజాబ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు మిగులు రాష్ట్రాలవుతాయి. అస్సాం, బొంబాయి, మద్రాసు, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు స్వయంపోషక ప్రాంతాలవుతాయి. కేరళ, కాశ్మీర్ ప్రాంతాలు మొదట్నించీ తరుగు రాష్ట్రాలే. వాటికి సహాయం చేయవలసిన అవసరం ఎలాగూ తప్పదు. ఎటొచ్చీ బీహార్ రాష్ట్రం. ఈ రాష్ట్రానికి ఎప్పుడూ ఆకలే. 4,12,30,000 మంది జనానికి 48,34,000 టన్నుల ధాన్యాలే పండుతున్నాయి. ఇది చాలా అన్యాయం. అసలు బీహారులో వ్యవసాయమంత అధ్వాన్నపు పని మరొకటి లేదు. పంట భూములు విస్తారంగా ఉన్నా పంటమాత్రం దారుణం. ఇంత తక్కువ పంట దేశంలో ఇంకెక్కడా పండదు. మళ్ళీ నీటి వసరు తక్కువా అంటే అనేక రాష్ట్రాల్లోకంటె నీటివసరు ఇక్కడే జాస్తి. పైగా ఎరువుల ఫ్యాక్టరీ ఈ రాష్ట్రంలోనే ఉంది. అయినా పంటమాత్రం లేదు. ఈ రాష్ట్రం ఎంతసేపూ పరిశ్రమలమీద పరిశ్రమలు స్థాపించుకోవటం తప్పిస్తే వ్యవసాయోత్పత్తిని అధికం చేసుకోలేదు. అయితే ఏటేటా బ్రహ్మాండమైన వరదలొస్తాయనేది ఒక కారణంగా చెబుతారు. ఏ కారణమైతే నేమి, బీహారుకు పైన చెప్పిన శేషన్ ప్రకారం ఇరవై లక్షల టన్నులు సహాయం చేయవలసి వస్తోంది.

రాష్ట్రాల అలసత్వం

బీహారుకు, కేరళ, కాశ్మీరులకు సహాయం చేస్తే చేశారుకాని స్వయంపోషక రాష్ట్రాలకూ, ఆ మాటకొస్తే మిగులు రాష్ట్రాలకూ కూడా కేంద్రప్రభుత్వం ఆహార సహాయం చేయవలసిన అగత్య మేమిటో తెలియడం లేదు. ఈ రాష్ట్రాల ప్రభుత్వాలు న్యాయంగా తమ తమ రాష్ట్రాలలో ఎంతెంత పండిందీ, ఆ ధాన్యం ఎవరిదగ్గర నిలవ ఉన్నదీ, ఎంత ధర నిర్ణయించవలసిందీ, ఏ ప్రాంతానికి సరఫరా చేయవలసి వుందీ—ఈ బాధ్యతఅంతా నిర్వహించాలి. అలా కాకుండా. మాట మాట్లాడితే

(56-వ పేజీ చూడండి)



★ ప్రణాళికి లక్ష్యాల తగ్గింపు ★

ద్వితీయ ప్రణాళికలో కొన్ని కొన్ని భాగాలను తగ్గిస్తున్నామని ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి ప్రకటించారు. యథార్థ పరిస్థితిని ఆయన గుర్తించ మొదలు పెట్టా రనటానికిది నిదర్శనం.

ప్రభుత్వ రంగంలో ఖర్చు మొదట అనుకున్నట్లు రూ. 4800 కోట్లు కాక రూ. 6800 కోట్లకు పెరిగింది. అసలు రూ. 4800 కోట్ల ఖర్చుకే రూ. 800 కోట్లు విదేశాల నుంచి తెచ్చుకోవాలనీ, రూ. 1200 కోట్ల ధనాన్ని లోటుబడ్జెట్ పద్ధతిలో సేకరించుకోవాలనీ ప్రణాళిక సంఘం నిశ్చయించింది. కొత్త పన్నులు వేయగలిగినవన్ని వేసి, ప్రజల నుండి ఋణాలు సేకరించి, విదేశసహాయం పొంది, లోటు బడ్జెట్ పద్ధతి అనుసరించి—ఇన్ని చేసినా రూ. 400 కోట్ల లోటు పూడ్చకుండానే వదిలిపెట్టారు ఈ లోటును పూడ్చడానికి స్వీయశక్తి మీదనే ఆధారపడాలని వారనుకున్నారు.

జరిగిం దేమిటంటే రక్షణశాఖ పద్దు భారీ ఎత్తున పెరిగిపోయింది. దీంతో రూ. 350 కోట్ల మిగులూ తరుగుగా పరిణమించింది. సరే, మొత్తం ప్రణాళిక ఖర్చు పైన చెప్పినట్లు రూ. 2000 కోట్లు పెరిగింది. దీనికితోడు రేపు వేతన పరిశీలక సంఘం సిఫార్సులతో ఏటామరో రూ. 50 కోట్లదాకా ప్రభుత్వపు ఖర్చు పెరగబోతుంది.

దేశంలోని ద్రవ్యోల్బణ పరిస్థితుల దృష్ట్యా రూ. 1200 కోట్లను లోటుబడ్జెట్ వేసి పూడ్చడం మానవ సాధ్యంకాదు. అంతే కాదు—విదేశాలనుంచి వస్తుందని ఆశపడ్డ రూ. 800 కోట్లూ మనకిరాదు. దీనికి ఒక కారణం ఉంది. మనదేశంలాంటి వెనకబడిన దేశాలు, ఆర్థికంగా బాగుపడదా మనుకుంటున్న దేశాలు ప్రపంచ రాజకీయాల చదరంగంలో ఇష్టమొచ్చిన ఎత్తులు వేసి ఆడదామనుకుంటే సాగదు. శ్రీ వి. కె. కృష్ణమీనన్ ఇటీవల దక్షిణాదిన ఏదో సందర్భంలో "భారతదేశానికి మిత్రులు లేరు" అని చెప్పారు. అందుచేత భారతదేశానికి మిత్రులు దొరికేదాకా విదేశాలనుంచి సహాయం వస్తుందని ఆశపడడమే తప్పు. విదేశ సహాయం తెచ్చుకోక తప్పదూ అంటే, మన విధానాలను మార్చుకోక తప్పదు.

శ్రీ కృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే, ద్వితీయ ప్రణాళికను తగినంత డబ్బు లేకుండానే ప్రారంభించాము. ఏ మాత్రం తెలివి తేట ఉన్న మనిషైనా, ఒక మిత్రుడు "స్థలదాన్" చేస్తాడనీ, మరొకడు "సిమెంటుదాన్" చేస్తాడనీ, ఇంకొకడు కలపదానం చేస్తాడనీ, వేరొకడు ఉక్కు, ఇంకొకడు డబ్బు ఇలా అన్నీ తలా ఒకడూ సహాయం చేస్తాడనే లెక్కలో ఇల్లు కట్టడానికి ఎప్పుడూ పూనుకోడు.

గొప్పలకోసం గప్పాలు

రూ. 350 కోట్ల మిగులూ తరుగుగా మారింది. కొత్త పన్నుల మూలంగా వచ్చే ఆదాయంలో సగందాకా కేంద్రప్రభుత్వోద్యోగులకు సరసమైన వేతనా లివ్వడానికే పోతుంది. లోటు బడ్జెట్‌కు అనుకూలంగా ధరలేమన్నా నిలకడగా ఉంటున్నాయా అంటే అదీ లేదు. ప్రతి దేశపు వ్యవహారంలోనూ తలదూర్చడంవల్ల విదేశాల సహా

న్యూఢిల్లీ లేఖ

యమూ రాకుండా పోతోంది. వీటన్నిటికీ తోడు విదేశీ ద్రవ్యం లోటు రు. 800 కోట్ల దాకా ఉంది.

ప్రతిష్ఠకోసం ప్రాకులాడి ప్రణాళికను నిర్వహిస్తామని గప్పాలు కొట్టినంతమాత్రాన లాభంలేదని ఆర్థిక మంత్రి గ్రహించారు. ఏమైనా సరే, ప్రణాళికను నిర్వహిస్తామని మంత్రులందరూ పదే పదే చెప్పే మాటలు కేవలం చిలకపలుకులని ఆయనకు నెమ్మది నెమ్మదిగా తెలిసి వచ్చింది. ఎందుకంటే ప్రతి మంత్రీ తన పదవిని సుస్థిరం చేసుకునే తాపత్రయంకొద్దీ 'నా శాఖకు ఎక్కువ డబ్బు కావాలంటే, నా శాఖకు ఎక్కువ కావాలని' కోరసాగారు. అలా ఒక వంక కోరుతూనే, అటు తమచుట్టూ తిరిగే వ్యాపారస్థులను, రాజాలను, జమీందార్లను, పారిశ్రామికులను సంతోషపెట్టడానికి ఆర్థికమంత్రి చేసిన పన్నుల ప్రతిపాదనలకు నీళ్లు తోడడానికి ప్రయత్నించారు.

చిత్రిక ఎవరికి?

ఈ కారణాలవల్ల ప్రణాళికను చిత్రిక పట్టి కొన్ని భాగాలు తొలగించడం తప్పని సరౌతోంది. అసలు చిత్రిక పట్టాల్సింది ప్రణాళికను కాదు, ప్రణాళికా సంఘాన్ని. ఈ ప్రణాళికా సంఘం ఏ ఆసరా చూసుకుని ప్రణాళికవ్యయాన్ని నిర్దేశించిందో విచారించడానికి ఒక చిన్న సంఘాన్ని వెయ్యాలి. ఆర్థిక నిపుణులనే ఉద్దేశంతో ప్రణాళికా సంఘ సభ్యులను నియమిస్తే ఆ సభ్యులు తామే ప్రభుత్వమై పోయినట్లు వ్యవహరించారు. వివిధ శాఖలతోసహా ఒక ప్రత్యేక "సచివాలయాన్ని" కూడా ఈ సంఘం నిర్వహిస్తోంది. ఏ పనికి ఎంత కేటాయించాలో నిశ్చయించే అధికారం ఈ సంఘానిదే. విద్యాశాఖకు కేటాయించిన పద్దునుబట్టే ఈ సంఘం తన అధికారాన్ని ఎంత చక్కగా నిర్వహిస్తోందో తెలిసిపోతుంది. దేశానికి అన్నిటికంటే మ్యూజియం, జాతీయ నాటకశాల, గ్రంథాలయం ముఖ్యమని కాబోలు వాటికి డబ్బు కేటాయించింది.

ప్రతి వాణ్నీ సంతోషపెట్టడానికి, ముఖ్యంగా బాగా పలుకుబడి ఉన్నవాణ్ణి బాగా సంతోషపెట్టడానికి ఈ సంఘం డబ్బు కేటాయిస్తున్నట్లు కనబడుతోంది.

ఇంకో తమాషా ఉన్నది. ప్రణాళికా సంఘానికి అధ్యక్షులు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ. అంటే ప్రణాళికా సంఘాధ్యక్షుడైన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రణాళికను భారత ప్రధానియైన శ్రీ జవహర్

(56- వ పేజీ చూడండి)

ఊర్మిళ నవ్వు

లక్ష్మణరావు కావాలని పట్టుపట్టి పల్లెటూరమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. అతనికి చదువుకున్న అమ్మాయిలని చూసి చూసి (పెళ్ళి సంబంధాలకుపోయి) విసుగు పుట్టింది. అందులో మరీ వో అమ్మాయి, అతగాడి ముఖం మీదే "నువు నాకు నచ్చలేదు" అని చెప్పింది. అతగాడి ప్రాణం చివుక్కుమంది. ఎంతచెడ్డా తను లక్షరూపాయల ఆస్తిమంతుడు. చదువు సరిగా అంటక పోయినా రూపానికి లోటు లేదు. పురుషలక్షణమైన ఉద్యోగం వుంది. కరణీకం వుద్యోగం కాదా యేమిటి?

ఆ అమ్మాయి పేరు ఊర్మిళ అని వినగానే లక్ష్మణరావు మనసు ఎగిరి గంతేసింది. తాను ఇన్నాళ్ళు ఇంతమందిని చూసినా, వొక్కరినీ తాను వరించటానికి వీలులేని పరిస్థితులు కల్పించబడటం తనకు ఊర్మిళ దక్కటానికేమో, అనుకున్నాడు. ఊర్మిళకోసం తాను ఇన్నాళ్ళనుంచీ తపస్సుచేస్తున్నాడు, అనుకున్నాడు. అమ్మమ్మకు ఆ అమ్మాయి ఇంత నచ్చిందని చెప్పలేము. సంపూర్తిగా నచ్చింది. ఊర్మిళని చూడగానే అమ్మమ్మకు తన చిన్నతనం జ్ఞాపకానికొచ్చింది. కాళ్ళకు కడియాలూ, మెళ్ళో పులిచేరునానూ, జడమీద నాగరం, ఇవన్నీ చూచి వచ్చిన అమ్మమ్మ "ఓరే అబ్బీ! మన ఇంట్లో దీపం అవసరంలేదు. నట్టింట్లో ఆ పిల్లనడిస్తే, ఇల్లంతా పెట్రో మాక్సులైటే!" అంది.

"పెట్రోమాక్సు కాదమ్మమ్మా, పెట్రో మాక్సు" అన్నాడు లక్ష్మణరావు.

"యేడ్చేవులేరా గాడిదీ, ఇక నాకేం నేర్పుతావు. వచ్చే ఆపిల్లకు నేర్పుకుందువు గానిలే!" అన్నది అమ్మమ్మ. లక్ష్మణరావు మరి సిగ్గుపడిపోయ్యాడు. లక్ష్మణరావు దూరపుచుట్టాల్లో చదువుకున్న అమ్మాయిలున్నారు. వాళ్ళంతావచ్చి "ఏమోయి లక్ష్మణా! ఆమెకు నిద్రపోవటమే పనిగా బోసు! నీ వేపేనాకన్నెత్తి చూస్తుందా" అన్నారు.

"ఎంతవరకు చదువుకుంది" అని అడిగారు

"బత్తెసంజనుంచి దూడగుంజవరకు" అన్నారు కొందరు. లక్ష్మణరావు మనసు చివుక్కుమనిపించింది. అయినా అతడి మనసులో అమ్మమ్మమాటలో తిరిగి గర్వరేఖ మెరిసింది.

పెళ్ళి సజావుగా సాగిపోయింది.

"ఊర్మిళ చదువుకోకపాతే మాత్రం, ఏంలోటు" అనుకున్నాడు లక్ష్మణరావు. అతడి మనస్సులో భవిష్యత్తు తీయని రాగాలు పాడింది.

పెళ్ళికూతురి పాతకాలపు రూపాన్ని చాలా మంది వెక్కిరించారు. చాలామంది నవ్వుకున్నారు. లక్ష్మణరావు రహస్యంగా ఆ అమ్మాయిని పలకరించబోయాడు. ఆ అమ్మాయి ఎంతగింజుకున్నా, చాలాసేపు మాట్లాడలేదు. చివరకు మాట్లాడింది.

"నీకస్సలు చదువురాదా, అ ఆలుకూడా రావా" అని అడిగాడు.

"ఎందుకురాదు. తెలుగు చదువు బాగా వొచ్చు" అంది అమ్మాయి.

మంజుశ్రీ

అదేనాకు వెలుగు. ఆ వెలుగు నాకుచాలు. అనుకున్నాడు లక్ష్మణరావు.

"ఏం చదువుకున్నావు?" అడిగాడు.

"రుక్మిణీ కళ్యాణం. గజేంద్రమోక్షం. లక్ష్మణదేవరనవ్వు, (ఆ అమ్మాయి నోరు ముయ్యబోయాడుతను) ఊర్మిళాదేవి నిద్ర (ఆ అమ్మాయి నవ్వుకొంది)"

"రైట్" అనుకున్నాడు లక్ష్మణరావు.

జేబులోంచి డైరీతీసి అందులో లక్ష్మణరావు అని వ్రాయమన్నాడు. ఆ అమ్మాయి సిగ్గుపడుతూ అతని చేతిలోంచి కలం తీసుకొని గుండ్రంగా రత్నాల్లాగా, వజ్రాల్లాగా, ముత్యాల్లాగా వ్రాసింది. లక్ష్మణరావు పరమానంద భరితుడయ్యాడు.

"ఇక్కడున్నావుటే ఊర్మిళా" అన్నారెవరో బయటినుంచి. ఆ అమ్మాయి పారిపోయింది.

ఆ అమ్మాయి వ్రాసిన తనపేరు క్రింద, ఆ అమ్మాయిపేరు తను వ్రాసి కలం వో జేబులోనూ, డైరీ ఓ జేబులోనూ పెట్టుకున్నాడు లక్ష్మణరావు.

నాగవల్లి పూర్తికాగానే అప్పగింతలకు కూర్చున్నారందరూ. బుక్కాగుండా గట్టిగా కొట్టేశాడు లక్ష్మణరావు. ఊర్మిళ తలవంచుకు కూర్చుంది.

అప్పగింతలు కూడా అయిపోయినయ్. ఇక గృహప్రవేశానికి బయలుదేరాలి. అక్కడినుంచి నాలుగుమైళ్ళు యెడ్లబండ్లమీద వెళ్ళాలి. అప్పటికి రైల్వేస్టేషన్ వస్తుంది. అక్కడ రైలు ఐదారు నిమిషాలకంటే ఎక్కువాగదు. అక్కడినుంచి లక్ష్మణరావు వాళ్ల ఊరికి వోగంట ప్రయాణం. రైలుదిగి ఇంటికెళ్ళవచ్చు. స్టేషన్‌లో బళ్లు సిద్ధంగా వుంటాయి.


అలాగే అనుకుని బయలుదేరారు.

తల్లితండ్రులు తనని లక్ష్మణరావు కప్పగిస్తుంటే వొకవైపు సంతోషమూ, వొకవైపు దుఃఖమూ ముంచేశాయి ఊర్మిళని. ఉక్కిరిబిక్కిరైపోయింది. చిన్ననాటినుంచి తనను పెంచిన మమత వాళ్ళను వీడకు ప్రేమ పెల్లుబికి కళ్లు కాల్వలైనాయి.

ఊర్మిళ బయలుదేరింది.

పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ, కూచున్న బండ్లో పెద్దలెవరూ ఎక్కలేదు. కుఱ్ఱసజ్జుకు వాళ్ళ బండిలో ప్రవేశం లభిస్తే అది ప్రత్యేకమైన పురస్కారంగా భావిస్తారు. పోటీలుపడి వాళ్ళ బండ్లో యెక్కారు.

బళ్ళు కదిలినయ్.



పైన గుడ్డివెన్నెల కాస్తున్నది. పొలాల మీదనించి పైరగాలి చక్కటి వాసనలు చిమ్ముతున్నది. లక్ష్మణరావు ఊర్మిళ వేపు చూశాడు. నిండానగలు దించుకుని కన్యాత్వశోభతో మెరిసిపోతున్నది ఊర్మిళ, పెళ్ళికూతురికి ఎక్కడలేని శోభా వస్తుంది. లక్ష్మణరావుకు హృదయంలో తీయని అనుభూతులు కదిలినై. జన్మసార్థకమైందనుకున్నాడు. ఊర్మిళ కళ్ళు మూసుకుని బండి బల్లకు చేరగిలపడ్డది. క్రితం రాత్రి అంతా నిద్రలేదు. పగలంతా ఏదో తంతుతోనే సరిపోయింది. లక్ష్మణరావుకి వొళ్ళంతా ఊహా మెరిసింది.

స్టేషన్ వచ్చేసింది. ఎక్కువ ఆలస్యం లేకుండా రైలుకూడా వచ్చేసింది. ఎక్కువ సేపు ఆగదు. అంతా ఖంగారుపడుతూ ఎవరిపీలనుబట్టి వాళ్ళు ఎక్కుతున్నారు. బలంకలవాళ్లు, శౌర్యంకలవాళ్ళు, సాహసులు, దర్పంకలవాళ్ళూ, సామాన్లు చేరవేయటంలో మునిగిపోయారు.

ఊర్మిళ చెయ్యి పట్టుకుని గబగబా లాక్కుపోయి ఓ పెట్టెలో ఎక్కించాడు. లక్ష్మణరావు 'మేమిక్కడ కూచున్నాం' అని చెప్పాడు. ఇంతలోనే రైలు కదిలింది. సాహసులైన వాళ్ళు రైలు కదిలిం తర్వాత యెక్కారు. వీళ్ళు కూచున్న పెట్టె జోలి ఎవరూరాలేదు. రైలు కదలగానే ఊర్మిళ తూగుతూ నిద్రపోయింది. పెట్టెలో ఎక్కువమంది లేరు. వోమూలకూచుంది ఊర్మిళ. పక్కనే లక్ష్మణరావు కూచున్నాడు.

ఊరొచ్చేసింది. పెళ్ళివాళ్ళంతా దిగి ప్రత్యేకమైన బళ్ళలో యెక్కారు. లక్ష్మణరావు వొంటిగా ఊర్మిళతో కలసి ఒకబండియెక్కాడు. కుఱ్ఱకారుని కూడా రెక్కనివ్వలేదు. బండి కదలగా, "నీనానుతాడు ఎంత బాగుందీ, నీ చంద్రహారం, భలేబాగుంది" అన్నాడు లక్ష్మణరావు, ఊర్మిళ మెడవేపు చూసుకుంది. ఊర్మిళకి గుండెలుపగిలిపోయాయి. "ఏమైనాయి, తన జిగినీ గొలుసూ, నానుతాడూ, చంద్రహారం అత్తగారు తెచ్చిన జాజిపూల నెక్లెసూ బండ్లు ఆపించండీ" అంది రుద్ధకంఠాన. "అబ్బ! ఎంతమొద్దునిద్ర మీ వాళ్ళుపెట్టిన పేరు సార్థకం చేసుకున్నావు" అన్నాడు లక్ష్మణరావు. జేబులోంచి చంద్రహారం తీశాడు. "ఒక్కొక్కటే వొలుస్తున్నా, మెలుకువరాలేదు" అన్నాడు. "అమ్మ! బతికిపోయాను. గుండెలాగిపోయాయండీ" అన్నది ఊర్మిళ బండ్లోనే అతని కౌగిలికి చేరిపోతూ. ★

పకపకలు

★ ఎల్. వెంకటేశ్వర్లు ★

రోగి: వ్యాధి నాలుగురోజుల్లో నయమవుతుందన్నారు. నాలుగువారాలైనా తగ్గలేదేమండి?

డాక్టర్: 'ఇండియన్ పంక్చువాలిటీ' లెండి!

* * *

ఒకడు: ఇంట్లోవాళ్ళంతా నా మతి పోయిందంటున్నారండి!

డాక్టర్: అలాగా! ఎక్కడికి పోయిందో! మా డిస్పెన్సరీకి మాత్రం రాలేదండి.

డాక్టర్: ఇవిగో! ఈ ఆరు మాత్రలు మింగి కాసిని మంచినీళ్లు త్రాగండి.

రోగి: అదేమిటండి! ఇదివరకు ఇదే జ్వరానికి ఒక్క మాత్రే ఇచ్చేవారుగా?

డాక్టర్: ఈ మధ్యకాలంలో వైద్యశాస్త్రం విపరీతంగా పెరిగిపోయింది లేవయ్యా!

డాక్టర్: ఒక్కసారి నోరు తెరవండి!

రోగి: మీరే నయమండి! ఇంట్లో మాఆవిడ నన్ను ఎప్పుడూ 'నోరు ముయ్యండి' అంటుంది.

* * *

డాక్టర్: ఏమిటయ్యా! ఇంజక్షన్ యివ్వకముందే అలా చిందులు తొక్కుతావేం?

రోగి: అదిగాదు సార్! మీ బూటుకాలుతో నా కాలు తొక్కుతున్నారు.



కాళీ హైమవతీ.. శివా త్రినయనీ..

ఓసి...

మనోజ్ఞ నీరద నవోదయ కాల
విద్యుద్విలంబ మానాసిత వారివాహ
నివహోన్నత కైశిక!
మూగనోముల్లో నోసలు తేరు
కన్నుదలగూడిన భాగ్యపు మెట్టెజీరలలో
మాసరమయ్యె నీ యెడద మాగిన
సెయ్యపు తియ్య దొంతరల్.

—విశ్వనాథ]

"శివా, ఓ శివా!

ఏం వినిపించలేదేమిటి? హాసినీ తల్లి కడుపు బంగారంగానూ! అంతేలే! ఆతల్లి కడుపు బంగారం కాబట్టే, మీ అక్కచెల్లెళ్ళందరూ బంగినపల్లి మామిడిపళ్ళలా పుట్టారు. గ్యాస్ లైట్ తీగెల్లా వెలిగిపోతున్నారు. అది సరేకాని ఒసే, నాకో చిన్న సంతోషవార్త వినిపిస్తానని చెప్పావు కాదేమే?

అయితే చూడమ్మాయ్!

మీ చెల్లికి శ్రావణపట్టీతో గాజుల జతా, జిగినీ గొలుసూ తెస్తారని మీ అమ్మ అనుకుందిట కాదూ? అనుకున్నట్టు కాక, వాళ్ళు శంఖాలతావళం ఒక్కటే తెచ్చేసరికి, చండీ రూపం ధరించి నానా బీభత్సం చేసిందట నే. అయితే ఆ రెండూ ఒనకూ ఏవరకూ కార్యం చెయ్యనన్నదట! బాగానే ఉంది మీ అమ్మ తెలివి! అవిడింకా యేదో కూతుళ్ళ సుఖం చూసుకుంటుందనుకున్నాను. పిల్లల సుఖం అంటే కట్టుకున్న మొగుడు ఒంటి నిండా బంగారందిగెయ్యడమే నన్నమాట!

నీకు గుర్తుందా; నీ కోసం నేను శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చిన్నకథలూ, విశ్వనాథ సత్యనారాయణగారి నవలలూ బహుమతిగా తెచ్చినప్పుడు, అది హిందీ చదువుతూండటం చూసి దానికి ప్రత్యేకంగా ప్రేమచంద్ నవల 'గబన్' పంపించాను గుర్తుందా?

ఆ నవల అది చదువుతూ నీకు కథ చెప్తూంటే, నీకు కళ్ళనీళ్ళు తిరిగాయని చెప్పావ్ జ్ఞాపకం లేదూ? అంతకు ముందు వరకూ నీకూ ఉండే దీజబ్బు. అది చదివేసరికి నీ తిక్క తిరిగింది. నీకంటే మీ చెల్లి మరీ గోలపెట్టేది. పైగా మీ అమ్మ దాని బుర్ర నిండా నగలతో నింపేసింది.

పెళ్ళయితే చాలు మేలిమి బంగారంతో మలామా చేయించేస్తారంది. నేను మొదటి సారి సంక్రాంతికి చేతులూపుకుంటూ వచ్చినప్పుడు, మీ చెల్లికి నామీద ఎంతజాలి వేసిందో...పాపం...! అప్పటికింకా అది పైటకంచువా వేయటం లేదు. అందుచేత నే నా మీద కొచ్చేసి, నా జేబులు తడిమి 'అయ్యయ్యో, పెద్దపండుక్కి బావ నెక్లెస్ తెస్తాడనుకుంటోంది. నెక్లెస్ మాట ఎలా ఉన్నా, చిటికిన వ్రేలికి చిన్న ఉంగరం కూడా లేకుండా వచ్చావు. మా అక్కతో చెప్తానుండు—నీతో మాట్లాడొద్దని...'

అని అది ఎగిరి గంతులేస్తుండగా, నువ్వు ఎడంచేత్తో సబ్బుబిళ్ళా, తువాలూ తీసుకుని కాళ్ళూ, ముఖం కడుక్కునేందుకు నీళ్ళిచ్చావ్, నవ్వుతూ. తెల్లబోయింది మీ చెల్లి!

ఉషశ్రీ పురాణపండ

అప్పుడు దానికంత జ్ఞానం లేకపోయినా నీ ముఖకవళికల్ని బట్టి కొంత తెల తెలబోయినా నెమ్మదిమీద అర్థం చేసుకుంది. ఆరాత్రి నువ్వు గదిలోకి రావనుకుంది. పైగా తమలపాకులకు సున్నం రాసికూడా ఇవ్వవనుకుంది. నాతో చెప్పిందిలే అంతా. ఆరోజున మీఅమ్మ కొస్త ధుమధుమలాడుతూనే ఉంది. అయినా ఆవిడకు నా ఎదుట నిలబడి మాట్లాడటానికి భయం. పైగా నీ నోరంటే ఆవిడకు భయం అనికూడా నాకు మనపెళ్ళిలోనే తెలిసిందిలే.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే నువ్వు సాధ్యమయినంత త్వరలో మీ చెల్లిని మన యింటికి రప్పించే యేర్పాటు చెయ్యి.

ఆవిడ కోడళ్ళ కావిడ చిన్న మెత్తు బంగారం పెట్టిందా? నే నిలా అంటున్నానని కాదు. ఆవిడ కిప్పటి కింకా నగలమీద మోజు పోలేదు.

ఈపోరు పడలేక కాదూ—మీ నాన్న—మహానుభావుడు, చచ్చి స్వర్గాన ఉన్నాడు—చల్లటివేళ తల్చుకోవాలి—బ్రతిమాలాడాయన. పిల్లమెడ బోసిగా ఉంటే, ఆ ఒంటిపేట గొలుసయినా దానిమెడలో పడెయ్యమని. అప్పుడు మీ అమ్మ ఏమందీ...దాని మొహం...చిన్నపిల్ల మెళ్ళో యేవన్నా పడితే; రోజులసలే బాగులేవా...యెవరన్నా చేతులో కారప్పూసపొట్లం పెట్టి, మిఠాయిఉండ పెట్టి పట్టుకుపోతారు—అని పైటచెంగుతో గొలుసు కప్పుకుంది. మొన్నటికి మొన్న గాజులు చెరిపించి యేదో చేయిస్తూన్నట్టుంది.

అసలు మీ అన్నయ్యలికి బుద్ధిలేదు. ఉత్తి మట్టిముద్దలే. వీధిలోకొస్తే, హమ్మ బాబో...ఏం అహంకారం, ఏం దర్పం, ఏం భేషజం! నే నిలా అంటున్నానని నువ్వేం బాధపడకు. లేకపోతే ఏమిటే అది వీధిలో మీసాలు మెలేస్తారు, ఇంటిదగ్గర మనుషులే వాలిపోయి సలాం చేస్తారు. ఒక్కడు నోరెత్తితే యిల్లంతా గజగజలాడొద్దూ? చేరదీసి, ఆదరించినప్పుడు అదీ! చెయ్యాలి; దిగ్బంధం చెయ్యవలసివస్తే దానికి సమర్థత ఉండాలి. ఈ రెండూ పట్టుకెళ్ళి గంగిలో కలిపితే...అలా వింటూ కూర్చుంటావు కానీ 'ఊఁ' 'ఆఁ' అనవేమే!

ఇప్పుడు చెప్తున్నాను నీకు, ఏదో వంక పెట్టి మీ చెల్లిని యిక్కడికి రప్పించావా, దాని కాపరం సాగుతుంది. లేదా మీ చెల్లి గుండెలమీద మీ అమ్మ కుంపటి పెట్టినట్టే అనుకో! నిజానికి అతను మంచివాడు కనక సరిపోయింది. మీ చెల్లిని మళ్ళీ ఓసారి 'గబన్' చదవమను. అది చదవలేనంటుంది


(12-వ పేజీ చూడండి)

తీరని కోరిక

రాష్ట్ర ప్రభుత్వోద్యోగి
శివుని కొఱకై తపస్సు చేయగా
శివుడు ప్రత్యక్షమై:
శి:-నరుడా ఏమి నీకోరిక?
రా. ఉ:-స్వామీ! కేంద్ర
ప్రభుత్వోద్యోగుల
జీతాలు తగ్గించు.

—టి. వి. శాస్త్రి
హైదరాబాదు.

చలచిత్ర కథలు



విక్రమార్కుడి మార్కు సింహాసనం

ఆశ్చర్యపడ్డ గూర్ఖా విగ్రహంలా నిల్చున్నాడు ఆశ్చర్యపడ్డగూర్ఖా. అతడిచేతిలో రెపరెపలాడుతున్న పాత రూపాయినోటు చైతన్యంవల్ల ఆకాస్తీ, పోతపోసిన విగ్రహమే అన్న భ్రమ మరింత బలపడింది రాజాకు.

'రూపాయి నాదేగాని గుర్ఖా వీడు కాడు కాబోలు—వీడు విగ్రహం. బొమ్మ' అనుకున్నాడు రాజా. రూపాయి తీసుకోడానికి మనసొప్పలేదు. మరీ నోరూ వాయీలేని బొమ్మచేతిలో రూపాయ చిక్కియ్యడం బొత్తిగా ఇది అనిపించింది.

ఆ పక్కనేఉన్న ఒకాయన్ని పలకరించి, 'అయ్యా! ఇక్కడ ఆశ్చర్యపడ్డ గుర్ఖాగారు ఒకాయన ఉండాలి మీరుగాని చూశారా?' అన్నాడు.

"అదేవిటయ్యా అలాఅడుగుతావు. ఎదురుగుండా పోతపోసిన బొమ్మల్లె ఉండగా" అన్నాడు ఆయన.

"మరేండి అదే చూస్తూన్నా. ఇది పోతపోసిన బొమ్మగదా అని. అసలుగూర్ఖా కావాలండి." అన్నాడు రాజా కొంచెం సందేహంగా; బొమ్మలాఉన్న గూర్ఖావంక ఓరకంటచూస్తూ. అపుడు గూర్ఖాలాఉన్న బొమ్మ కదిలినట్టనిపించింది.

"హాదిసీ. ఏతి నే ఇందాక నేను పలకరించింది? వీరు బొమ్మలు కాదన్నమాట. ఆశ్చర్యపడ్డ నిజం గూర్ఖాలే" అంటూ తరహాలరాజా ఒకడుగు ముందుకు వేశాడు. ఓక్షణం ఆలోచించి అటూ ఇటూ చూసి, ఆ బొమ్మలా ఉన్న గూర్ఖాచేతిలో రూపాయినోటు గబుక్కునలాక్కున్నాడు. 'ఇది నాది' అంటూ.

అంతలోకే ఒకడుగు అసింటా ఉన్న ఒకడు, ఒకడుగు ముందుకువేసి "ఏయ్ మిస్టర్! ఏందయ్యా ఆ పని" అని రాజా రెయ్యి పట్టుకున్నాడు.

"య్యయ్య స్సార్. నో సార్. గుర్ఖా ఈ జెరుపీసార్. అయిమె గేట్ సార్ ...ది... దిసీజె బోల్తాసార్... అయమెబోయ్... నేను, మాది మావూరులెండి. ఈ గేటుమాని అసలు గేటనుకుని వీరికి డొరీ ఇచ్చానండి... అదే బెర్రిబు...నాది నేననుకుని."

"ఓహో అట్టనా విషయం... ఏమ్రా నిండా అవసరంగా ఉండాడు వీడు అని చూస్తిని... ఈ గూర్ఖా అటనే బొమ్మ మాదిరి ఉండాడే... వీడు దొంగపిల్లకాయ మాదిరి వాడి పక్కలో నిల్చున్నాడే... ఏమ్రా కతా,అని యోచన చేస్తినీ...అద్దాని

ఎస్. పార్థసారధి

బ్రదర్, ఈ కిల్లాడి పిల్లకాయలతో నిండా తొందరు వా పోచి ... అప్పుడు ఈనోటు నీదిదా ని... వీనికి బ్రైబ్ ఇస్తివా ?...యేమి ఇదిదా స్టుడియో గేటు అని ఎంచుకున్నావా ...హుడరామా... సరియాన వేళై ... అడ! ఎన్నబా ఆమాదిరి కన్నులో చూస్తావే..." అన్నాడు. ఆ ఒకడు.

"సార్. మీరు చెప్పేది తెలీలేదండి. వెరీడిఫికల్టు. వెళ్ళొస్తా. గేటు తీశారు... వస్తానండి గూర్ఖాగారూ. క్షమించండి" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు రాజా.

పదడుగులు వేసేవరకూ ఇందాకటాయన అదరా బాదరా వచ్చి కలుసుకున్నాడు.

"ఏవండి మిస్టర్." అన్నాడు.

"అరె మీకు తెలుగొచ్చునే" అన్నాడు రాజా ఆశ్చర్యపోయి మళ్ళీ వచ్చి.

"నాకు అన్ని భాషలూ వచ్చును. ఇందాక ఊరికే రానట్టు మాటాడాను.

సరేగాని ఎందాక ?" అన్నాడు.

"గేటుదాకా."

"ఏ గేటు ?"

"అదే."

"ఓ... నీపేరు"

"వి. రాజా. నీది ?"

"టమిల్ కంపెనీలో అయితే రాఘవాధన్. తెలుగువాళ్ళ దగ్గిర రామనాథం."

'ఎందుకూ అలా ?'

"అంతా వుందిలే—గాని నీకు గేటవతల ఎవరు తెలుసు ?"

"చాలామంది. నాగిరెడ్డి అండ్ చక్రపాణి, బి. ఎన్. కె. వి; నాగయ్య ఇంకా చాలామంది తెలుసు ?"

మనిషిన వ్వాడు.

"బాబూ మంజేవూరన్నావూ ?"

"ఏవూరూ అనలేదే ?"

"ఏదైతేనేంగాని కోతలు కొయ్యడం ఇలాకాదు. నే చెబుతా పట్టు కావాలంటే... పూర్వం నేనూ దిలీప్‌కుమారూ కలిసి ఓ గదిలో అద్దెకున్నపుడు ఇలాగే తెలీక—"

"సార్! మీరూ దిలీప్‌కుమారూ కలిసి ఓ గదిలో అద్దెకున్నారా! అయ్య బాబోయ్. నిజమే ?" అన్నాడు రాజా.

'ఏం అందులో ఆశ్చర్యం ఏముంది ?... నేను అతనూ ఓ కంచంలో తిని ఒక మంచంలో పడుకొని'

"రెండేసి ఉండేవి కావా"

"అప్పు డెక్కడుండేవిలే ... గాని... అలా మేం ఉండగా, ఇంకో ఫ్రెండొచ్చి, సార్ మీరు మాయింటికివచ్చి నాకంచంలో తినాలని బతిమాలాడునన్ను. సరేననివిచారిస్తే ఎత్తేశాను అక్కడికి దిలీప్ వద్దయ్యా అంటూ నేఉన్నాడు. నేను విన్నానుకాదు. తీరా వెళ్లాళ్ళేసరికి అతను గబుక్కుని గొప్పవాడైపోయి అవెళ్లిపోయాడు. నేను

శ్రీ హైమవతీ శివాత్రినయని

(10-వ పేజీ తరువాయి)

కానీ 'వేయి పడగలు' చదివినా దానికి కొంత అర్థమవుతుంది. మీ అమ్మ కేమిటిలే కడుపు నిండిన బేరం. పురాణాలూ, హరికథలూ, పూజలూ, పుష్కర స్నానాలూ అన్నీ సాగిస్తుంది.

అయితే మీ అమ్మ బెజవాడ కనకదుర్గ సన్నిధానానికి వెళ్ళదులే? అయితే ఆవిడ పంచాంగంలో యింకా గురుడు కన్యా ప్రవేశం చెయ్యలేదేమోలే! ఈవిడ ఈ యాత్రలకు పోసే డబ్బు పెడితే మీ చెల్లెళ్ళు ముగ్గురికీ మువ్వల వడ్డాణాలు అమిరేవి!

సరేలే, ప్రభుత్వమే పుణ్యం కట్టుకుంటోంది, వస్తువాహనాలు స్వాధీనం చేసుకుని. ఈలోగా మీ చెల్లి లాంటి వాళ్ళెందరు అవస్థపడాలో. మీఅమ్మ నోటికి భయపడి కాదూ మీ మేనత్త కొడుకు నివ్వనంట, చింతచచ్చినా పులుపు చావదనీ, పళ్ళూడినా గొంతుపోలేదు!

కానీలే, ఆవిడ పుణ్యం బావుంది. మగాడై పుట్టవలసింది అసలు. అలా అయితే మరి మీ అందర్నీ ఎలా హింసిస్తుందిలే. అయినా ఏమిటో నాకు బుద్ధిలేక కానీ, మీ అమ్మ గొడవ నాకెందుకే. ఏదీ ఆ లాగూ, చొక్కా ఇలా పారెయ్యి. తిన్నది అరక్క ఏదో అనటం, దాన్తో నేను నీ మనస్సు పాడుచేసి బాధించటం, ఎందుకులే!

అహాఁ,

నువ్వన్నావని కాదు. నాకు మాత్రం తెలవొద్దులే ఆపాటి! ఎంతచెడ్డా, నిన్నుకన్న తల్లి, నాకు సాక్షాత్తూ అక్షరాలా అత్తగారూనూ. అంచేత ఆవిడకూ, ఆవిడకన్న కూతుళ్ళకూ నా సలాంలు.

మళ్ళీ నేను మరిచిపోతానేమో మీ మరిది ఎల్లుండిరాత్రి మేలులో వస్తున్నాడు.

నవ్వుతావెందుకే, మేలు నాలుగింటికే కదా వస్తుందీ, రాత్రి జనతా వస్తుంది. ఔనా? నాకు తెలుసులే, నీ కోరవవ్వు! కానీ ఈ ఎండలకు తాళలేక మేలు రాత్రి పూట ప్రయాణం చేస్తోందట. రాత్రి పదింటికి వస్తుంది. దాని తరవాత రావలసినదే కనక, జనతా ఫీంకరిస్తూ ఉదయం ఎనిమిదింటికి వచ్చి మూడువందల అరవై నిమిషాల ఆలస్యాన్నీ ఇక్కడ దులుపుకుంటుంది. తెలిసిందా?

ముందు నీ మృదుహస్తంతో ఆ పాడు సిగరెట్టొకటి నా పెదవులమధ్యనుంచి అగ్గిపుల్ల గీయగదవే అలినీలవేణీ, శివారాధ్య సుందరీ...ఔను కానీ ఒసే, ఇలా చూడూ, మీనాన్న మీయింట్లో అందరికీ ఆదిశక్తి స్వరూపంయొక్క పేర్లే పెట్టాడేమే! మీ అమ్మ పరాశక్తి కనకనా!

ఏదో మీనాన్న ఏంచేస్తే నాకెందుగ్గానీ. తొందరగా అగ్గిపుల్ల ముట్టించు. వారం రోజుల్నుంచి రోజూ కాలేజీకి ఆలస్యమే అవుతోంది. ఈ వేళకూడా ఇంతే అయితే, ఆయన మూలుక్కుంటాడుకూడా. పాపం! మా ప్రిన్సిపాలుకూడా మీ పెద్దన్నయ్య లాంటివాడే నే. బహు సౌమ్యుడు సుమీ.

ఊఁ లేచి చంటాడు సంగీతం మొదలెట్టినట్టున్నాడు చూడు...సెలవా దేవీ!" ★



విక్రమార్కుడి సింహాసనం

(1(వ పేజీ తరువాయి)

ఇటొచ్చేశాను. అంతేగా."

"మరి ఇపుడెళ్తే మాటాడ్డా అండీ?" అన్నాడు రాజు గజ గజ వణకిపోతు.

"ఎందుకు మాట్లాడ్డు... నేనంటే ఎంతో గౌరవం. కావలిస్తే నీకు ఛాన్సిప్పిస్తా కాని...అలా వణికిపోతున్నావెందుకు?"

'భయభక్తుల మూలాన్నండి.'

'నామీదే? ఆయ్యా బాబోయ్!' అన్నాడు పక్కాయన.

'కాగు మరి నా షోత్తూ దిలీప్‌కుమార్ చేస్తాలు మీరు! ఒక్కసారి ముట్టుకో నిస్తారు?'

'కానీ, నిన్ను నిరుత్సాహపరచడం ఆటే ఇష్టం లేదు నాకు.' అని చూపుడు వేలు జాచాడు రామనాథనాథం.

ధనాధన ధనాధనమంటూ ఎలక్ట్రిక్ రైలు వెళ్ళిపోయింది.

తుళిపడి మేలుకుని కళ్ళునులుపుకున్నాడు రైలు గేటుకు చేరబడ్డరాజు. (సశేషం)

ద్వారం దగ్గర అడుగుల చప్పుడు విని, అంతవరకూ దీర్ఘంగా ఆలోచిస్తున్న ఇందిర ఓ నిట్టూర్పు విడిచి లేచి నిలబడింది.

"ఏమిటింకా డ్రస్ చేసుకోకుండా అలానే ఉన్నావ్. పిక్చరుకి రావాలని లేదా?" అనుకొంటూ లోపలికి వచ్చాడు చలపతి.

ఇందిర సమాధానం ఇవ్వలేదు. ఆయనకూ తనకూ మధ్య మిగిలిపోయిన దూరాన్ని అడుగులతో కొలుస్తున్నట్టు మెల్లగా దగ్గర కొచ్చి ఓ కవరు అతనికిచ్చింది.

"ఏమిటిది?" ఆశ్చర్యంగా చూస్తూ అందుకున్నాడు.

"అప్లికేషన్ ఫారమ్"

"ఎందుకు?"

"ఉద్యోగానికి."

"ఎవరికి?"

"మీకే!"

చలపతి ముఖద్యుతులు మారాయి. ఓసారి భార్యను ఎగాదిగా చూసి కవరు నందుకొని కుర్చీలో కూలబడ్డాడు. ఏదో తప్పదన్నట్టు ఆ నాలుగు పేజీలు ఇటూ అటూ తిప్పేసి "ఊఁ" అన్నాడు విడుస్తున్న నిశ్వాసంలో విచిత్రంగా.

"రిజిస్టరు చెయ్యండి."

ఠప్పున తలెత్తి చూశాడు; నోట మాట పెగల్లేదు. కుర్చీలోనుంచి లేచిపోయి కాగితాన్ని టేబిలుమీద పడేసి సిగరెట్టు వెలిగించుకొంటూ కిటికీవేపు నడిచాడు.

ఈ నిర్లక్ష్యం ఇందిరకు మహాకోపాన్ని కలిగించింది. ఎప్పుడు ఉద్యోగంమాట ఎత్తినా ఆయన ఇదే మౌనాన్ని ప్రదర్శిస్తారు. పోనీ వెనక వీళ్ళూ వాళ్ళూ గడించిపోయిన ఆస్తంటూ ఒకటివుండి ఇలా ఆటలాడితే ఒకమాట-అదికాదు! ఈవాళవుంటే రేపటికి నమ్మకంలేని బ్రతుకులు. ఏంచూసుకొని ఇంత ధీమానిర్లక్ష్యం? గోచీకి, అంగవస్త్రానికీ చాలని ఆ ఎకరంభూమీ చూసుకొనా ఈ పనికిరాని సుభాషితాలూ, ఆత్మాభిమానాలూ?

ఎంతయినా ఆవేశం ముంచుకొచ్చింది. కాని నిగ్రహించుకొని అడిగింది. "ఏమంటారు?"

చలపతి ఆమెముఖాన్ని తప్పించుకొంటూ రెండోవేపునించి వెనక్కి తిరిగి తిన్నగా మళ్ళీ కుర్చీదగ్గరకు వచ్చాడు. ఏంచెప్పడానికీ తోచలేదు. ఆమె అడిగినపుడల్లా ఏదో ఒకసమాధానంచెప్పి తప్పించుకొంటూ వుండేవాడు. కాని ఈమధ్య కొంతకాలంగా ఇందిర కంఠంలో కోపాన్ని, కాఠిన్యాన్ని గ్రహించాక ఆమెదృష్టిని మరోవేపుకి త్రిప్పడానికి శతవిధాలా ప్రయత్నంచేసి విఫలుడయ్యాడు. మామూలుగానే ఈవాళకూడా పాతపాట పాడాలనుకున్నాడు. ఎందుకో మనస్సు సంకోచించింది. ఇక మిగిలిందల్లా ప్రాధేయపూర్వకంగా తన హృదయాన్ని విప్పి చెప్పుకోవడమే.

"ఉద్యోగం చెయ్యాలని లేదు ఇందిరా" అన్నాడు పొడిగా.

"లేదూ? ఏం?"

యన్. ఆర్. నంది

నోటివరకూవచ్చిన జవాబుని క్రిందికిజారనిచ్చాడుకాదు. 'ఉద్యోగం బానిసచిహ్నం' 'ఉద్యోగంలోచేరాక వ్యక్తిత్వం చంపుకోవాలి ఇందిరా' 'ఆత్మాభిమానం పోయాక బ్రతికి యేంలాభం?' — ఇంకా వున్నాయి సమాధానాలు. కాని యివన్నీ పిరికివాళ్ళ చేతకానిమాటలని మొన్ననేగా అంది.

ఇందిరకు ఆపుకోలేని ఆగ్రహం వచ్చింది. దాన్ని అణచుకోవాలని ప్రయత్నాలు చేసేసరికి దుఃఖం ముంచుకొచ్చింది.

"ఉద్యోగం చెయ్యకండి. బ్రతుకు బ్రతుకంతా ఓ అభూతకల్పనలా బ్రతికెయ్యండి" అంటూ చెప్పింది.

చలపతి ఠప్పున వెనక్కి తిరిగాడు.

"ఈపూడు బ్రతుక్కి మాత్రం అప్పులు చేసి రంగులు వెయ్యడం నేర్చుకొండి."

"అప్పులా?"

"కాదు; భిక్షం..."

"ఇందిరా!"

"ఎందుకలా గొంతుక చించుకొని అరవటం? సోమేశ్వర్రావుగారి దగ్గర అయిదు వందలు అప్పు చెయ్యలేదూ?"

చలపతి షాక్ కొట్టినట్టు కొయ్యబారిపోయాడు.

"ఐదువందలు...సోమేశ్వర్రావు... నాకప్పిచ్చాడా?"

"ఒక్కసారే కాదు: నెలనెలా పాతిక్కా, ఏభై చొప్పున తీసుకొన్న డబ్బట. క్రితం వారం కూడా తీసుకున్నారట!"

చలపతి దిగ్భ్రమతో దిమ్మెక్కిపోయాడు. ఒక గుటకవేసి నోరావలించి అలా శిలాప్రతిమలా వుండిపోయాడు. అయితే-అయితే ఇదంతా సోమేశ్వర్రావు అప్పుగా రాసుకొంటున్నాడన్న మాట! గుండె ఆగినంత పనయింది. అలానే రామారావు, భానుమూర్తి, ప్రసాదరావు కూడా రాసుకొంటూవుంటే తను వాళ్ళ దగ్గరనుంచి తీసుకున్న డబ్బు ఈ పాటికి ఎంతయి వుంటుంది!? బెదురు చూపులతో గదినంతనీ కలియచూశాడు. ఇందిర కనిపించింది! ఏదో అంటోంది! వినిపించటంలేదు. ఏదో ఒక సమాధానం చెబితేనే గాని వాతావరణం మారేటట్లులేదు మెల్లగా ముందుకి రెండడుగులువేసి వొణుకుతున్న కంఠంతో స్థయిర్యాన్ని నింపుకుంటూ అన్నాడు:

"ఆ డబ్బు నేనెప్పుడూ అతని దగ్గరనుంచి అప్పుగా తీసుకోలేదు ఇందిరా..."

అతనినోట్లో మాటలు నోట్లో వుండగానే ఇందిర ఆశ్చర్యంగా—"అప్పుగా తీసుకోలేదూ!" అంది.


"ఆఁ! స్నేహంపట్ల అడిగేవాణ్నిగాని—"

"స్నేహమా? డబ్బుకీ స్నేహానికీ లంకె ఏమిటి?"

చలపతి తడబడ్డాడు.

"అసలు ఆయన దగ్గరనుంచి డబ్బు తీసుకోవాల్సిన అవసరమే మొచ్చింది? ఎందుకు?"

ఇలా సూటిగా ప్రశ్నించిందేకాని నిజానికి తనకికూడా వాటి సమాధానాలు తెలుసు. స్నేహితులదగ్గరనుంచి పదే పదే డబ్బు తీసుకోవడం, వాటిని తిరిగి ఇచ్చే బాధ్యతను మీద వేసుకోక పోవడం, ఇందిరకు సిగ్గనిపించేది. అయినా తన అభిప్రాయాన్ని ధర్తకి చెప్పేది కాదు. ఈ మౌనం చలపతిని కొంతవరకు ప్రోత్సహించిందేమోనని అనుమాన పడినపుడు



★ బదనిక ★

దగ్గరకు పిలిచి నాలుగు మాటలు అనాలనిపించేది. కాని ఎందుకో అతన్ని చూస్తే చాలు అతిజాలితో ఆర్ద్రమైపోయేది. ఇక యీనాడు సోమేశ్వరరావు యింత చెప్పి వెళ్ళిన తర్వాతనైనా ముందు జాగ్రత్త కోసం ఆయన్ని హెచ్చరించకపోతే లాభం లేదని—

"నేనెందుకు చెబుతున్నానో కాస్త వినిపించుకోండి. ఉద్యోగాలు చేసేవాళ్ళంతా వ్యక్తిత్వాలని చంపుకున్నవాళ్ళు కారు. జీవితసత్యాన్ని తిరస్కరించి కృతకజీవితాన్ని గడపాలంటె ఎంత అసాధ్యమో ఆలోచించండి. కడుపుకోసం ఉద్యోగాలు చేయటం తప్పయినపుడు స్నేహితులనుండి డబ్బు తీసుకోవడం ఒప్పవుతుందా?" అంది.

"ఉన్నవాళ్ళ దగ్గరనుంచి డబ్బు కొంత తీసుకోవటం తప్పు కాదు ఇందిరా."

"సుభాషితాలు మాటాడకండి. మీలో కూడా వాళ్ళల్లా పరిపూర్ణ శక్తులున్నప్పుడు కృత్రిమత్వాన్ని కాంక్షించడమేమిటి?"

చలపతి సమాధానం చెప్పబోయాడు కాని అంతలో రామారావు హిందుస్థానీ ఘుజల్ పాడుకొంటూ రంగంలోకి ప్రవేశించడంతో మౌనం వహించాడు.

"అరె! మీరింకా టాయ్‌లెట్టే కాలేదు" అని తన ఆశ్చర్యాన్నంతని సిగరెట్టు పొగ మీద చూపిస్తూ వాళ్ళమధ్యకు వచ్చాడు.

ఇందిర మాటాడకుండా లోపలికి వెళ్ళిపోయింది! చలపతి కూడా ఊనూరుమంటూ వేళ్ళమధ్య నలిగిపోతున్న ధూమకాష్ఠాన్ని నిశ్శబ్దంగా కిందవిడిచి కాలితో రాసేస్తూ

"నడు" అని రామారావు భుజంమీద చెయ్యి వేశాడు.

"మరి ఇందిరగారు?"

"వంట్లో బావులేదట!"

రామారావు ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"మరి కొన్న టిక్కెట్లు?"

"హాలుదగ్గర అమ్మేద్దాం."

ఈ బోడి సలహా అతనికి రుచించలేదు. కుర్చీలో కూలబడుతూ "అయితే మనమూ మానేద్దాం" అన్నాడు.

చలపతికి ఏం చెప్పడానికి తోచలేదు. క్షణం తటపటాయించి. "సరే! నువ్వు ఒప్పించగలిగితే ఒప్పించి తీసుకరా" అన్నాడు.

లోపలనుంచి ఈమాటలు విన్న ఇందిరకు ఎంతయినా కోపం వచ్చింది. తను పిక్చరుకి వస్తే, రాకపోతే ఈరామారావు కెందుకు? తను రాకపోతే అతనుకూడా రానని భీష్మించుక కూచోడంలో అర్థమేమిటి?

ఈయింట్లో ఆయన స్నేహితులకున్న చనువు, స్వేచ్ఛ యెంతటిదైనా కావచ్చు. కాని అవి తనమీదికి కూడా ప్రతిఫలింపచేయడం ఇందిరకు నచ్చలేదు. ఆయన తనకంతో స్వేచ్ఛనిచ్చారు. కాని దాని పరిణామం ఎంత ఘోరంగా తయారవుతుందో ఆయన వూహించలేకపోయారు!

"వదినగారూ"

గతుక్కుమంది. రామారావ్! చప్పున లేచి నిలబడింది.

"మీ వంట్లో ఎలా వుంది?"

బాగానేవుంది! తనకేం జబ్బని? ఆయనన్నది అబద్ధం. అంత అబద్ధం చెప్పవలసిన పరిస్థితి ఎందుకు కలిగింది?

"కాస్త...తలనొప్పిగా వుంది..." అనేసింది అప్రయత్నంగా; నవ్వకుంది మనస్సులో. ఎంత సునాయాసంగా, అప్రయత్నంగా తనూ అబద్ధమాడేసింది.

"మందేదైనా—"

"అక్కర్లే అవసరంలేదు; దానికదే తగ్గిపోతుంది లెండి"

మరో క్షణం అలా నిలబడితే నిజంగా తలనొప్పివచ్చేటట్లు వుంది. ఆ మనిషి తనను ఎందుకలా పట్టి పట్టి చూస్తాడు – ఆడదాని ముఖమే ఎప్పుడూ చూడనట్టు? 'దయచేసి బయటకు వెళ్ళండి' అని ఏలా చెప్పడం? పెద్దమనిషి, లక్షాధికారి, పెద్ద సంస్కృతిపరుడు—

"నాకోసం మీరు పిక్చరుకి వెళ్ళడం మానకండి రామారావుగారూ" అని మెల్లగా వంటగదిలోకి వెళ్ళిపోయింది—అతన్ని అక్కడినించి పంపించివేసే ఉపాయం అదొక్కటిగానే కనిపించింది.

నిట్టూర్పు వినిపించింది.

క్రమేపీ అడుగులశబ్దం దూరమయింది...

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత ఆయన గదిలోనుంచి మాటలు వినిపించాయి:

"రేపు మద్రాసు వెడుతున్నా పనిమీద; ఇదుగో నువ్వడిగిన ఏభైరూపాయలు. మరి ఈ వాళకు సినీమా ప్రోగ్రామ్ కాన్సిల్." అని రామారావు గొంతుక.

తర్వాత అడుగుల చప్పుడు.

నోట్లని గప్పున జేబులో కుక్కుకున్న చలపతిని చూసి అసహ్యం, దుఃఖం, కోపం, కృచ్ఛ్రిం ముంచుకొన్నాయి ఇందిరకు. కళ్లు మూసుకొని పరుపుమీద వాలిపోయింది.

మర్నాడు ప్రొద్దుట మామూలుగానే ఇందిర కాఫీచేసి చలపతికిచ్చింది. అతను కప్పు అందుకున్న వెంటనే వెనక్కి తిరిగిపోయింది.

"ఇందిరా"

ఆగింది.

కాఫీకప్పు టేబిలుమీద పెట్టి దగ్గరకువస్తూ "కోపమా?" అన్నాడు.

"అబ్బే" అని చరచర లోపలికి వెళ్ళిపోయింది.

చలపతి చాలా బాధపడ్డాడు. మనస్సంతా వికలమయింది. సిగ్గుతో నిలువెల్లా కంపించిపోయాడేమో, శరీరంలోని రక్తమంతా పాదాల్లోకి పరుగులుతీసింది. నిట్టూర్పువిడిచి కాఫీ తాగకండానే బయటకు వెళ్ళిపోయాడు.

దారిపొడుగునా ఇదే ఆలోచన: ఇందిర తనని అసహ్యించుకొంటోందా? తనని అర్థం చేసుకోలేకపోతోందా? అర్థం కాకపోవడానికి తనంత అర్థంకానిమనిషా?

గృహవిషయాలమీద ఆడవాళ్ళకు సహజమైన భీతి వుంటుందంటారు. అందుకే నా ఇందిర తన ఉద్యోగవిషయమై ఇంతగా హెచ్చరిస్తోంది? రెండుప్రాణాలకి మహా అయితే ఏభైరూపాయలు కావాలి నెలకు. స్వంతానికింత యిల్లువుంది. పదీపాతిక కౌలుదారులు పంపిస్తున్నారాయెను. ఇహ తమకు కొదవలసిందేవిటి?

ఎన్ని వున్నా చలపతికి జీవితంలో ఏదో కలిమి వున్నట్టు అనిపించేది. దాని స్వరూపాన్ని నిర్ణయించుకొనే శక్తి లేకపోయినా అది ప్రతిక్షణం బాధపెట్టేది అతన్ని.

ఉద్యోగం చెయ్యకపోతే బ్రతకడమెలా అని చాలాసార్లు అనుకున్నాడు. కాని తను కున్న ధనవంతులైన స్నేహితుల్ని చూశాక ఆ భావం దానికదే తుడిచిపెట్టుకపోయేది. తను వాళ్ళను అడిగినదే తడవుగా ఎంతయినా డబ్బు యిచ్చేవారు. అయితే వాళ్ళని తను అర్థిస్తున్నట్టుగాని, వాళ్ళు తనకిచ్చేది ధర్మమునిగాని ఒకనాడూ భావించలేదు.

గప్పున ఆగిపోయాడు—ఎవరిదో చెయ్యి భుజంమీద బరువుగా పడడంతో,

"ఎక్కడికోయ్ అంతకంగారుగా పోతున్నావ్?" అన్నాడు ప్రసాదరావు.

"అహఁ ఎక్కడకూ కాదు—అలా ఊరికే బయలుదేరా."

"ఇంత ప్రొద్దుటా?"

చలపతి సమాధానం చెప్పలేదు.

ఇద్దరూ కొంతదూరం నడచారు.

"ఇందిరకు ఒంట్లో బాగులేదట!"

గప్పున కనురెప్పలెత్తి చూశాడు చలపతి స్నేహితుని ముఖంలోకి.

"ఇందిరకేం జబ్బు? అబ్బే బాగానే వుందే!" అన్నాడు ఆశ్చర్యంగా చలపతి.

"అహ, రాత్రి రామారావు అంటే అడుగుతున్నా!"

చలపతి తలవూంచుకున్నాడు. అవును! నిన్న తనేగా ఇందిరకు బాగులేదని రామారావుతో చెప్పాడు! నిన్న జరిగిన విషయాలన్నీ ఒక్కటే ఒక్కటి జ్ఞప్తికి రాసాగినై.

"ప్రసాద్! ఒక విషయం నిన్నడగాలని వుంది" అన్నాడు మెల్లగా.

"ఏవిటి?...డబ్బేమన్నా...?"

"కాదు...ఇంతవరకు నువ్వు నాకిచ్చిన డబ్బెంతో జ్ఞాపకముందా?"

"లేదు"

"రాసుకోలేదు?"

"లేదు"

"ఏం?"

ప్రసాదరావుకి సమాధానం గప్పున స్ఫురించలేదు.

"సోమేశ్వర్రావు మాత్రం రాసుకుంటున్నాడు. అతని కిప్పుడు అయిదువందలు నేను ఋణపడి వున్నట్టు లెఖ్ఖ. అలాగే నీకుకూడా నేనెంతివ్వాలో చెప్తే—"

ప్రసాదరావు ఆతని మాటలకు అడ్డొస్తూ "నేనా డబ్బుని నీకెప్పుడూ అప్పుగా యివ్వలేదే!" అన్నాడు.

"మరి?"

"స్నేహితుడవని—"

చలపతి ఒకగుటక వేసి మెల్లగాఅన్నాడు: "ఇకనుంచి నేనడిగినా యివ్వకండా వుండగలవా?"

ప్రసాదరావు ఆశ్చర్యపోతూ "ఏం?" అన్నాడు.

"మీదగ్గరనుంచి నేను డబ్బు తీసుకుంటున్నానేగాని ప్రతిగా మీకేం ఇవ్వడంలేదు. అలాంటప్పుడు ఏం బాగుంటుంది?"

ప్రసాదరావు చిరునవ్వు నవ్వాడు.

"ప్రతిగా నువ్వు నాకేం యివ్వలేకపోతున్నావనే ఈ బాధంతా? ఫర్వాలేదులే—" అని భుజం తట్టి వెళ్ళిపోయాడు.

ఆ నవ్వు చాలా వింతనిపించింది చలపతికి. ఏవో అర్థాలు వుండొచ్చనుకొని వెంటనే నాలిక కొరుక్కున్నాడు.

మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఓ జార్జెట్ చీర పాకెట్‌తో పయితం తిరిగి వచ్చాడు. వస్తూనే వంటింట్లోకి వెళ్ళి ఇందిరకు అందించాడు.

"ఎక్కడిది?" అంది.

★ బదనిక ★

"కొన్నాను."

"డబ్బు?"

"రైతు పంపించాడు."

అది పచ్చి అబద్ధమని ఇందిర గ్రహించక పోలేదు. ఏహ్యంతో ముఖమంతా మారిపోయింది. ఇక తానేం ఆయనకు చెప్పదలచుకోలేదు. చెప్పి ఆయనలో మార్పు తీసుకరావడం కష్టమని గ్రహించింది. భవిష్యత్తుమీద భారాన్ని వేసి మౌనంగా వుండాలని నిశ్చయించుకొంది.

నిర్లక్ష్యంగా ఇందిర అక్కడనుంచి వెళ్ళిపోవడంతో చలపతి క్రుంగిపోయాడు. అసలక్కడికి సగం భయంతోనే వచ్చాడు. నిన్న జరిగిన కలహాన్ని ఈ చిన్న బహుమానంతో కప్పివేయాలనుకున్నాడు. కాని ఫలితం వ్యతిరేకం కావడంతో మరింత భయపడి కొన్నాళ్ళవరకు ఆమె యెదుట నిలబడడానికే సాహసించలేకపోయాడు.

మారిన అతని ప్రవర్తనకు ఇందిరకూడా చాలా బాధపడింది. తనతో అతను మాటాడకుండా వెళ్ళిపోతున్న క్షణాలు జ్ఞప్తికి వచ్చినపుడల్లా కడుపు దేవినట్లనిపించేది. తలగడలో ముఖం దాచుకుని ఏడ్చుకునేది.

ఒకనాడు యిహ మరి ఆగలేక ఒక నిశ్చయానికి వచ్చింది. సాయంకాలం అతను బట్టలు వేసుకొంటూంటే అతని దగ్గరకు వెళ్ళి:

"నేను రాజమండ్రి వెళ్ళిపోతున్నాను." అంది.

దెబ్బతిన్నవాడిలా ఉలిక్కిపడ్డాడు. తప్పున వెనక్కి తిరిగాడేగాని ఆ మానిని ముఖంలోకి చూసే ధైర్యం చాలక తల వంచుకొని:

"ఎప్పుడు?" అన్నాడు.

"ఈ బండికే!"

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. తర్వాత ఉడిగిపోతున్న శక్తులన్నిటిని కూడగట్టుకొని అడిగాడు. సగం స్వగతంగా.

"ఎందుకు?"

"ఆ సమాధానం మీకు తెలుసు" అని చరచరా వంటింట్లోకి వెళ్లిపోయింది.

కొంతసేపయాక పెట్టెపట్టుకొని మధ్యగదిలోని వచ్చేసరికి చలపతి లేడు. దుఃఖం, కోపం, ఆవేశం ముంచుకొచ్చాయి. మనస్సు శాంతించేవరకు తల గోడకేసి కొట్టుకోవాలన్నంత ఉద్రేకం వచ్చిపడింది. కాని అంతలో__

"ఏమిటే, ఎక్కడికి ప్రయాణం వదిన గారూ?" అనుకొంటూ రామారావు రావడంతో కళ్ళల్లో నిలచిన నీటిబిందువులను తుడుచుకోడానికి ప్రయత్నించింది.

ఈ దృశ్యాన్ని రామారావు చూశాడు. సిగరెట్టు పారేసి దగ్గరగా వచ్చి

"చలపతి ఏమన్నా అన్నాడా?" అన్నాడు ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ.

"అబ్బె, లేదండి".

"మరి?"

ఇందిర సమాధానం చెప్పలేదు. లోపలికి వెళ్ళిపోయే వుద్దేశంతో వెనక్కి తిరిగేసరికి రామారావు గప్పున ఆమె చెయ్యిపట్టుకొని:

"నాకు తెలుసు ఇందిరా నీ బాధ. చలపతిని కట్టుకున్నందుకు నువ్వెంతగా కృంగిపోతున్నావో నా కర్థం కాలేదనుకోకు." అన్నాడు.

ఇందిరకు అంతా అయోమయంగా అనిపించింది. ఏమిటి తన ఉద్దేశ్యం ఇలా అనటంలో? భయంతో నిలువెల్లా కంపించిపోతూ అతని చేతిలోనుంచి తప్పించుకొంది.

"క్షమించండి, నే నెప్పుడూ బాధపడటంలేదు" అంది. రామారావు అదోలానవ్వాడు.

"ఇలా ఆత్మవంచన చేసుకొని ఎన్నాళ్ళుండ గలవ్?"

"నే నేం ఆత్మవంచన చేసుకోవటంలేదు"

"నా మాట విను ఇందిరా. ఆడవాళ్ళకు అందం అభరణం. మగాడికి డబ్బు దివ్యత్వాన్నిస్తుంది. దరిద్రుడైన భర్తదగ్గర నీ అందాన్ని నాశనం చేసుకోనేకంటే ఆత్మవంచన యింకేముంటుంది"?

"నా అందానికి మీరు జాలిపడనవసరం లేదు. వెళ్ళండి. లేకపోతే కేకలువెయ్యాల్సి వస్తుంది."

రామారావు వెరగబడి నవ్వాడు. ఏమనుకున్నాడో వెళ్ళిపోయేటట్టు వెనక్కితిరిగి గప్పునవచ్చి ఇందిరను రెండు చేతులలో బంధించివేశాడు. భయభ్రాంతులతో ఇందిర గొంతుక పూడుకుపోయింది. కౌగిలి మరింత బిగిసింది. ఇందిరకు శ్వాస ఆగినంతపనయింది.

తలుపులు భళ్లున తెరచుకున్నాయి.

కౌగిలి విడిపోయింది.

ద్వారందగ్గర సోమేశ్వరరావు, చలపతి!

రామారావు నిలువెల్లాకంపించిపోయాడు.

ఇందిర నిలబడ్డపాటున కుప్పలా కూలిపోయింది. చలపతి పరుగున వచ్చి పట్టుకున్నాడు.

ఇందిర చిన్నపిల్లలా ఏడ్చింది. ఓదార్చబోయిన చలపతిని నెట్టివేసింది. సోమేశ్వర్రావు ద్వారందగ్గరే అలా నిలబడిపోయాడు.

ఇందిర కళ్లుతుడుచుకొంటూ లేచి నిలబడి "ఈ యింట్లో మీరు నాకూ, మీ స్నేహితులకూ యిచ్చిన స్వేచ్ఛకి పర్యవసానం యిది." అంది వణికే కంఠంతో.

సోమేశ్వర్రావు దగ్గరగా వచ్చాడు. ఇదే సమయమన్నట్టు రామారావు మెల్లగా జారుకున్నాడు. ఇందిర దుఃఖాన్ని ఆపుకుంటూ "నేను వెళ్ళిపోతున్నాను మా యింటికి" అంటూ పెట్టెతీసుకొని వెళ్ళిపోయింది బయటకు.

చలపతి ఈ దెబ్బనుంచి తేరుకునేసరికి సోమేశ్వర్రావు చెయ్యి అతని భుజం మీదవుంది.

"ఇందిర వెళ్ళిపోతోంది" అన్నాడు అస్పష్టంగా.

"వెళ్ళనియ్."

"వీల్లేదు."

"నువ్వామెను వెనక్కి తీసుకరాలేవు."

"తీసుకొస్తాను."

"సరే, తీసుకొచ్చి ?"

చలపతిరావు విచిత్రంగా సోమేశ్వర్రావు వైపు చూశాడు. సోము నవ్వుతూ భుజం తట్టాడు.

"నువ్వు పిరికివాడవు చలపతీ. జీవితాన్ని ఎదుర్కోవడం నీకు చాతకాదు. అందుకని రూపసి అయిన భార్యను ముందుపెట్టుకొని ఆమెద్వారా, ఆమె నీడక్రింద బదనికలా బ్రతకాలనుకున్నావ్. కాని నీకు లేని ఆత్మాభిమానం ఆవిడకుంది."

చలపతి నోరావలించి ఆశ్చర్యంగా చూడ మొదలు పెట్టాడు.

"స్నేహితులకు ఆమెను పరిచయంచేసి, ఆ స్నేహంతో మమ్మల్ని వంచించబోయావు. నీ చేతకానితనాన్ని ఆధారంగా తీసుకొనే రామారావు ఈనాడు ఇంత అఘాయిత్యానికి తలపడ్డాడు. నాకివన్నీ తెలిసే నిన్ను హెచ్చరించడం కోసం నాకు నువ్వు అయిదు వందలు యివ్వాలని ఇందిరతో చెప్పి ఆ భయంతోనైనా ఉద్యోగంలో చేరతావని అప్లికేషన్ ఫారమ్ తెచ్చాను. కాని నువ్వేంచేశావ్ ?"

చలపతి ఎటూ చెప్పలేక చప్పున సోము రెండు చేతులూ పట్టుకొని:

"నన్ను క్షమించు సోమూ! నిన్నర్థం చేసుకోలేకపోయాను" అంటూ, సోము సమాధానమైనా వినకుండా స్టేషనువేపు పరుగెత్తాడు.

★

భాగ్యరేఖ

కొడవంటి లీలామోహనరావు

సాయంత్రం నాలుగైంది. ఇంకా ఎండ ఎక్కువగానే వుంది. ఆఫీసుపనితో బాగా అలసిపోయాను. వెధవపని ఎంతకీ తెమలదు. ఇంకో గంటసేపు పనిచెయ్యాలి. బద్దకంగా ఒళ్లు విరుచుకుని, కాళ్లు చాపుకుని కుర్చీకి చేరబడ్డాను. ఆవులిస్తూ వీధిలోకి చూసాను, అంతే! తెరిచిన నోరు అలాగే వుండిపోయింది. ఆశ్చర్యం! ముసలాయనకు మతిపోలేదుకదా! అనుకున్నాను.

భోగారావుగారు తను పెంపుడు కుక్కపిల్లను పోస్టుబాక్సును అందేట్టు ఎత్తిపట్టుకున్నాడు. ఆ కుక్కపిల్ల తన నోటితో పట్టుకున్న కవరుని మెల్లగా బాక్సులోకి జారవిడిచింది. వెంటనే ఆయన దాన్ని తీసుకొని వెళ్లిపోయాడు. ఆయన్ని పిలుద్దామనుకొన్నాను కాని నా కెందుకులెమ్మని వూరుకున్నాను. ఆయనతో నాకు బాగా పరిచయముంది. మా ఎదురింటివాడాయెను. ఆ మాత్రం పరిచయం వుండదా? పరిచయమేమిటి స్నేహమేను! ఇంతకీ ఆయనే నాతో మొదట్లో స్నేహం కలిపాడు. రిటైరైపోయాడాయెను. ఏం పనుంటుంది? ఎప్పుడూ వీధరుగుమీద కూర్చుని నేను కన్పించినప్పుడల్లా పలకరించేవాడు.

ఆయనతో వచ్చిన చిక్కేమిటంటే తక్కిన వాళ్లని మరి మాట్లాడనివ్వడు. తన గొడవే ఏకధాటిగా చెప్పుకుపోతాడు. పేపరు చదువుతున్నప్పుడుగాని నేను కన్పించానంటే...అంతే! పేపరు కిందపడేసి, కళ్లజోడు తీసేసి నన్ను ఆహ్వానిస్తాడు. నేను మొహమాటంచేత వెళ్లి ఇబ్బందిగా కూచుంటాను. ఇంకపనుందని లేచి వచ్చేసేవరకూ రాజకీయాలమీద ఒకటే లెక్చరు! ఆదివారం వచ్చిందంటే...ఆ రోజు ఆయన నన్ను వదల్రంటే నమ్మండి! విశ్వనాథం, అంటే భోగారావుగారి కొడుకు, ఓరోజు అన్నాడు నాతో "మా నాన్నగారు బొత్తిగా హడావుడి చేసేస్తుంటారండీ...బొత్తిగా ఇల్లంతా బేజారెత్తించేస్తుంటేనూ...!" అతనూ నాలాగే ఏదో వుద్యోగం చేస్తున్నాడు. కాని

భోగారావుగారు, తాను తాశీల్దారుపని చేసేటప్పుడు బాగా నగదు వెనకవేసినట్టున్నారు. అంచేత మంచి హోదాగా జరిగిపోతోంది వాళ్లకి.

ఇంతకీ నన్నాశ్చర్య పరచిన విషయం ఏమిటంటే, భోగారావుగారికి ఆ కుక్కపిల్లమీద ఎందుకంత మమకారం కలిగింది అని! మొదటినుండీ అలా మమకారం చూపినట్టైతే నాకాశ్చర్యం కలగకపోను. కాని ఆ కుక్కపిల్ల కన్పించగానే చీదరించుకొనే ఈయన ఈనాడు హఠాత్తుగా దాన్ని తన వెంట పోస్టాఫీసుకు తీసుకువచ్చి దానిచేత పోస్టుబాక్సులో కవరు వేయించాడంటే నేనాశ్చర్యపడకుండా వుండలేకపోయాను. ఏదో తన మనవలు సరదాపడి "బేబీ" అని పిల్చుకుంటూ ఆ కుక్కపిల్లను పెంచుకున్నారే అనుకోండి. తనకెందుకులెమ్మని వూరుకోకుండా ఈయనగారు దాన్ని చూచినప్పుడల్లా చీదరించుకొని తన మనవలను తిట్టితిట్టి వదిలిపెట్టేవాడు. అలాఅని అది విధికుక్క అనుకునేరు – పెద్ద జాతికిచెందిన విక్షేపంలాంటి బొచ్చుకుక్క! కాని అదేమిటోఆయనకు కుక్కజాతంటేనే అసహ్యం. అటువంటి ఆయన తనవెంట ఆ కుక్కపిల్లను తీసుకువచ్చాడంటే నిజంగా ఆయనకు మతిపోయిందనే అనిపించింది.

అసలాయనకు కుక్కలంటే భయం! తను చిన్నప్పుడు ఓరోజు రోడ్డంట పకోడీ తింటూ నడుస్తున్నాడట. అప్పుడోకుక్క తనమీద కురికిందట. వెంటనే పరుగు మొదలెట్టాడట. అతనికంటే జోరుగా ఆ కుక్క పరుగెట్టి అతనిమీద కెగరసాగిందట. అప్పుడు అతను భయపడిపోయి ఆ పొట్లాం అక్కడే పడేసి పక్కకి చూడకుండా ఇంటివరకూ ఒకటే దౌడు తీశాడట. అప్పట్నుండీ కుక్కలంటే అతనికి భయమేనట. ఆ సంగతి ఆయనే చెప్పాడు. "భయం! అన్నదుంది చూశారూ...వగ వద! చిన్నప్పుడు పుట్టిందంటే పెద్దైనా వదలదండీ"అన్నాడాయన.

ఆ కుక్కపిల్లను ఆయన చీదరించుకోడానికి దాని తుంటరిచేష్టలే ముఖ్య కారణం. ఓరోజు ఆదివారం అలస్యంగా లేచాను. ఏడుదగ్గరవుతుంది. వీధిలో దంతధావనం చేసుకుంటున్నాను. ఆయన వాళ్ళ వీధరుగుమీద కూర్చొని, కలం సిరాలో ముంచుతూ ఏదో వుత్తరం రాసుకుంటున్నాడు. అంతలో ఆయన మనవడు వచ్చి పూరీలు తినడానికి లోపలకి రమ్మన్నాడు. ఆ వుత్తరాన్నలాగే వదిలి ఆయన లోపలికి వెళ్లాడు. కొంతసేపటికి చేతులు తువ్వాలుతో తుడుచుకుంటూ వీధిలోకి వచ్చాడు. వచ్చి చూస్తే ఏముంది! సిరా అంతా ఆ వుత్తరంమీద ఒలికిపోయి వుంది. వాళ్ళ కుక్కపిల్లమూతినిండా సిరా చేసుకునివుంది. ఆయన కోపంపట్టలేక చూలవున్న చేతికర్రను దానిమీదికి విసిరాడు. అది దెబ్బను తప్పించుకొని పారిపోయింది. ఆ కోపాన్నంతా ఆయన మనవలమీద కక్కాడు. "మనుషులు చాలారు కారని కుక్కల్ని పిల్లుల్ని చేర్చండ్రా!...వెధవలు! పనుల్లేవ్వూ?...ఇక్కడివన్నీ పాడు చేస్తోంటే చూస్తూ ఊరుకున్నారేవ్రా..." అంటూ తిట్టడం మొదలుపెట్టాడాయన.

ఓరోజు ఆయన పడుకొని లేచేసరికి తన పక్కను చక్కగా పడుకున్న ఆ కుక్కపిల్ల కనిపించింది. దాంతో ఆయన వుగ్రుడైపోయాడు. "ఉండండ్రా...మీ కిది కొడుపని! దీన్ని ఊరవతల వదిలిపెట్టించేస్తాను...ఏవా

పెంచాలనుకోండి. గొలుసుకుదనికైనాళ్లు కోరూ..." అంటూ ఒకటే గోలచేశాడు. ఆఖరుకి ఆయన అన్నంతపనీ చేసేశాడు. పిల్లలెవ్వరూ ఇంట్లో లేకపోడం చూసి ఓ బిచ్చగాడికి డబ్బులిచ్చి ఆ కుక్కపిల్లను దూరంగా వూరవతల వదిలివేయమన్నాడు. కాని అతగాడు అంతదూరం వెళ్ళి వదులుతాడా? చక్కగా డబ్బులు పుచ్చుకుని ఆ కుక్కపిల్లను వీధి మలుపులోనే వదిలేసి పోయాడు. అది ఇంటికి మళ్ళీ హాజరైంది.

ఓనాడు మంచి గమ్మత్తు జరిగింది. ఆ వేళ రాత్రి అందరూ హాయిగా పడుకున్నారు. అంతట్లో వంటింట్లోంచి ఏదో శబ్దం విన్పించింది. ఏదో బాదుతున్నట్టు శబ్దం అవుతోంది. విశ్వనాథం తప్పించి అందరూ మేల్కొన్నారు. కాని ఒక్కరూ పక్కమీంచి కదలలేదు.

"దొంగలు పడినట్టున్నారు..." అంది జోగారావుగారి కోడలు భయంగా. చిన్న పిల్లలప్పటికే జోగారావుగార్ని పక్కనుచేరి రాగాలు మొదలుపెట్టారు. "ఇంకా పడుకుంటారేవండీ, దొంగలు పడితేనూ..." అని విశ్వనాథాన్ని అతని భార్య లేపేస్తోంది.

"వాణ్ణెందుకు లేపుతావ్, నేను లేనూ" అంటూ జోగారావుగారు, తనే వీరుడైనట్టు చేతికర్ర పట్టుకొని లోపలికెళ్ళాడు.

తక్కిన వాళ్ళందరూ అక్కడే కూర్చుని ఏ శబ్దమైనా విన్పిస్తుందేమో అని ఊపిరి బిగబట్టి వింటున్నారు. జోగారావుగారి కేమవుతుందో అని భయపడిపోతున్నారు. అంతట్లో "కుంయ్"మనుకుంటూ వాళ్ళ కుక్కపిల్ల వీధిలోకి పరుగుతీసింది. "ఆ దొంగలు మొదట కుక్కపని పట్టేసారు. ఇంక జోగారావుగారిపని సరి!..." అని అందరు హడలిపోయారు. "పోతే పోయింది చావబాదేశాను..." అంటూ జోగారావుగారు లోపలినుండి వచ్చారు.

ఆయన ప్రాణాలతో కన్పించగానే కొంత స్థిమితపడి "ఎవర్ని?" అని అడిగారాత్రుతగా.

"ఎవరేమిటి మీ మొహం...మన కుక్కపిల్లనే..." అంటూ ఆయన మంచంమీద కూర్చున్నారు.

"ఎందుకూ?" అని అడిగిందాయనకోడలు విస్తుపోయి.

"అది కాదమ్మా... నల్ల పిల్లొచ్చింది. పాలముంతలో ఏదో వుంటుందనుకొని అందులో బుర్రదూర్చింది. బుర్ర మళ్ళీ వూడి వచ్చిందికాదు. దాంతో అది ఖంగారెత్తిపోయి వంటిల్లంతా నానా బీభత్సం చేసేసింది" అంటూ ఆయన చెప్పసాగాడు.

"ఐతే కుక్కనెందుకు కొట్టారూ.." అని అడిగాడాయన మనవడు ఆయన చెప్పిందంతా కథలా వింటూ.



మిస్టర్ వినాయకరావు

అనుపోజు వేంకటగిరిరాజా, (తెనాలి.)

"అదే నేనూ అడిగేది..." అంది ఆయన కోడలు నవ్వుతూ.

"అపండ్రా...మీ సందేహాలు,మీరునూ... ఆ పిల్లి ఇంతసందడిచేసేస్తోంటే మనకుక్కపిల్ల ఏ మాత్రమయినా తరమాలా? ... అహా.. అదేవీ లేదు. హాయిగా ఓమూలని పడుకుంది. ఇంతకీ ఆ పిల్లేవిటి చేసిందో— చూశారా? నిక్షేపంలాంటి కూజా... మొన్నమొన్ననే కదూ కొన్నానూ...దాన్ని కాస్తా ముక్కలు చేసేసింది." అని ఆయన ఆపాడు.

"ఇంతకీ ఆ పాలముంత ఊడి వచ్చిందా లేదా...?" అందాయనకోడలు. "ఆ... వచ్చిందిలే...కాని వెధవకుక్క!...దానికి తిండితినడం, పడుకోడం తెలుసు, ఆ వెధవ పిల్లి వచ్చిందే అనుకో...దాన్ని తరమొద్దూ..." అంటూ ఆయన కుక్కపిల్లను తిట్టడం మొదలుపెట్టాడు.

ఆ కుక్కపిల్లంటేనే అలా మండిపడే ఆయన దాన్ని తనవెంట తీసుకవచ్చేసరికి నేను వుక్కిరి బిక్కిరవ్వనూ? ఆ సంగతి ఆయన్ని అడుగుదామనుకొనే రెండుమూడు రోజులు మరచిపోయాను. అప్పట్నుంచీ ఇంకెందుకు అడగడం అని మానివేశాను. ఆ సంఘటన జరిగిన తరువాతనుండీ దాన్నాయన ప్రేమతో చూసేవాడని అనుకోకండి సుమా! ఆయన ధోరణి మట్టుకు ఎప్పటిలాగే వుంది.

ఓరోజు వుదయం ఆయన మాయింటికి వచ్చి "రఘూ..."అని పిల్చాడు. "ఉండండి కాఫీ తాగుతున్నారు.. వస్తారు" అని శ్రీమతి సమాధానం చెప్పింది. కొంతసేపటికి నేను పైకి వచ్చాను.

"ఏమిటండీ...ఏమిటి సంగతి?" అన్నాను చిరునవ్వుతో.

"ఇవాళ మధ్యాహ్నం మాయింటికి భోజనానికి రావాలోయ్ మీరిద్దరూ" అన్నాడాయన. నేను విస్తుపోయాను.

"ఎందుకూ"? అని అడిగాను.

"అడిగారూ...భోజనానికి వచ్చినప్పుడే తెలుసుకుందురుగాన్లెండి. చాలామందిని నిన్ననే పిల్చేశాను, ఇంకా ఇద్దరిముగ్గుర్ని పిలవాలి. వస్తానుమరి..."అని ఆయన హడావిడిగా వెళ్ళిపోయాడు.

"విన్నావుకదూ..."అన్నాను శ్రీమతి వేపుచూసి నవ్వుతూ.


"కారణంలేకుండా భోజనం ఏవిటి!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది శ్రీమతి.

మధ్యాహ్నం మాతోపాటు చాలామంది వాళ్ళింటికి వచ్చారు. వాళ్ళింట్లో అడుగుపెట్టగానే ఎదురుగా జోగారావుగారు కుక్కపిల్లనెత్తుకుని మమ్మల్నాహ్వానిస్తూ కనిపించాడు. ఆ కుక్కపిల్ల బొచ్చు తెల్లగా నిగనిగ లాడుతోంది. సబ్బుతో తోమి స్నానం చేయించినట్టున్నారు. అందుకే దానికా మెరుపు? కుక్కపిల్లతో ఆయన కన్పించేసరికి నేను ఆశ్చర్యపోయాను. దానిమీదింత ఆప్యాయం ఒలకబోస్తున్నాడేవిటి చెప్మా అని అనుకున్నాను. ఇల్లంతా ఆడవాళ్ళతోటీ, మగవారితోటీ,పిల్లలతోటీ, గొప్ప హడావిడిగా వుంది.

భోజనాలయి అంతా తీరికగా కూర్చున్నాం. అప్పుడాయన ప్రారంభించాడు. "మీకు తెలుసో తెలీదో...నాకు పజిల్సు కట్టడం మహా చెడ్డ అలవాటులెండి. నా చేతులో ఎన్నిమాట్లు కట్టినా ప్రైజు రాలేదు. వెధవది!...నాకు నమ్మకాలెక్కువని మీకు తెలియనే తెలుసు కదూ...నా హస్తవాసి బాగులేదనుకొన్నాను. ఇంట్లో అందరి పేర్లతోటీ కట్టాను. అప్పటికీ ప్రైజు రాలేదు. ఆఖరుకి విసిగిపోయాను ఈ కుక్కపిల్లచలవ ఎలాగుందో చూద్దామని, చిట్టచివరిసారిగా దాని చేత ఆ కవరును పోస్టుబాక్సులో వేయించాను. దానికే ఫస్టుప్రైజు...లక్షా యాభైవేలు వచ్చింది! అందుకే ఈ హడావిడి అంతానూ..."అని చెప్పాడాయన. ఆయన అదృష్టానికి ఆశ్చర్యపోయాను. ఆ కుక్కపిల్ల ఎక్కడుందా అని చుట్టూ చూశాను. దూరముగా పళ్ళెంలో పెట్టిన లడ్డూలను తింటోంది. ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము





గేయరచన
నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు
'ఎంత వేగము, బలము! వింతగా నున్నదే! పట్టి లాగిన కాలది పరువెత్తుచున్నదే! అయ్యబాబో ఏదో దయ్య'మని భావించి తస్కరుండెట్లోని తప్పించు కొనెంచి—
ట్టుకొమ్మను చేత పట్టుకొని పైకెక్క. బ్రతుకు జీవాయనుచు రాక్షసుడు పరుగెత్తె. ఆ చెట్టుమీదనే కూచున్నదొక కోతి ఆ కోతి ఆగాగు మని పలికె నీరీతి:
దనుజుడా! ఎందుకే మనుజునికి వెరచెదవు! ఒక్క దెబ్బతు చంప కిక్కరణి పరచెదవు!
అనవుడా దానవుడు వెనుదిరిగి రాసాగె కోతిపై చోరునికి కోపమది మదిరేగె
38

ఇంటర్వ్యూ

"అబ్బాయి చదు వేమిటన్నారూ?"

"ఇంటర్"

"మంచిది. ఇంకా పైచదువేమైనా చెప్పిస్తారా?"

"ఎమ్. ఏ.దాకా చెప్పిద్దామని వుంది"

"శుభం! తమ రాబడి?"

"రెండు వేలు వస్తాయి, రెండు మేడలు వున్నాయి."

"చిత్తం."

"మీ అమ్మాయి ఏం చదివిందన్నారు?"

"ఏదో కొద్ది చదువులెండి–తద్దు ఘోరం"

"అసలు మావాడికి తనతో సమానమైన చదువుగల పిల్లని చేసుకోందామని వుద్దేశ్యం. నేనే కొప్పడి వద్దన్నాను."

"చిత్తం. దూరదృష్టిపరులు"

"మంచిమాట సెలవిచ్చేరు"

"ఆడపిల్లలకి పెళ్ళిళ్ళయినట్లేనా?"

"మీ దయవల్ల కానిచ్చేను. పాపం వాళ్లి వల్ల నాకేమీ ఖర్చు అవకుండానే గట్టు ఎక్కించేను"

"ఏమిటండోయ్!!"

"ముగ్గురుకీ దగ్గరసంబంధాలే చూసి కట్టపెట్టేను. కట్నాలు ఇవ్వలేదు. అంతకంటే పెద్ద ఉపకారం చేసేనులెండి."

"ఎట్లా?!"

"పై ఆఫీసర్లని పట్టుకొని ఇద్దరికి మంచి ఉద్యోగాలు ఇప్పించేను. మూడవవాడికి సిద్ధంగా వుంది"

అవసరాల రామకృష్ణారావు

"తెలివిగలవారు, సూక్ష్మంలో మోక్షం చూసేరు"

"ఏం తెలివి లెండి, యీ మొగవాళ్ళ గురించి ఎక్కడలేని డబ్బు ఖర్చవుతోంది"

"అంటే—?"

"చదువుల నిమిత్తమే"

"అట్లా అంటా రేమిటీ, ఈనాడు ఖర్చు పెడుతున్నారు. రేపు రెండితలవు తేరం వస్తుంది."

"అదేమిటండోయ్! అట్లా అంటున్నారు? మే మేమన్నా సంతలో బేరగాళ్ళమా?"

"అయ్యో ఎంతమాట సెలవిచ్చేరు. నేను మోటుగా అనలేదు"

"అదిగో, పైగా తప్పించుకొంటున్నారు. కొంచెం నాజూగ్గా అన్నారు. అంతే"

"అయ్యో, ఎట్లాగైనా మనం మానవులం! ఆ మాత్రమేనా, నాజూకు చూపించకపోతే ఎట్లా?"

"అసాధ్యుల్లా వున్నారే!!"

"దానికేం లెండి. వ్యవహారం మాట మాట్లాడండి"

"తమరే తేల్చండి"

"తమరు ఏ మాత్రంలో వున్నారో సెలవిస్తే..."

"ఉండడం ఏమిటి లెండి మీకు మాత్రం తెలియదా, రోజులని బట్టి..."

"అదే, తమరి నోటినుండి రావడం ధర్మం – వ్యవహారరీత్యా"

"ఇందులో వ్యవహార మేముంది లెండి. ఈ విషయంలో నాకేం పట్టింపులేదు. మా వాళ్ళ వుద్దేశాలే మీకు చెప్తున్నాను.

"అట్లానేవుండాలెండి. కానీయండి"

"నాలుగువేలు, పైపైన చిన్న చిన్న లాంఛనాలు, ఏదో అడఃబొట్టు. మీకు మాత్రం తెలియంది ఏముంది"

"అవును లెండి, చాలా పైమెట్టుమీద వున్నారే!"

"ఏమోలెండి, నేను యింకా తగ్గించేను. మా ఆవిడ చెల్లెలు కొడుక్కి ఆరువేలు యిచ్చేరట! అంచేత ఆ ఫిగర్ నే దృష్టిలో పెట్టుకొంది. ఇంక మా అబ్బాయి మాట చెప్పనే అక్కర్లేదు. వాడి క్లాసుమేటుకి చాలా ఘనంగా చేసేరట, మోటారుసైకిలు, ఇంకావేమేమో ఇచ్చారట! తనతో సమానమైనవాడికి అంత ఘనంగా జరిగితే, తనకి అలా జరగకపోతే నామోషీగా వుంటుందట! నేనే నాలుగు చివాట్లువేసి వూరుకోమన్నాను."

"ఎంత వుదారులు! మీ వంటివారు లేకపోతే లోకం..."

"బాగా సెలవిచ్చేరు. ఏదో పాపం త

చెప్పినట్లు అద్దాల్లో బిడ్డలుగాని గెడ్డాల్లో బిడ్డలా?"

"బాగా సెలవిచ్చేరు"

"కాలం మార్పు..."

"అవుతే అమ్మాయికి ఏమైనా నగలు—"

"అది మా యిష్టంతో కూడుకొన్న పని"

"చిత్రం"

"మీ అమ్మాయికి సంగీతంలో ఏమన్నా ప్రవేశం వుందా? మా వాడికి యిష్టంలెండి"

"ఎంతమాట. ప్రవేశం ఏమిటి, వసంత కోకిల."

"సంతోషం, చూడండి. కుటుంపనులు ఏమన్నా వచ్చా? మా వాడి దృష్టిలో ముఖ్యం"

"ఎంతమాట. మిషన్ కంటె!!"

"మంచిది. చూడండి. పిండివంటలో నేర్పరితనం ఏమన్నా వుందా? మా వాడికి రకరకాలుగా కావాలెండి"

"హోటలువాళ్ళు ఎందుకు పనికొస్తారు మా అమ్మాయి ముందు!"

"సంతోషం!"

"చూడండి. అమ్మాయికి వీణ వచ్చా? మా వాడికి సరదాలెండి"

"సందేహం లేదు. అపరసరస్వతి"

"బుద్ధిమంతురాలు; మావాడికి నచ్చొచ్చు"

"తమరు కట్నం విషయంలో నే కొంచెం ఆలోచించాలి."

"ఇంక నన్ను ఇబ్బంది పెట్టకండి—ఇప్పటికే మావాళ్ళు ఏమంటారో అని జడుస్తున్నా."

"సరే కానీయండి."

* * *

"చిన్న మనవి. ఏదో మా అమ్మాయి తమతో మాట్లాడాలంటోంది ఏదో ఈ కాలం పిల్లలు కాదటండీ?"

"అయ్యో! ఎంతమాట. సరే. రమ్మనండి."

* * *

"నమస్తే!"

"కల్యాణ సిద్ధిరస్తు."

"చూడండి. మా నాన్నగారి ద్వారా తమకీ, మీవాళ్ళకీ. మీ అబ్బాయికి కావలసిన రుచులు, అందచందాలు అన్నీ తెలుసుకొని తృప్తిపొందేరు. సంతోషం!... చూడండి, నేను అడగడం లోకం వూరుకోదుగాని, తల్లిదండ్రుల కక్కుర్తులవల్ల నేనే అడగవలసి వస్తోంది. పైగా కాబోయే భర్త — లైఫ్ పార్ట్నరు, ఇంకా ఏమేమో అంటారు పెద్దలు. అడగవలసిన బాధ్యత నాకు వుంది"

"అసాధ్యపుపిల్లలాగున్నావే!"

"చూడండి. మీ అబ్బాయికి హాకీలో ప్రవేశం వుందా? నాకు సరదాలెండి."

"రాదు అనుకుంటాను."

"పోనీ, క్రికెట్ వచ్చా? నాకు యిష్టంలెండి."

"వాడు పెద్ద ఆటల్లోకి వెళ్ళడు."

"మీ అబ్బాయి ఇంగ్లీషు పిక్చర్సు లైక్ చేస్తాడా? నాకిష్టంలెండి."

"మావాడు ఒక్క తెలుగు తప్ప—"

"చిత్రలేఖనం వచ్చా? నా దృష్టిలో ముఖ్యం లెండి."

"కళలలో ఏమీ ప్రవేశం లేదు."

"సాయంత్రం బీచికి, పార్కులకి వెళ్ళడం వుందా? నా కిష్టంలెండి"

"వాడు సాధారణంగా ఎక్కడికిపోడు. వైశ్య క్లబ్‌కి తప్ప"

"అవుతే, చతుర్ముఖరామాయణ పారాయణమన్న మాట?"

"ఏమో! అయినా కాలక్షేపం కోసమే"

"బాగానే వుంది... చూడండి. మీ అందరికీ నేను నచ్చాను—నాలో సమర్థత వుంది కాబట్టి; ఇంక మీ అబ్బాయిలో ఏ సమర్థతా లేనట్లు కనిపిస్తోంది. కాబట్టి అన్‌ఫిట్ చేస్తున్నాను. క్షమించండి. పైగా షాపులో వస్తువుల్లా మమ్మల్ని మీరే నాణ్యం చేసేరు. ఆ పని మాది. ఏందుచేతనంటే కట్నం అన్న పేరుతో మీ అబ్బాయిని మేము కొంటున్నాము. సరే, దానికేమిలెండి. ధనం చూసివచ్చే భర్తలవల్ల సౌఖ్యం పొందుతానని నమ్మే మూర్ఖురాలని కాదు. దయవుంచి మీరిక వెళ్ళవచ్చు. మీ ఇంటర్వ్యూకు నమస్తే!!"

"ఆఁ! ఆఁ ఆఁ!!" ★



బ్రీజ్ టాయ్‌లెట్ సబ్బులో మాత్రమే

ఎక్‌టమర్* ఉన్నది

—అది గంటలకొద్దీ నిలవుండే పరిశుభ్రతను గలిగించును!

మీరు స్నానం చేసిన తరువాత ఎంత సేపు మరల పరిశుభ్రంగా నుందురు? బ్రీజ్ టాయ్‌లెట్ సబ్బుతో, ఆ పరిశుభ్రత గంటలకొద్దీ నిలవుండును! మీ పరిశుభ్రతను పోగొట్టునట్టి చెమట దుర్గంధముల నుండి బ్రీజ్ మిమ్ములను కాపాడుటను మీరు తెలుసుకొందురు.

ఎట్లనగా, మీరు బ్రీజ్‌తో స్నానము చేసిన తరువాత దానిలోనున్న అద్భుతమైన ఎక్‌టమర్ చాలాసేపు చెమట దుర్గంధ కారకములగు చర్మము మీది క్రిములను ఢీకొనుచుండును. కనుక బ్రీజ్ యొక్క పరిమళం మీ శరీరం మీద చాలాసేపు నిలవుండి మిమ్ములను చాలాసేపు పరిశుభ్రంగా నుంచును.

బ్రీజ్, ధర కొద్దిగా హెచ్చయినా, తగినంత ఎక్కువ లాభదాయకమైనదని ప్రజలు గ్రహించారు.

జ్ఞాపకముంచుకోండి..., ఒక్క బిళ్ల చాలా కాలం పనికి వచ్చును.



'ఎక్‌టమర్' (బైత్యోనాల్) అమెరికాయందలి వైద్య సంఘముచేత ఆమోదించబడినది.

*ఎక్‌టమర్ వైజ్ఞానికంగా శరీర పరిశుభ్రతకు సహాకరించునట్టిది

BZ. 54-X52 TL.

సంస్కృత వాఙ్మయంలో హాస్యధోరణి

మృచ్ఛకటిక నాటకంలో నటీ సూత్రధారులమధ్యన ఒక విచిత్రమైన సంభాషణ నడిచింది. సూత్రధారుడు పిలిచినతరవాత నటి అతని దగ్గిరికి రావడం కొంచెం ఆలస్యమయింది. దానికి కారణమేమిని సూత్రధారు డడిగాడు. నటి వెనువెటంనే సమాధానం చెప్పింది :

"అనురూపపతి అనేవ్రతం చేస్తున్నాను"

"దీనివల్ల ఫలితం?"

"అనురూపుడయిన భర్త దొరకడం!"

సమాధానం వినగానే సూత్రధారునికి కొంచెం అనుమానం వేసింది. మళ్ళీ అడిగాడు : "అయితే ఆ అనురూపపతి ఈలోకానికా? పరలోకానికా?"

"అయ్యో! అదేమిటి అలాగ మాట్లాడతారు. ఇహలోకంలో మీ రున్నారుగా! పరలోకంలోకూడా అనురూపుడయిన భర్త దొరకడానికే?"

అని నటి సూత్రధారునికెంతో వినయంగా సమాధానం ఇస్తుంది. ఆ మాటతో సూత్రధారుడు సభ్యులకేసి తిరిగి ఒక ఛలోక్తి విసురుతాడు :

"అయ్యా! ఈ అన్యాయం చిత్తగించండి. ఈవిడగారు ఇహలోకపు భర్తద్రవ్యం ఖర్చుపెట్టి పరలోకంలో అనురూపుడయిన పతిని వెతుక్కుంటూంది, చూశారా?"

ఆపైన నటి—

"పరలోకంలోకూడా మీరే భర్త కావాలని ఈ వ్రతం చేస్తున్నాను" అని సర్దుకుంటుంది.

మన పరలోక సంప్రదాయంమీద ఇది బహు సున్నితమయిన హాస్య ప్రసంగం. ఇలాంటి హాస్యప్రసంగాలు మృచ్ఛకటిక నాటకంలో చాలాచోట్ల కనిపిస్తాయి.

విదూషకు డొకసారి వసంతసేన భవంతికి వెడతాడు. అది చాలా గొప్పభవంతి. ఎన్నో ద్వారబంధాలు దాటితేనేగాని అతడా భవంతి మధ్యభాగానికి చేరుకోలేడు. అక్కడ అతనికి వేశ్యమాత ప్రత్యక్షమవుతుంది. ఆమె స్థూలాకారం చూడగానే అతని ఆశ్చర్యానికి పట్టపగ్గాలుండవు.

"బహుశః మొట్టమొదటగా ఈమెనిక్కడ కూర్చోపెట్టి ఆ తరువాతే ఈ భవంతి అంతా ఆమెచుట్టూ కట్టిఉంటారు!"

అని నవ్వుకుంటాడు విదూషకుడు.

సంస్కృత రూపకాల్లో విదూషకు డొక విచిత్రవ్యక్తి. సామాన్యంగా ఇతగాడి మాటలు చేతలు, నవ్వు పుట్టిస్తూంటాయి.

అయితే సంస్కృత రూపకాల్లో జీవచైతన్యంతో తొణికిసలాడే విదూషకులు చాలా తక్కువ. ఈ విదూషకులకు, ఆయా నాటకాల్లో ఇతివృత్తాలకు అంతగా సన్నిహిత సంబంధం కనబడదు.

కానిమృచ్ఛకటికలో విదూషకు డలాంటివాడు కాడు. విదూషకుడని పేరుమాత్రమే గాని ఇతడు కథానాయకుడు చారుదత్తునికి చాలా సన్నిహిత మిత్రుడు. అనేకఘట్టాల్లో అతనితోబాటు కష్టసుఖాల్లో పాలు పంచుకుంటాడు. తరవాత పేర్కొనదగిన విదూషకుడు శ్రీహర్షుని రత్నావళినాటికల్లో ప్రత్యక్షమవుతాడు. కాళిదాసకవి రూపకాల్లో విదూషకులుకూడా సజీవ వ్యక్తులే! కాని వారి హాస్యం చాలా సామాన్యధోరణిలోనే నడిచిపోతుంది, అంతేగాని అంతగా ప్రత్యేకత ఏమీ కనిపించదు.

సంస్కృత వాఙ్మయంలో వీర శృంగారాల కున్నంతటి ప్రాధాన్యం మిగిలిన రసాలకు లేదు. న్యాయానికి కరుణము, హాస్యముకూడా ప్రధాన రసాల్లో పేర్కొనదగినవే. ఇలాగే మిగిలిన రసాలుకూడా ప్రధాన రసాలుగా అభివర్ధించే అవకాశాలు లేకపోలేదు. ప్రాచీనాలంకారికుల దృష్టి ఎందుచేతనో ఈ విషయంలో బాగా లోతుకు పోయినట్టు కనబడదు.

ప్రహసనాలు

సంస్కృతవాఙ్మయంలో కనిపించే ప్రహసనాలీనాటివారి అభిరుచికి చాలా మోటుగా ఉన్నట్టు కనబడతాయి. ఏవో రెండు మూడు ప్రహసనాలు తప్ప మిగిలినవి నాటివారికి నచ్చడం కష్టం.

నేటి హాస్యం

ఆధుని కాంధ్రవాఙ్మయంలో గురుజాడ అప్పారావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, వేదం వెంకటరాయశాస్త్రి మొదలైనవారు సుకుమార హాస్యధోరణితో మన హాస్యరచనలకు వెలుగు చూపించారు. ఇంకా అధునాతను లనేకులు మన హాస్యసారస్యానికనేకవిధాల ప్రోద్బలం కలిగిస్తున్నారు.

పాశ్చాత్య హాస్యం

ఆధునికుల రచనలకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో, పాశ్చాత్యవాఙ్మయాలలోని హాస్య రచనలే ఎక్కువగా ప్రోద్బలం కలిగించాయని అంగీకరించాలి. పాశ్చాత్య వాఙ్మయాల్లో మోలియర, షావంటి గొప్ప రచయిత లెందరెందరో హాస్యం ప్రధా

★ సంస్కృత వాఙ్మయం ★

కంగా తీసుకుని నాటికలు, నాటకాలు మొదలైన రచన లెన్నో సాగించారు.

హాస్యంలో భేదాలు

ఉత్తమమైన హాస్యరచనలలోనే అనేకమైన భేదాలున్నాయి. ఒక రకమైన హాస్యం నెన్ను చరిచినట్లు గట్టిగా చరుస్తుంది. దీనిలో అధిక్షేపించే తీవ్రధోరణి ఎక్కువ. ఇది విన్నవారినీ చదివినవారినీ కవ్వించి ఎత్తిపొడుస్తుంది. ఈ ధోరణిలో వ్యంగ్యాలు, ఛలోక్తులు, విసుర్లు మొదలైన వెన్నో చిన్న చిన్న భేదాలేర్పడతాయి.

ఇంకొక హాస్యధోరణి ఉంది. ఇది చాలా ఉదాత్తమైనది. మృదువైనది. ఈ విధమైన హాస్యధోరణికి లక్ష్యమైన వ్యక్తులుకూడా ఇది విని కలకల నవ్వి ఆనందిస్తారు. ఈ విధంగా అందరి హృదయాలలోను వెన్నెలలా ప్రవహించే హాస్యం మహాత్తరమయినది. ఇటువంటి ఉత్తమ హాస్యం సృజించగల వ్యక్తులు లోకానికి సూర్యచంద్రుల వంటివారు. ఇది మానవ హృదయాలలోని, అసూయలు, ద్వేషాలు, దురహంకారాలు, మొదలైన కల్మలాలన్నీ కడిగివేసి చల్లని పాలవెన్నెల జాలు ప్రవహింప జేస్తుంది.

సంస్కృత వాఙ్మయంలో కేవలం హాస్యమే ప్రధానంగా కలిగిన గొప్ప రచనలు లేవన్నంత మాత్రాన ఆ వాఙ్మయంలో మరి రసవత్తరమైన హాస్యఘుట్టాలే లేవనికాదు. కాళిదాసాది కవుల కావ్యాలలో ఇలాంటి హాస్య ఘట్టా లెన్నెన్నో కనిపిస్తాయి.

కాళిదాసకవి హాస్యం

ఈమహాకవిహాస్యం ఒక చిరునవ్వు వికసించినతీరులో స్ఫురిస్తుంది. పకపక నవ్వించే హాస్యం కాళిదాస కవిలో స్ఫురించదు.

కుమారసంభవ కావ్యంలో ఒకచోట ఈ హాస్యం కనబడుతుంది. పార్వతీ వివాహ విషయంలో మధ్యవర్తులుగా ఉండవలసిందని శివుడు సప్తమహార్షులను, అరుంధతిని ప్రార్థిస్తాడు. ఆ సందర్భంలో కాళిదాస కవి ఒక సున్నితమైన ఛలోక్తి విసిరాడు.

సప్తమహార్షులందరు అంతకు పూర్వమే వివాహితులు. వారందరికీ భార్యలున్నారు. ప్రపంచాని కంతటికీ వారు ఆధ్యాత్మిక విషయాలలో ఆచార్యులు. ఈశ్వరుడంతటి వాడు అంతవరకు బ్రహ్మచారి గానే ఉన్నాడు. ఆయనకు కూడా వివాహం చేసుకోవాలని ఉబలాటం కలగగానే వారందరు తమ కింతకుపూర్వం భార్య లున్నారే తాము వివాహితులమే అని కించపడడం మానివేశారట! ఇదంతా కాళిదాసాక పదహారక్షరాల పద్యపాదంలో ఇమిడ్చి తన దైవతమయిన పరమేశ్వరునిమీదే ఒక ఛలోక్తి విసిరాడు!

"జజహుః పరిగ్రహ వ్రీడాం
ప్రాజాపత్యాః తపస్వినః"

హాస్యాన్ని గురించి క్ష్యామిలక కవి 'పాద

తాజితక' రూపకంలో మహావిలవయినమాట అన్నాడు.

"న ప్రాప్నువంతి యతయో రుదితేన మోక్షం,
స్వర్గాయతిం న పరిహాసకథారుణద్ధి,
తస్మాత్ప్రతీత మనసా హసితవ్యమేవ,
వృత్తిం బుధేన ఖలు కౌరుకుచింవిహాయ."

"యతీశ్వరుల కందరికీ పొద్దస్తమానము ఏడుస్తూ కూచోడంమూలానే మోక్షం రావడంలేదు. వేళాకోళాలాడుకున్నంత మాత్రాన వచ్చే స్వర్గమేదో రాకుండాపోదు. అందుచేత ఎప్పుడు కులాసాగా నవ్వుకుంటూ ఉండవలసిందే! అయితే మోటుదనంమాత్రం కూడదు."

శ్యామలకుని సూక్తి ఒక మాక్తికం! ఇది పొద్దున్నే నిద్రలేవగానే ఒకమారు స్మరించుకుంటే అధమం ఆరోజంతా ఆనందంగా ఉండవచ్చును! తోటివారి ముఖాలలోకూడా చిరునవ్వులు మెరిపించవచ్చును! నిత్యము దిగులుగా, నీరసంగా, నిస్సారంగా సాగిపోయే మానవజీవిత సరణిలో తను ఆనందిస్తూ ఒకరిని ఆనందింప జెయ్యగలగడంకన్న వేరే మహద్భాగ్యం ఏమి ఉంది!

అధిక్షేపాలు

సంస్కృత వాఙ్మయంలో సంఘంలో అన్యాయాలు, దురహంకారాలు తీవ్రంగా అధిక్షేపించే సంగ్రహ రచనలు చాలా ఉన్నాయి. సంస్కృత శతక వాఙ్మయంలో ఈ ధోరణి రచన లెక్కువ. అందులోని ధట్టికవి మహిషశతకం ఆకాలపు రాజులమీద వారి దౌర్జన్యంమీద కరిగిమరిగే సీసప్రవాహంలా విరుచుకుపడుతుంది. ఈ శతకంలో ప్రతి శ్లోకంలోను తీవ్రమయిన అధిక్షేపణ ధ్వనిస్తుంది. ఇంకా ఆ యా కవు లాశువుగా చెప్పిన విలాంటివి చాలా ఉన్నాయి.

పూర్వకాలంలో ఒక రాజు షికారు బయలుదేరేటప్పుడు కంటికెదురుగా కనిపించే వా రెవరిచేతనైనా బలాత్కారంగా పల్లకీ పట్టించేవాడట! ఒకనా డలాగ దారినపడిపోయే ఒక వ్యక్తిచేత పల్లకీ మోయింపజేశాడట! అతగాడికి ఒకరికి పల్లకీపట్టడం అలవాటు లేదుగాబోలు! పాపం అతని కాళ్ళు తడబడ్డాయట. పల్లకీలో వేంచేసిఉన్న ప్రభువా రతగాడికేసిచూసి 'కింబాధతి?' అని ప్రశ్నించారట! అంటే "ఏం బాధగా ఉందా?" అని ఆ ప్రశ్న కర్థం.

ఆపైన పల్లకీ మోస్తున్న వ్యక్తి ఒక శ్లోక పాదం చదివాడు.

"నాయ! మాందోళికాదండః!
తవ! బాధతి! బాధతే!"

ఈ శ్లోకపాదాని కర్థం ఇది: "మహాప్రభూ! తమ పల్లకీబొంగు నన్ను బాధపెట్టడంలేదుగాని తాము 'బాధతి' అని ఒకతప్పుడు ప్రయోగం చేశారు! అదే నన్ను బాధిస్తూంది". సంస్కృత వ్యాకరణం ప్రకారం 'బాధతి' అనకూడదు. 'బాధతే' అనాలి. ఆవిధంగా ఎత్తిపొడిచేసరికి పల్లకీలోని ప్రభువు వారావ్యక్తి ఎవరో గొప్పపండితుడు, కవీశ్వరుడు అయిఉండాలని గ్రహించి వెంటనే పల్లకీ దిగివచ్చి క్షమాపణ వేడుకొన్నాడట!

ప్రభువులమీద నేకాక పరమేశ్వరునిమీద కూడా బహుసున్నితంగా ఛలోక్తులు విసిరిన కవు లనేకులున్నారు. కృష్ణకర్ణామృతంలో లీలాశుకుడు విసిరిన ఛలోక్తిది.

"త్వయి ప్రసన్నే మమ కిం గుణేనత్వయ్య ప్రసన్నే మమ కిం గుణేన రక్తే విరక్తే చ వరే వధూనాం నిరర్థకః కుంకుమ పత్ర భంగః"

"నీవు ప్రసన్నుడవయితే నాగుణావగుణాలతో పనియేమివుంది? ఒకవేళ నీవు ప్రసన్నుడవుకాకపోతే నా గుణావగుణాలతో పనియేమివుంది? భర్తకు రక్తికలిగినా, విరక్తికలిగినా స్త్రీల కలంకారాలతో ప్రయోజనమేమిటి? ఇదీ ఈశ్లోక తాత్పర్యం. దీనిలో కవి పరమేశ్వరునిమీద అనేకవిధాలుగా ఛలోక్తులు విసిరాడు.

సమాస కుసుమావళి రచించిన నడిమింటి సర్వమంగళశాస్త్రి వినాయకునిమీద విసిరిన ఛలోక్తి ఇంతకన్నా విచిత్రమైనది.

"భూనాయకం వా ధననాయకం వా
భజన్ భువం వా ధన మేతి లోకే త ద్విఘ్ననాథం నభజామి కింతు సహస్రశ స్తం ప్రణామామి నిత్యం"

"భూమీశ్వరుల నెవరినయినా ఆశ్రయిస్తే భూమి ఇస్తారు. ధనాధిపతుల నెవరినయినా ఆశ్రయిస్తే ధనం ఇస్తారు. అందుచేత నేను విఘ్ననాయకుణ్ణి ఆశ్రయించను. కాని ప్రతి నిత్యము (నాదరి మానానికి రావద్దని) వెయ్యి విధాల నమస్కరిస్తాను."

ఇది వినాయకునికి కూడా నవ్వు పుట్టించగల ఛలోక్తి. ★

పి. గణపతిశాస్త్రి.



స్వయం సేవ

రంభా దర్శన భాగ్యంకోసం ఘోర తపస్సు చేస్తుంటే రాజకుమారుడికి కళ్ళు తెరవగానే, ఎదురుగా బ్రహ్మరాక్షసి కన పడితే ఎలావుంటుందో అలాంటి సంకట స్థితిలో పడిపోయాడు పాపం వేణు! విధి విలాసం ఇంతే నేమో! కాకపోతే తాను ఎవరికోసం ఇంత ఆతృతతో ఎదురు చూస్తున్నాడో వారికి మారుగా తాను ఎవరి నైతే పూర్తిగా ఏవగించుకుంటాడో వాళ్లే తన కళ్ళఎదుట ప్రత్యక్షంగా నిలచివుండటం బలవత్తరవిధి దుర్విపాకం అనకపోతే ఏమను కోవాలి?

నిజానికి వేణు ఎదురుచూస్తున్నది లత ఆగమనంకోసం. "సాయంకాలం ఐదింటికల్లా నీ రూంకు తప్పకుండా వచ్చేస్తాగా," అని గట్టిగా వాగ్దానం చేసిందికూడా. ఇప్పుడు ఐదు కావస్తోంది. వేణు స్టైలిష్‌గా టాయ్ లెట్ చేసుకొని నాలుగింటినుండి తయారుగా వున్నాడు. దృష్టంతా ద్వారంవైపే కేంద్రీ కరించి మధ్యమధ్య గోడగడియారంవైపు చూస్తూ కూచున్నాడు. ఇంతలో తలుపుమీద 'టకటక' శబ్దం మెల్లిగా వినవచ్చింది. ఆతృ తతో ఒక్క దూకులోవెళ్లి తలుపుతీశాడు. "ఇంత ఆలస్యంచేశావేం?" అందామని నోరు కూడా కొంచెం తెరిచాడు. కాని అతని కళ్ల బడ్డ దృశ్యం అతన్ని చైతన్యహీనుణ్ని గా చేసింది. అతనినోట మాటరాలేదు. ఆనం దంతో విలసిల్లే అతని సుందరవదనం ఒక్క మారు పాలిపోయింది. అతని ఎదురుగా లతకు మారుగా ఒక వృద్ధపురుషుడు ఆయన ననుస రించి ఒక వృద్ధనారి-పార్వతీ పరమేశ్వరు ల్లాగా తనవైపు చూస్తూ నిలచివున్నారు!!!

ఈ పురాణదంపుతు లెవరో? ఇంత ఆకస్మికంగా తనకెందులకు దర్శనమిస్తు న్నారో పాపం వేణుకు అగమ్యగోచరం గానే వుంది.

"ఎవరు కావాలండీ తమకు?". అని కొంచెం వ్యంగ్యంగా చిరాకు, కోపం ఎక్కువగా వ్యక్తపరచకుండా అడిగాడు. అతనికి ఈ "ముసలిజంట" ఏదో రూంనెం బరు తప్పిపోయి ఇటువచ్చారేమోననే ఆశా పూరిత అనుమానం కలిగింది.

"మీకోసమేలెండి" అంటూ ఆ పరమే శ్వరుడుగారు సమాధానమిస్తూ, సరాసరి గది లోకి దోవతీసేటప్పటికి వేణు నిజంగానే నిరుత్తరుడయ్యాడు.

ఆ పార్వతీదేవిగారుకూడా నడుముమీద చెయ్యిపెట్టుకొని వంగి వేణుని ఆపాద మస్తకం పరిశీలిస్తూ, పరమేశ్వరుడి వెంబడే లోనికి ప్రవేశించింది.

ఊహాతీతమైన వీరి చర్యకు వేణుకి కోపం మిన్నుముట్టింది. కాని సభ్యతకు లక్షణం కాదని, "దయచేయండి" అంటూ కుర్చీలు చూపాడు. కాని ఈ శబ్దోచ్చారణ సూక్ష్మంగా పరిశీలిస్తే "ఇప్పుడెందుకు వచ్చారు? దయచేసి బయటకు నడవండి" అనేట్లుగా నేవుంది! వారు సుఖాసీనులైన తర్వాత, వేణు చేసేదేమీ లేక ఒక సోఫాలో కూలబడ్డాడు. కాని అతని మస్తిష్కంలో అనేక భావతరంగాలు నిర్విరామంగా పరిభ్ర మింపసాగినయి.

సాధారణంగా ఇలాంటివృద్ధ — మధ్య వయస్క దంపతులు తనలాంటి తరుణ బ్రహ్మచారులవెంట ఎందుకు పడతారు?... బహుశా తమకు సౌభాగ్య కాంక్షిణికన్య ఒకతెవుండి—ఆమెను తమ కంఠసీమకు బంధించేందుకు ప్రయత్నిస్తూ ఇలా సంచా రంగా వస్తూవుంటారని తేలికగానే నిర్ణ యించేశాడు. ఆ వచ్చినవారు తమకూ—తన పెద్దలకుగల స్నేహాన్ని పురస్కరిస్తూ వారికి తమకు ఎంత గాఢస్నేహముండేదో తన బాల్యంలో వారితో తాను ఎంత చనువుగావుంటూ వారిని తన ఆట మాటలతో ఎంత మురిపింప చేసేవాడో ఇలాంటివన్నీ రమ్యంగా కల్పించి వర్ణిస్తూ అతి నేర్పుతో తమను గురించిన ప్రస్తుత

★ మానూరు రా

వివరాలన్నీ సేకరిస్తారు. చిట్టచివరికి తమ ఏ సరస్వతినో—సత్యవతినో-భానుమతినో- వచ్చి చూసి తమ కుటుంబ శాశ్వత సభ్య త్వాన్ని స్వీకరించ వలసినదిగా ఆహ్వా నిస్తారు. ఇదే వారి నిరంతర కృషి. ఇలాంటి



వారిని ఇప్పటికే చాల మందిని చూశాడు. కాని లతతో పరిచయమైనప్పటినుండి ఇలాంటి వరాన్వేషణలతో వృధాగా కాలవ్యయం చేయటం వేణుకే మాత్రం యిష్టం లేదు. అందులో ఇతరులతో తన భోగట్టా తెలియచేయాలంటే అతనికి చాల

సత్య[illegible] రావు ★

కోపం. ఇతరులకే కాదు—తన ప్రాణతుల్యమైన లతకే తనను గురించి ఇంతవరకు యే వివరము కూడా తెలుపలేదంటే అతని స్వభావము ఎంత విచిత్రమైనదో తెలుసుకోవచ్చును. అతనిది అంత పెంకె పట్టుదల.

ఒక రోజున యేదో మాటల సందర్భంలో లత వేణుని "మీ జీతమెంతండీ?" అని అడిగింది. ఇదైనా అతనితో తనకు ఇటువంటి ప్రశ్న అడుగగల సన్నిహిత స్నేహం ఏర్పడినదనే ధైర్యం కలిగిన తర్వాతనే అడిగింది. కాని దీనికి వేణు సమాధానం విన్న తర్వాత చాల ఖిన్నురాలయింది.

"ఏం? నా జీతం తప్పేలు నీ కెందుకు? నా జీతం ప్రమాణాన్ని బట్టి నన్ను పెళ్ళాడటం గాని, మానుకోటంగాని నిశ్చయించుకుందామనుకుంటున్నావనుకుంటాను." అని నిష్ఠురంగా జవాబిచ్చాడు.

అసలు లతకు వేణుతో చాల వింత పరిస్థితిలో పరిచయమైంది. సిటీబస్ థియాసిఫికల్ బిల్డింగ్ స్టాపింగ్‌లో ఆగిన వెంటనే లత బస్ ఎక్కింది. కండక్టర్ ఇక ఖాళీ లేదని రైట్ చెప్పటం బస్ బయలుదేరటం ఒక్కమారే జరిగి పోయింది. ఆ వూపులో లత బ్యాలెన్సు తప్పి ఎదురసీట్లో కూర్చున్న యువకుడి మీద పడిపోయింది. అతను లేచి ఆమెను తన సీటులో కూర్చోమని చెప్పి ఫుట్‌బోర్డుమీద నిలబడ్డాడు. లత సిగ్గుపడుతూనే థాంక్సు చెప్పికూర్చున్నది. ఆతర్వాత రెండు రోజులకు లత అక్కడే బస్ ఎక్కింది. వేణు అదే సీట్లో వున్నాడు. లతను చూడగానే అతను నిలబడి లతకు సీటు యిచ్చాడు. "మళ్ళా మీద పడ్తానని భయంతో ముందే జాగ్రత్త పడుతున్నారల్లే వుంది?" అని లత నవ్వుతూ అంటూ కూర్చున్నది. ఈ విధంగా ప్రారంభమైన వారి స్నేహము దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. క్రిష్టియన్ కాలేజి దగ్గర లత దిగిపోయేది. రోజూ వాళ్ళిద్దరు కలుసుకుంటూనే వుండేవారు. లత కాలేజీలో విద్యార్థిని అని వేణు తెలుసుకున్నాడు. కాని అతను ఏం చేస్తున్నాడో లతకు ఇంతవరకు తెలియలేదు. అతను తెలుపలేదు. కాని అతను చాలా మంచివాడని, ప్రేమాస్పదుడని మాత్రము తెలుసుకోన కలిగింది. అతనిని గురించి వివరాలు తెలుసుకోవాలని లత ప్రయత్నించింది. కాని తామిరువురు ఒకే కులమువారనే విషయముతప్ప ఇంకే విషయము తెలుసుకోనలేకపోయింది.

ఒకరోజు వేణు రూంకి వచ్చినప్పుడు లత నవ్వుతూ: "ఏమండీ-ఎప్పుడూ నేను మీ రూముకు రావటమే కాని, ఇంతవరకు మీరు ఒక్కమారు కూడా మా ఇంటికి రాలేదు. రేపు తప్పకుండా 'టీ' కి మా ఇంటికి రావాల్సిందే" అంది.

"ఇప్పుడే కాదు," అన్నాడు వేణు.

"మరెప్పుడు?" అన్నది లత.

"మన పెళ్ళి అయిన తర్వాతనే."

"ఎలాగూ అల్లుడు అవుతారుగదా? ఒక్కమారు మా ఇంటికి రాకూడదా?" అన్నది సహజంగా.

"నేనేం పసిపాప ననుకుంటున్నారా? నీ తలిదండ్రుల నాటకం నాకు బాగా తెలుసులే! 'టీ' కని ఆహ్వానించి. నన్ను చూసి మన విషయను తేల్చవచ్చనేగదా వాళ్ళ ప్లాను? ఆ మాత్రం తెలుసుకోలేనని అనుకున్నావా?" అని కొంచెం తీక్షణంగా అన్నాడు.

"కాని చూడాలనుకోవటం—చూడటం తప్పా? తమకు అల్లుడుకాబోయే ఆయన ఎలా వుంటాడో వాళ్ళు చూడకూడదా?" అని అమాయకంగా అడిగింది లత.

"సరేకాని- నన్ను పెళ్ళాడేది నువ్వే కదా? నన్ను నీవు చూస్తున్నావు. నీకు నేను నచ్చానని అనుకుంటున్నా. నీకు నచ్చితే అంతేచాలు. లేకపోతే మీ వాళ్లందరూ చూసి సర్టిఫై చెయ్యండే నన్ను ప్యాన్

చెయ్యవా ఏమిటి ?" అని పరిహాసంగా జవాబిచ్చాడు వేణు.

ఈ రోజువరకు వేణు లతవాళ్ళ ఇంటికి వెళ్ళలేదు. తననుగురించి ఆమెకు యేమీ తెలియచేయలేదు. జీవిత సౌఖ్యానికి ఆస్తి ధనము ముఖ్యంకావనీ ప్రేమపూరిత హృదయాలతో ఒకరినొకరు అర్థంచేసుకొనగలిగితే జీవితం ఆనందంగా గడుపవచ్చునని అతనివాదం. తమకుకాబోయే అల్లుడు ఎలా వుంటాడో అతనిసంగతి సందర్భాలు- మంచి చెడ్డలు పూర్తిగా తెలియనిదే ఈ పెళ్ళికి సమ్మతించటం ఎలా సాధ్యమౌతుందని లత తల్లిదండ్రుల వాదం. ఉభయ వాదాల్లోనూ మొగ్గు సమంగానే వుంది. అందుచేత ఎన్నాళ్ళనుంచో ఈ సమస్య-సమస్యగానే వుండిపోయింది.

వేణు ఒకపర్యాయం "లతా-ఇక త్వరలో మనం వివాహం చేసుకుంటేనే మంచిద"ని అన్నాడు.

"నేనుమట్టుకు కాదంటున్నానా ? కాని మీ పట్టుదల మీరు వదలటం లేదుగా ?" అని లత నిస్పృహతో ప్రత్యుత్తర మిచ్చింది.

"ఏమిటీ ?- పట్టుదల నాదా- మీ పెద్దవాళ్ళదా ?" అని వేణు రెట్టించి అడిగాడు.

"పాపం వాళ్ళ పట్టుదల ఏముంది ఇందులో ? తమ బంగారంలాంటి పిల్లను ఎవరికి అప్పగిస్తారో ఆయన ఎలాంటివారో- తెల్లగా వుంటారో నల్లగావుంటారో చూడాలని వారు భావించటం పట్టుదలఅవడం న్యాయం కాదండీ" అన్నది లత గారాబంగా.

"సరే సరే—ఆ కాబోయే అల్లుడుగారు నల్లటివాడో- తెల్లటివాడో- మంచివాడో- చెడ్డవాడో ఆవిషయాలన్నీ ఆబంగారంలాంటి పిల్లే చూసుకోగలదుగా"అన్నాడు నవ్వుతూ వేణు.

"అయినా మీకుమాత్రం ఇంత పట్టుదల యెందుకండీ? వాళ్ళ సమ్మతి లేకపోతే నేనెలా వాళ్లని ఎదిరించగలను?" అని లత సంశయాన్ని తెలిపింది.

"ఓస్ ఇంతేనా మరి నీ ధైర్యం— రాణి సంయుక్త చూడు—తన ప్రియునికోసం తండ్రినికూడా ఎదిరించలేదా? అయినా నీవు మీ తలిదండ్రులతో చెప్పు—మీ కాబోయే అల్లుడుగారు చాలా మంచివాడూ—మీద పడ్డా పోట్లాడేరకం కాదు- కొంచెం తిక్కశంకరయ్య తత్వం అయినా పెళ్లాన్ని పూలల్లో పెట్టి పూజించుకుంటాడూ—వసంతుడికంటె కొంచెం బాగుంటాడు-వగైరా వగైరా అని నచ్చజెప్పి ఒప్పించి ఇరవై నాలుగు గంటలలోగా వచ్చి నన్ను పెళ్ళి చేసేసుకోనవలెను... అట్లుకానిపక్షమున..." అని పరిహాసం కింద తేల్చేశాడు.

"ఆ...పూర్తి చెయ్యండి ఆ వాక్యం— 'అట్లుకానిపక్షమున అబ్బాయిగారు అమ్మాయిగారిని బలవంతముగా ఎత్తుకొని వెళ్ళి, వివాహమాడ గలవారు' అని కూడా చెప్పమంటారా?...అలా అనుకుంటే సంయుక్త తండ్రిలాగా మా నాన్నగారికి మీకు ఇవ్వకూడదనే పట్టుదల లేదుగా? మా నాన్నగారికి నామీద పూర్తి నమ్మకమున్నది— నేనెప్పుడు తప్పు చేయననీ—తొందరపడి ఆలోచన లేకుండా యేపనీ చెయ్యనని ఆయన విశ్వాసం. కొంతవరకు ఆయన మీరెలాంటివారో నావల్ల తెలుసుకున్నారనుకోండి. అయినా ఆయన స్వయంగా చూస్తే ఆయనకుకూడా సమాధానంగా ఉంటుంద"ని లత సరళంగా సమాధాన మిచ్చింది.

"చూడు లతా-నా అభిప్రాయం నీకు మొదటే చెప్పేశాను. సంతల్లో గిత్తల బేరంలాగా యితరులు వచ్చి నన్ను చూసి నిర్ణయించటానికి నే నేమాత్రం ఒప్పుకోను. రైటో తప్పో యిది నా నిశ్చితాభిప్రాయం. మన మిద్దరం హృదయ పూర్వకంగా పరస్పరం ప్రేమించుకున్నాము. ఇది మన ఇద్దరి జీవిత సౌఖ్యాలకు సంబంధించిన ప్రశ్న...మనం అజ్ఞానులం......మూఢులము కాము గదా. కాబట్టి పెద్దల పట్టుదలకో సంస్వాభిప్రాయాన్ని నేను వదులుకోదలచుకోలేదు" అని తన అభిప్రాయాన్ని నిశ్చితంగా వేణు చెప్పేశాడు.

ఈసమస్య ఇలాగే యెన్నాళ్ళనుండో అపరిష్కృతంగానే వుండిపోయింది. ఇందువల్ల—పాపం—లతకు చాలా సందిగ్ధ పరిస్థితి యేర్పడ్డది. చిన్నతనంనుండి అల్లారుముద్దుగా తనను పెంచి పెద్దదానినిగా చేసిన తలిదండ్రులను ధిక్కరించి వారికి మనఃక్లేశము కలుగజేసే ఇచ్ఛగాని, ధైర్యముగాని ఆమెకు లేదు. అలాగని ప్రాణాస్పదుడైన వేణుని దూరంచేసుకోవటం అంతకంటే ఇష్టంలేదు. వాళ్ళిద్దరి పట్టుదలలవల్ల ఈమె అడకత్తెరలో వక్కలాగా నలిగిపోతూ వచ్చింది.

వేణుకికూడా ఈ సమస్య ఇలా వుండటం ఒక విధంగా బాధాకరంగానే వున్నది. లతను వదిలివుండటం అతనికి దుస్సహంగా వుంది. అంతేకాక ప్రతివారం ఎవరో ఒక కన్యాదాత తాకిడి తనకు తప్పటంలేదు. ఆ సందర్భంలో తను యేవో సాకులు చెప్పి, వాళ్ళను తిప్పిపంపటం జరుగుతూనే వుంది. ముఖ్యంగా ఈ వరాన్వేషుల గొడవ తప్పించుకోనెందుకైనా సరే తను త్వరగా పెళ్ళి చేసుకోవడం అవసరమని నిర్ణయించుకున్నాడు. కాని ఇన్నాళ్ళుగా ఒక పద్ధతి పట్టుదలతో వుండి ఇప్పుడు మెత్తబడితే లత దృష్టిలో తాను లోకువ అవుతానేమో అనే అభిమానము అడ్డుతగిలి ఆ ప్రయత్నం చేయటం విరమించాడు.


ఇప్పుడు కూడా తన ఎదుట ఆసీనులై వున్న ఆ పురాణదంపతులను చూడగానే వారు తనగృహాన్ని ఎందుకు పావనం చేస్తున్నారో అంచనా వేసుకున్నాడు. ఇన్నాళ్ళ అనుభవాన్నిబట్టి వరాన్వేషణార్తులైన వధుపితల 'ట్రేడ్‌మార్కు'లు బాగా గుర్తుపెట్టుకోగలిగాడు. తన ఎదుట కూర్చొని తనవైపే సాపేక్షగా చూస్తుంటే ఆ వృద్ధమానవుల వివిధ భంగిమాలను వింతగా పరికిస్తూ, ఏమి చేయాలో తోచక కూర్చున్నాడు. వీళ్ళు కూడా తప్పక తనకు "అల్లుడిగారి హోదా" కలుగచేద్దామని వచ్చినవారేననే నిశ్చితాభిప్రాయం అతనికి కలిగింది.

ఇంతలో ఆ ముసలాయన వేణుతో, "మీ గురించిన కొన్ని వివరాలు కావలసి వచ్చాము. శ్రమ అనుకొనక తెలియజేస్తారా?" అనటంతో అతని అనుమానం రూఢియైపోయింది. వీళ్ళు తనవద్దకు వచ్చింది శుభకార్యంకోసమైతే అయివుండవచ్చు—కాని మంచి ముహూర్తం మట్టుకు చూసి రాలేదని మాత్రం ఘట్టిగా చెప్పవచ్చు...లత వచ్చేవేళ కావచ్చింది. పాసకంలో పుడకల్లాగా వీళ్ళు ఇక్కడ ఎంతసేపు వుంటారో తెలియకపోవటంతో వేణు లోలోపల మండిపోతున్నాడు. దానికి తగ్గట్లు ఆ ముసలాయన పలికిన మొదటి వాక్యమే అతన్ని అగ్నిలో ఆజ్యంపోసినట్లు చేసింది. ఇలాంటి వాళ్ళతో సంభాషణకు వుపక్రమిస్తే ఎంతకూ తెమలదని కొంచెం కఠోరస్వరంతోనే "క్షమించండి...ఇప్పుడు నాకు సాధ్యపడదు. నా వివరాలు చెప్పడానికి ఉద్దేశంగాని, సావకాశంగాని లేదు" అన్నాడు.

ఈ మాట వినగానే ఆ ముసలాయన ఒక్కమారు బిగ్గరగా నవ్వి..."బలే... చూడబోతే మీరేమో తికమకపడ్డట్లున్నదే? మమ్మల్ని చూసి ఎవరైనా ఒక కన్యమాతాపిత లనుకుంటున్నారా ఏం?" అన్నాడు.

ఇది వినగానే వేణు కొంచెం తెప్పరిల్లుకున్నాడు: "అంటే మీరు'అందుకోసం' రాలేదన్నమాట" అన్నాడు మెల్లిగా.

"కాదు. ఎంతమాత్రంకాదు" అని ఆ ముసలాయన ఇటునుండి అటు తలతిప్పుతూ గట్టిగా వక్కాణించాడు. "నిజానికి నాకు కూడ ఒక అవివాహిత కుమారిక వున్నది. మీ యూహం కూడా ఆమెకు ఇంచుమించు



"కమలా త్రీరింగ్ సర్కస్" లో ఒక దృశ్యం.

తగిపోవచ్చు. కాని ఇప్పుడు మాకు ఆ ప్రశ్నే అసలు వుత్పన్నం కానే కాదు. ఈ కాలంలో ఆడపిల్లలుకూడా తమ భర్తల్ని తామే నిర్ణయించుకుంటున్నారు గదా! అలాగే ఆమెకూడా యెవరినో ప్రేమించి నిర్ణయించుకున్నదట!! మేము మాత్రం మారు మాట లేకుండా పెళ్ళి వాళ్ళని ఆశీర్వదించా అని ఆమె అభిప్రాయం," అని తన స్వకుటుంబగాథను తెలియచేశాడు.

ఎవరైనా సరే-తమ స్వీయగాథ మొదలు పెడితే వారు కాలంవిలువ తెలుసుకోలేరు. లతి యే క్షణంలోనైనా రావచ్చు. సాధ్యమైనంత త్వరలో ఈజంటను వదిలించుకోవటం ఎంతైనా అవసరం. అందుకని వేణు ఆయన వాక్ప్రవాహానికి అడ్డుపడి "నా గురించి మీకే వివరాలు కావాలో త్వరగా తెలియచేయండి" అని అడిగాడు.

"మరేమీ లేదు...మీ కులం - వయస్సు- ఆస్తి - మీకుటుంబం..." అని ఆయన వాక్యం పూర్తిచేయకముందే వేణు విసుగుతో" ఎందుకండీ ఈ సంగతులన్నీ మీకు... ఈ సంగతులేవీ నేను ఎవరికి తెలుపదలచ లేదు. ఇవి తెలుసుకోన్నందువల్ల ఇతరులకు ఏమాత్రము వుపయోగములేదు" అనేశాడు.

"పోన్లెండి - అంతగా చెప్పదగినవి కాకపోతే ఆ సంగతి వేరు...మిమ్మల్ని ఇరుకున పెట్టటం మా వుద్దేశం కాదు" అని ఆ పరమేశ్వరుడుగారు కొంటెగా అన్నాడు.

ఈ మాట వినగానే వేణుకి బాగా కోపం వచ్చేసింది. "అవేమీ చెప్పకూడనంతటివీ- లజ్జాస్పదమైనవీ మాత్రము కావు. కాని నాకు ఇలాంటి పనిపాటలు లేని పోచుకోలు కార్యక్రమాల్లో కాలం వృథాపుచ్చటం ఎంతమాత్రం యిష్టం లేదు" అని నిర్మొహమాటంగా అనేశాడు.

ఆ ముసలాయన ఏమీ మాట్లాడలేదు.

"కాని రాష్ట్రంకోసం - దేశంకోసం - మీరు మాకు ఈ వివరాలు తెలియచేస్తే మంచిది. రాష్ట్రపతి ఆదేశాన్ననుసరించి మీకు మేము ఈ విజ్ఞప్తి చేస్తున్నాం" అని అవ్వగారు ఏదో ఒక పుస్తకంలోని పాఠం ఒప్పగించినట్లు అన్నది.

"రాష్ట్రం కోసం!...దేశం కోసం!..... చాలా వింతగా వుందే మీ ధోరణి!...నాకు సంబంధించిన వివరాలకూ - రాష్ట్రానికీ - రాష్ట్రపతికీ ఏం సంబంధముంది" అని వేణు ఆశ్చర్యంతో అడిగాడు.

అవ్వగారివైపు 'భేష్-నీ పాత్ర చక్కగా నిర్వర్తించావు' అన్నట్లు మందస్మిత వదనంతో చూసి తన తలమీది తలపాగా సర్దుకుంటూ ఆ తాతగారు అన్నారు. "ఇక ఎక్కువసేపు మిమ్మల్ని సందిగ్ధంలో వుంచటం మాకు భావ్యం కాదు. ఇప్పుడు దేశంలో జనాభా లెక్కల సేకరణ జరుగుతున్నదనే విషయం మీకు తెలిసేవుంటుందనుకుంటాను. మేము స్వయంసేవకులము. రాష్ట్రపతి విజ్ఞప్తి ననుసరించి ఐచ్ఛికంగా వె ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాము."

"ఓ-అలాగా- అయితే మీరు గణకులన్నమాట..." అంటూ "ఆమె ఎవరు?" అనే భావం తోచేట్లు అవ్వగారివైపు చూశాడు వేణు.

ఇది వెంటనే గ్రహించి ఆయన "ఆమె

స్వయంసేవకులు

కూడా గణకు......గణకుడు అనకండి గణిక అనండి—మొత్తంమీద ప్రభుత్వ కార్య నిర్వహణభారాన్ని నాతోపాటు భుజస్కంధాలమీద వేసుకొన్న స్వయంసేవకురాలు. ఇంట్లో ఎవరైనా స్త్రీజనం వుంటారేమో—వారిని కూడా విచారించి కొంత వివరణ సేకరించవచ్చునేమో ననే భావంతో వచ్చింది. కాని సాధారణంగా ఆమె చేసే పని అంతగా వుండదులెండి. ముఖ్యమైన పనంతా చెయ్యవలసింది నేనేగదా!" అంటూ తన హాస్యపూరిత సమాధానానికి తానే నవ్వుకుంటూ వేణువైపు ప్రశ్నార్థకంగా చూచాడు.

"ఏం అలా అంటారు?—ఇక్కడ లేకపోతే చాల ఇళ్ళలో స్త్రీలుంటారు గదా—ఆమెకు మాత్రం పని తక్కువగా వుంటుందా?" అని వేణు అడిగాడు.

"ఆ...ఏం పనిలెండి ... ఆడవాళ్ళపని ఏముంటుంది...వూరికే తలలు లెక్కపెట్టటమేగా...అయినా వాళ్ళతలల్లో

గాని, నోట్లోగాని ఏ విషయమైనా ఎంతసేపు స్థావరంగా వుంటాయి గనుక!" అని తమాషాగా అవ్వగారిని కవ్వించాలని అన్నాడు.

"ఇక ఈ వేళాకోళాలు చాలించండి" అంటూ ఆమె ఆయనను కోపదృష్టితో చూసింది. కాని ఆయన నిర్లక్ష్యం చేస్తూ "నిజమే...ఇక హాస్యం సరిపుచ్చి అసలు కార్యరంగంలోకి వద్దాం. ఇప్పటికే చాలా ఆలస్యమయింది," అన్నాడు.

"నిజమేనండి. మీ పని త్వరగా ముగించండి. మీరు ఇక్కడిలాగా అన్నిచోట్ల ప్రజలతలలు లెఖ్ఖపెట్టటం మొదలుపెడితే వాళ్ళతలలే తిరిగిపోతాయి" అని కొంచెం విసుగుతో వేణు అన్నాడు.

"అవునవును. ఆ సంగతీ నిజమే..." అని ఆ ముసలాయన అవ్వగారిని వుద్దేశించి... "చూశావా...ఆయన మన వాచాల ధోరణి మీద ఎంత పసందుగా దెబ్బకొట్టారో?" అంటూ తన నల్లకోటు జేబులోని ఒక అచ్చుఫారముతీసి ... "చూడండి...ఇందులోని ప్రశ్నలకు మీరు సరిగా జవాబులు చెప్పాల్సివుంటుంది. శ్రమ అనుకోక చెప్తారు కదూ?" అంటూ దానిమీది ప్రశ్నలు అడగటం ప్రారంభించాడు.

"మీ పేరు?"

"వేణుగోపాల్ రావు."

"మీతండ్రి?"

"రఘునాథరావు."

"మీజాతీయత్వం-మతం?"

"భారతీయులు-హిందు."

"కులం?"

"బ్రాహ్మణులు"

"శాఖ?"

"నియోగులు"

"గోత్రం?"

వేణు కొంచెం చిరాకు చూపుతూ "జనాభా లెక్కల్లో ఈ వివరాలెందుకండీ. అయినా అడిగారు కాబట్టి చెప్తున్నా-మాది భారద్వాజగోత్రం" అన్నాడు.

"సరే. ఇక్కడ మీరు-మీభార్య కాక ఎంతమంది వున్నారు? మీ కు సంతాన మెందరు?" అని వేణుని చూసీ చూడనట్లు చూస్తూ అడిగాడు.

"నాకు ఇంకా పెళ్ళికాలేదండి... అందుచేత సంతానంసంగతి ప్రశ్న వుత్పన్నం కాదు" అన్నాడు వేణు.

"అలాఅయితే త్వరగా పెళ్ళిచేసుకోండి" అని అవ్వగారు అక్కడ తన అస్తిత్వాన్ని తెలియచేసేందుకన్నట్లు మాట్లాడింది.

"వద్దువద్దు-ఆపనిమటుకు మీరు చేయవద్దు. నిజంగా తెలివిగలవారెవరు ఈ కాలంలో ఆడవారిప్రమేయం పెట్టుకోరాదు. ప్రపంచ జనాభా చాలా పెరిగిపోతున్నదనీ-ఇప్పటివారికే ఆహారము చాలటంలేదుకాబట్టి ప్రతివారు కుటుంబ నియంత్రణ చేయాలని ప్రభుత్వము ఆదేశిస్తున్నది. కాబట్టి ఆమెగారి మాటలు మీరు యేమాత్రం పాటించవద్దు. వారి జాతి వుచ్చుల్లో మీరు ఒక్కమారు చిక్కుకున్నారా మళ్లా తప్పించుకోలేరు...ఇప్పుడు ఈ ఉపన్యాసం ఎందుకులెండి - ఇక చెప్పండి - మీ వయస్సెంత?" అని ఆ గణకుడు అడిగాడు.

"ఇరవై ఆరు సంవత్సరాలు"

"మీ జన్మస్థలం?"

"రాజమండ్రి"

"మీ మాతృభాష?

"తెలుగు"

"ఇంకా ఇతర భాష లేమైనా మాట్లాడు తారా?"

వేణుకు ఇప్పటికే ఈయన ధోరణి విసుగు పుట్టిస్తోంది. ఇలా సాగనిస్తే తన కార్యక్రమ మంతా భగ్నమైపోయేట్లుంది. అందుకని ఇక నోటికి వచ్చిన సమాధానాలు చెప్పి వాళ్ళను త్వరగా వదిలించుకోవాలనుకుంటున్నాడు. ఇంతలో ఆ ముసలాయన మళ్లా "ఏమిటో ఆలోచిస్తున్నారే? ఇతర భాష లేమైనా మాట్లాడుతారా అని అడిగానండి" అన్నాడు.

ఈ హెచ్చరికతో వేణు ఓర్పు సన్నగిల్లింది... "ఆహా - మాట్లాడుతానండీ-ప్రేమ భాష" అన్నాడు హేళనాస్వరంలో.

"భలే...చాల మంచి భాషే నే ... అయితే ఇది చాలా పాతభాష...అయినా మీ బోటివారు అవస్యంఅదేమాట్లాడాల్సింది. ...సరే...మీరు స్వతంత్రంగా వుంటున్నారా లేక ఇతరులమీద ఆధారపడి జీవనయాత్ర సాగిస్తున్నారా?...

"స్వతంత్రంగానే జీవిస్తున్నాను."

"అంటే స్వతంత్ర యజమానియా - లేక, యజమానివద్ద స్వతంత్ర ఉద్యోగిగానా లేక స్వతంత్ర కార్మికుడుగా వుంటున్నారా?"

"ఒకొక్కప్పుడు యజమానిగా వుంటాను—ఒకొక్కప్పుడు సేవకుడుగా కూడా వుంటాను-"

"అంటే...?"

"ఆ...ఏమీ లేదు. నామ్మటుకు నేను స్వతంత్రుణ్నే—కాని...కాని..."

"చెప్పండి. పరవాలేదు ... ఈ వివరాలన్నీ సేకరించి మిమ్మల్ని కోర్టుకు ఈడుస్తామని యేమీభయపడ నవసరంలేదు. అలాగని ప్రభుత్వం తరఫున మేము మీకు ఘట్టిగా హామీఇస్తున్నాం," అన్నాడాయన గంభీర వదనంతో. కళ్ళజోడునుంచి తల ఎత్తకుండా చూస్తూ.

"అబ్బే...నాకో భయంలేదు...మీరథి గారు గాబట్టి చెప్పక తప్పదు. నేను స్వతంత్రుణ్ణే అయినా, ప్రస్తుతానికి ఒక అమ్మాయికి మాత్రం దాసుణ్ణి."

ఆయన వ్రాయటం ఆపి నవ్వుతూ, "భేష్—భలే చక్కని సంగతి చెప్పావయ్యా...శ్రీకృష్ణ పరమాత్ముడిలాగా అనాది ఆచారాన్ని అమలులో పెట్టుతున్నారన్నమాట...ఇంకేం ఎక్కువరోజులు ఆ అమ్మాయికి దాసుడుగా వుంటే ప్రమాదం—త్వరగా యజమానికండి" అని అవ్వగారివైపు చూసి... "ఈయనగారు ఎలాగైనా నీమాటే ఖాయం చేసేట్లున్నారే" అన్నాడు.

అవ్వగారు తనకు మాట్లాడేందుకు వచ్చిన ఛాన్సును వదులుకోవటం ఎందుకన్నట్లు "అవును మరి — మేము మాట్లాడేవన్నీ ఖాయమయ్యేమాటలే. మీలాగా మా స్త్రీజాతి నోటిలోంచి ఊకదంపుమాటలు అస్సలు రావు" అని తాతగారిమాట తిప్పి వప్పగించింది.

"సరే యిక ఈ ఊకదంపుమాటలుఆపి అస్సలుసంగతికి వద్దాం. ఇంక పది ప్రశ్నలు మాత్రం వున్నయి—త్వరగా చెప్పెయ్యండి" అన్నాడా ముసలాయన.

"అబ్బ—పదిప్రశ్నలే?...త్వరగా కానియ్యండి...నాకు వేరేపనుంది," అని ఇక ఓర్పుకోలేక అనేశాడు వేణు.

"అవును—గ్రహించాం—ఇక ఆలస్యం లేదు. చెప్పండి మీ నెలజీత మెంత?"

"సుమారు మూడు వందల దాకా వుంటుంది."

"ఇంకా ఇతర ఆస్తి యేమైనా వుందా?"

"అయ్యా—జనాభా లెక్కలకూ—ఆస్తి అయివేజులతో ఏమి సంబంధం?" అని అడిగాడు వేణు కొంచెం సంశయంతో.

"ఏమోనండీ—నాకుమటుకు ఏమి తెలుసు—ఫారం చూసి అడుగుతున్నాను. వీలుంటే చెప్పండి రాసుకుంటాను. లేకపోతే ఆ కాలం ఖాళీగావుంచేస్తాను," అన్నాడు.

"వున్నదండి. ఇల్లు—భూస్థితి కలసి సుమారు నలభైవేల విలువ ఆస్తి వుంది."

"అంటే ఇప్పుడు మీ స్వాధీనములో వుందా?"

"లేదు. మా తండ్రిగారు చూస్తుంటారు."

"మీరు అన్నదమ్ము లెందరు?"

"ఇద్దరు."

"అక్క చెల్లెండ్రు?"

"లేరు."

"చదువను వ్రాయను వచ్చా?"

"ఎవరికి?"

"మీకు," ఫారం చూస్తూ నవ్వుతూ అడిగాడు.

"ఏమో గట్టిగా చెప్పలేను," వేణు కూడా అలాగే జవాబిచ్చాడు.



"కమలా త్రిరింగ్ సర్కస్"లో రాధాకృష్ణ నృత్యం చేస్తున్న బెల్జియన్ సోదరీమణులు రోసినా, మార్గరెట్.

"మీ విద్యాయోగ్యత అంటే క్వాలిఫికేషన్ ఏమిటి?"

"కెమిస్ట్రీ ఎం. ఎస్. సి."

"స్త్రీయా—పురుషుడా?" తిరిగి అచ్చు ఫారం చూసి నవ్వుతూ అడిగాడు.

"ఎవరు—నేనా—మీ కెవరనుకుంటే అదే రాసుకోండి," అని నవ్వుతూ వేణు తిరుగు సమాధాన మిచ్చాడు.

"సరే—ఇక మాపని అయిపోయింది" అంటూ ఆయన ఆ కాగితాన్ని మడచి కోటుజేబులో పెట్టుకున్నాడు.

ఇప్పటికి ఈ అగ్నిపరీక్ష ముగిసినందుకు వేణు చాల సంతోషించాడు. ఇక "వీళ్ళు వెళ్ళిపోతే బాగుండును" నే భావం వ్యక్తపరచే దీనదృష్టితో వీళ్ళవైపు చూశాడు ఆయన అది గ్రహించి. ఆమెను, "ఇంక అడుగవలసినవి యేమీ లేవుగా" అని ప్రశ్నించాడు.

"ఏమీ లేవ"ని ఆమె తలవూపింది.

"మీకు శ్రమఇచ్చాం. కావలసిన విషయాలు చాలా ఓపికగా తెలిపారు. చాల మంది మీలాగా ఇంత నిదానంగా వుండరు" అంటూ ఆయన తలపాగా సవరించుకొని వుత్తర్యం భుజంమీద వేసుకొని లేచాడు. ఆయన ననుసరించి ఆమెకూడా లేచింది.

"ఈయన ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లున్నారు. మన్మమన ముసలివాళ్ళ గొడవెందుకు?" అని వేణువైపు కొంటెగా చూస్తూ, "గుడ్-బై" చెప్పి గుమ్మం దాటి

★ స్వయంసేవకులు ★

మెట్లుదిగి వెళ్ళిపోయాడు. ఆయన వెనకనే ఆమెకూడా మందగమనంతో నడక సాగించింది. కొంచెంసేపు వేణు వారివంక చూస్తూ ఇంత వయస్సులో కూడా దేశంకోసం స్వయంసేవకులుగా శ్రమపడేవారి ఓపికను మెచ్చుకుంటూ, వరాండాలో నిలబడ్డాడు. జనాభా లెక్కలు తయారుచేసేందుకు ప్రభుత్వంవారు ఇలాంటి వృద్ధులకుకూడా శ్రమ కలిగిస్తున్నందుకు కొంత విచారించినా వారు తమ కార్యనిర్వహణ అతి నేర్పుతో చేస్తున్నందుకు వారిని అభినందించకుండా వుండలేకపోయాడు!!!

గదిలోకివెళ్ళి గడియారం చూసాడు. సుమారు ఆరుగంటలు కావచ్చింది. నిరాశతో మళ్ళా వరాండాలోకి వచ్చి తనదృష్టి ఎంత దూరం అనుతుందో అంతదూరం సారించి చూసాడు. కాని లత వస్తున్న జాడ యేమీ కనపడలేదు. ఇక చేసేదేమీ లేక మళ్లా గదిలోకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. కాని అతని మెదడు పనిచేయటం పూర్తిగా మానేసినట్లనిపించింది. 'ఈరోజునసైనా లత తన కోరిక నంగీకరిస్తుందా లేక ఆమె పెద్దల మూర్ఖపు పట్టుదలకు లొంగిపోయి తనను నిరాకరిస్తుందా?' అనే ఆలోచన అతనిని వేధించసాగింది. మామూలుగా వచ్చి "నన్నేం చేయమంటారు? మావాళ్ళ మాట నేను కాదనలేను. నన్ను మరచిపోండి" అని చెప్పి దుఃఖంతో వెనక్కి తిరిగిపోతే తనకర్తవ్యం యేమిటి?? అతను ఆమెను వదులుకుంటాడా?...కాదు...ఈ రోజుతో ఈ సమస్య నెలాగైనా పరిష్కరించాలి—అంతగా అవసరమైతే తనే వెళ్ళి లత తల్లిదండ్రులకు కనపడి ఆమెను తనదానినిగా చేసుకోవాలి...ఇలా ఈ నిర్ణయానికి వచ్చిన తర్వాత అతని మనస్సుకు కొంత శాంతి లభించింది. అయినా లత యింతవరకు ఎందుకు రాలేదో కారణం తెలియక ఆలోచిస్తూ కూచున్నాడు.

కొంచెంసేపయిన తర్వాత లత వచ్చింది. ఆమెను చూడగానే అతనికి నూతనోత్తేజం కలిగింది అంతక్రితంవరకు అతని మొహాన అలముకొన్న విచారఛాయలు విచ్చిపోయినయి ఈ రోజు ఆమె ఎంతో ఉత్సాహంగా ఆనందంగా కనపడింది. లత గదిలో కాలుపెట్టగానే వేణు మొట్టమొదటి ప్రశ్న "లతా—ఏమిటీ ఇంత ఆలస్యం చేశావు?" అని.

"నిజమే ఆలస్యమైంది. నేనేం చేసేది! నేను ఎప్పుడో బయలుదేరాను; కాని తీరా వస్తుండగా మా అమ్మ నాన్న వచ్చి "మేము ఇప్పుడే కొంచెం బయటకు వెళ్ళివస్తాము. మేము వచ్చినతర్వాత వెళ్దువుగాని ఇంట్లో వుండమని చెప్పి వెళ్ళారు. వాళ్ళు ఇంటికి రాగానే నేను, ఇటు పరిగెత్తుకొని వచ్చేను" అని అతన్ని సమాధాన పరచింది.

"అబ్బ—ఈ ముసలివాళ్ళకు ఇప్పుడే వూళ్ళమీద వూరేగాలని మనసు కలిగింది? నిజంగా లతా నీవు ఆలస్యం చేసినందుకు నాకు నీ మీద ఎంతకోపం వచ్చిందో తెలుసా?" అన్నాడు వేణు తన ఆతృతను వ్యక్తపరుస్తూ.

"ఓ- తెలియకేం?...మీకోపం చిజల్లులాగా నిమిషం-అయినా అదికూడా నన్ను చూసేంతవరకేనని కూడా నాకు బాగా తెలుసులేండి...ఇవ్వాళ మీకోసం ఒక చల్లనివార్త మోసుకొని వచ్చానుగా..." అని లత సంతోషంగా సమాధానమిచ్చింది.

"నిజంగానా...ఆ కమ్మనివార్త ఏమిటో త్వరగా చెప్పెయ్యరాదు విషిగించకుండా..." అని వేణు తన సంతోషాన్ని ఆతృతను వ్యక్తపరిచాడు.

"నిజమే...మన వివాహానికి మా అమ్మ నాన్న సమ్మతించారు," అని లత చెప్పగానే వేణు ఆనందంతో ఒక్కమారు లేచి వెళ్ళి ఆమెను సోఫాలో కూలేసి ఆప్యాయంగా ఆమెభుజం పట్టుకొని ఊపుతూ "అమ్మయ్యా బ్రతికించావు ... ఇందాకటినుండి మీవాళ్ళు ఒప్పుకోకపోతే ఏమి చెయ్యాలి అని ఆలోచించి ఆలోచించి నాబుర్ర వేడెక్కిపోయిందిగదా! చూశావా మరి మన ప్రతాపం! వాళ్ళు ఎలాగూ ఒప్పుకుంటారని నాకు ఎప్పుడో తెలుసు!! వాళ్ళకు వేరే గత్యంతరం లేదు మరి!!! ముసలివాళ్ళ పట్టుదలలు ఎంత మూర్ఖమైనవో అర్థంలేనివో ఇప్పటికైనా బాగా తెలుసుకున్నావా? 'మావాళ్ళు మిమ్మల్ని చూడాలి-వాళ్ళు చూపిందే మన పెళ్ళి సాధ్యంకాదు' అని నీవు కూడా మూర్ఖంగా నన్ను ఇన్నాళ్ళు అనవసరంగా వేధించావుగదా!" అని సగర్వంగా తన ఆవేశాన్ని అణచుకోలేక అన్నాడు.

"మావాళ్ళకి మీరు నచ్చారు...అందుకనే వాళ్ళు ఒప్పుకున్నారు" అన్నది లత నిదానంగా నవ్వుతూ వేణు విజయగర్వాన్ని అణచాలని.

"అంటే?...మీవాళ్ళు నన్ను చూసినట్లు మాట్లాడుతున్నావే?"

"ఆ...చూడటమే కాదు...మీ సంగతులన్నీ కూడా వాళ్ళకు తెలుసు."

"ఛా...అదెప్పుడూ సాధ్యం కాదు. వాళ్ళు నన్నెప్పుడు చూశారు? ఊరికే చెప్పుకున్నారంటే నిన్నా, వాళ్ళనికూడా లోకువచేసి ఆటలు పట్టిస్తానని బుకాయిస్తున్నావులే! అంతమాత్రం తెలుసుకోలేనా?" అన్నాడు.

"అదేమీ కాదులెండి - అన్నీ వాళ్లకు తెలుసు - చెప్పనా?...మీకు నెలకు మూడు వందల రూపాయల జీతం-మీరు నియోగి బ్రాహ్మణులు — భారద్వాజ గోత్రోద్భవులు - మీకు నల్భైవేల ఆస్తి ఉన్నది - ఇంకా...."

"చాల ఆశ్చర్యంగా వుందే...ఇవన్నీ నీకు ఎలా తెలుసు" అని వేణు విస్మయచకితుడై అడిగాడు.

"ఇంతేకాదు....ఇంకా చాలా తెలుసులేండి నాకు..."

"ఏం తెలుసో...చెప్పు వింటాం"

"మరే...పాపం-మరే...తమరు ప్రేమభాష మాట్లాడుతారట...ఇంకా...ఇంకా ఎవరో ఒక అమ్మాయికి దాసుడుగా కూడా వుంటున్నారట...అవునా?" అంటూ లత విరగబడి నవ్వుతూ కన్నెస్తూ కొంటెగా అడిగింది.

"ప్రేమభాషా??....ఒక అమ్మాయికి దాసుడు?...ఆ... తెలిసింది - అమ్మదొంగల్లారా...భలే స్వయంసేవకులే...?...ఎంత మోసం చేసారు ఆ ఆది దంపతులు...." అంటూ వేణు కూడా బిగ్గరగా నవ్వుతూ లతను దగ్గరతీసుకొని ఆనందాతిరేకంతో గట్టిగా తన హృదయానికి చేర్చుకున్నాడు. ఆ గదంతా ఒక్కమారు పూర్తి శరత్ చంద్రిక ప్రసరించినట్లు విలసిల్లింది!!! ★

వనితా లోకం

"ఉత్తమం ఇనప్పెట్టె చోరీ,
మధ్యమం సూట్‌కేసు చోరీ।
అధమం పిక్‌పాకెటింగ్ సోదరా।
అధమాధమ్మం ఇతరత్రయేత్"


అంటూ నొక్కి వక్కాణించాడట ఎక్కడో, ఎప్పుడో, ఏదో సందర్భంలో ఒకానొక ఆరితేరిన కవి-దొంగ. నిజమే మరి ఇనప్పెట్టెలూ, సూట్‌కేసులూ, పోనీ అధమం జేబుదొంగతనాలయినా ఆ ఘనుడు చెప్పినట్టు ఏదో ఫర్వాలేదు, కాని ఆఖరున ఆ "ఇతరేత్రయేత్"లో లెఖ్ఖకు వచ్చే దొంగతనాల్లో బొత్తుగా పనికిరానివి కొన్ని వున్నాయని భావం కాబోలు. మరి కాకపోతే ఉత్తరాలను దొంగతనంగా చదువుతుండే పెద్ద మనుషులకు పాపం— దమ్మిడీఎత్తు ఆదాయం ఉంటుందీ? కాని పాపం అలా ఆదాయం లేకున్నా ఓపిగ్గా దొంగతనంగా మరొకరి జాబులు పనిబడి చదువుతుంటారు కొందరు "స్వార్థత్యాగులు" అలా ఇంకొకరి వుత్తరాలను అంత ఆతురతగా ఉండబట్టలేక దొంగిలించుకు చదవటంలో వాళ్ళమన సత్వం మంచిచెడ్డలమాటఅటుంచి, భావంకూడా అర్థంకాదు మనబోటిగాళ్ళకు! కట్టలకట్టలవుత్తరాలు మరొకరివి రహస్యంగా చదివే పెద్దమనుష్యుల్ని కొందర్ని నేను చూచాను. అలాటివాళ్లు మహాజాగ్రత్తగా వుంటారేకాని పాపం ఎప్పుడో ఒకప్పుడు పట్టుబడిపోతుంటారు.

ఘరానాలు

ఈఉత్తరాలదొంగల్లోకల్లా మరీ ఘరానా దొంగలు కొందరుంటారు. వా[illegible] అంటే ఇతరుల వుత్తరాలను భస్తే (చూ[illegible]) తాకరు. కొర్దులజోలికి అసలేపో[illegible] "ఫలానావారి జాబు మనం తాకకూడదు. ఇది"అంటూ ఉపదేశాలుచేస్తూచేస్తూ అనమ్మకంలో నెమ్మదిగా అలా ఇలా చూచి చదివేస్తుంటారు కవర్లు. మళ్లీ కార్డు చేతికిచ్చి చదవమన్నా చదవటానికి మహాకష్టపడ్తారు. వీళ్ళల్లో అనుమానం మనుషులుకొందరు. అవతలివాళ్లు ఎవరికైనా ఏదైనా జాబు రాసినా, ఎవరిదగ్గర్నుంచైనా జాబువచ్చినా ఏమేమిరాసి వున్నాయో (తమమీద) అని మొదట అనుమానం వేస్తుంది కాబోలు. ఎలాగైనా చదివితీరాలనే ఆతురతతోటి తప్పనిసరిగా పొయ్యే జాబులు వచ్చే జాబులు చదువుతుంటారు. "కామెర్లరోగికి లోకమంతా పచ్చగా కన్పిస్తుం"దనే సామెత వూరికే పుట్టలేదనుకుంటా. తమ మనస్సులు దొంగవి అయ్యేసరికి ఎదుటివాళ్ళమీద తప్పనిసరిగా అనుమానం పుట్టుకొస్తుంది.

నోరు కట్టలేరు కాబట్టి

ముఖ్యంగా ఉత్తరాల దొంగల్లో ఎక్కువమంది మగవాళ్ళే! ఎంచేతంటారేమో అలా ధైర్యంచేసి సర్వసాధారణంగా ఆడాళ్లు ఆ పనికి పూనుకోనూ పూనుకోరు, పైగా ఆడవాళ్ళలో చదువురానివాళ్ళు కూడా చాలామంది వున్నారుగా! అదికాక అవకాశాలూ మగాళ్ళకి ఎక్కువ. మా ఫ్రెండ్ ఒకమ్మాయి పెళ్ళయి అత్తారింటి కెళ్ళింది. వెళ్ళేటప్పుడు తప్పకుండా జాబులు రాస్తుండమని చెప్పి పంపాను. సరేనంది. తీరా వెళ్ళాక ఎన్ని జాబులు నేను రాసినా జవాబు వ్రాసేదికాదు. విసుగుపుట్టి నేనూ మానుకున్నా. తీరా తర్వాత వచ్చేక కారణం అడిగితే ఆవిడ చెప్పిన సమాధానానికి నాకు నవ్వాలో ఏడవ్వాలో అర్థం కాలేదు. ఏమిటంటారేమో—నా దగ్గర్నుంచి వెళ్ళిన ప్రతి కవరు వాళ్ళ విదోక్లాసు చదివే ఆడబిడ్డ దగ్గర్నుంచి డబుల్ డిగ్రీస్ పుచ్చుకున్న వాళ్ళ మామగారిదాకా చదివితే కాని మా ఫ్రెండ్ చేతికి పొయ్యేది కాదుట. అల్లాగే ఆవిడ రాసే ప్రతి కార్డూ కూడా చెకింగ్ పూర్తయితే గాని పోస్టుకు పోదుట. మనం రాసే జాబులు—అందులో ఏ రహస్య విషయాలూ రాయకున్నా మరెవరైనా చదివా




ట్రే క్లాత్ డిజైను

విజయమహంతి
(రాజమండ్రి.)

వివరణ 1. కాడకుట్టు 2. ముద్దకుట్టు 3, 4. కాజాకుట్టు, కావలసిన దారాలు: నెం. 770 ఆకుపచ్చ, 382 కలువ పువ్వురంగు, 968 పసుపు పచ్చ

2



ఈ కట్‌వర్కు డిజైన్ 'ట్రేక్లాత్'కు చాలా బాగుంటుంది. తెల్లబట్టమీద కానీ, రంగుబట్టమీదగాని, కుట్టుకోవచ్చు.

ఒకటవ బొమ్మనుచూస్తే ఎలా కుట్టాలో తెలుస్తుంది.

రెండవ బొమ్మను యిష్టమున్నవారు ఈసైజులోనే బట్టమీదకు వేసుకొనికుట్టుకోవచ్చును. పెద్దది కావాలనుకున్నవారు దీనినే పెద్దది చేసుకోవచ్చును. రంగులను వారి వారి అభిరుచుల్నిబట్టి మార్చుకోవచ్చును.

డిజైను అంతా పూర్తిగా కుట్టివేసిన తరువాత చిన్న పదునైన కత్తెర తీసుకొని బొమ్మలో నల్లగా గుర్తించిన భాగాలు కత్తిరించుకోవాలి.

ఇలా కత్తిరించేటప్పుడు చాలాజాగ్రత్తగా వుండాలి. ఏమాత్రం తొందర పడినా కుట్టు కత్తిరించుకుపోతుంది. కత్తిరించాకచూస్తే మధ్యమధ్య కన్నాలు వచ్చి చూడడానికి చాలా బాగుంటుంది.

ఈ డిజైను 'ట్రేక్లాతు'కు రెండువైపులా అంటే బట్టకు అడ్డం వైపున వేసుకొని కుట్టుకోవాలి. ఇలా నిలువు రెండు వైపులూ సన్నగా మడిచి లైనుగా కాజా కుట్టు కుట్టుకోవాలి. కుట్టుకోవటంవల్ల రెండు డిజైన్లు కలిసి చాలా బాగుంటాయి.

ఉత్తరాల దొంగలు

రంటే మహా కష్టమనిపిస్తుంది. ఒక వేళ ఏదైనా మనసులోమాట రాసుకుంటాం అనుకోండి — అది ఇతరులకు తెలిసిందంటే మనం పడేబాధ — ఆ చదివిన వాళ్ళమీద కోపం వర్ణించనలవి కానిదిగా వుంటుంది. పోనీ జాబులైతే చెక్ చెయ్యగలిగారు గాని— నోళ్లు కుట్టివెయ్యలేరుగా ... ఒకప్పుడు కాకుంటే మరొకప్పుడైనా అసలు కారణం బైట పడకపోదు.

ఈ ఉత్తరాల దొంగలకి వ్యాజ్యాలూ, కేసులూ ఇలాటివాటిల్లోనయితేపోనీ ఏదైనా లాభం అనుకోవచ్చు. నిత్యజీవితంలో తటస్తపడే ప్రతికార్డూ, ప్రతికవరూ చదివిన దానివల్ల (ముఖ్యంగా ఇతరులవి) వచ్చే లాభం ఏమైనావుందా? అది వాళ్ళ దొంగ మనస్సుల్ని చాటుతుందేగాని— వేరే ఫలితం శూన్యంకదూ?

భార్యా భర్తలమీదకూడా నిఘా!

"అయితే ప్రాణంమీదికివచ్చినా మరొకరి జాబులు చదవకూడదని నియమం పెట్టుకోవాలనా మీ వుద్దేశ్యం" అంటూ పతితలు కొందరు అభిప్రాయపడనూవచ్చు - అడగనూ వచ్చు. కాని నా వుద్దేశ్యం అది కాదు. ఎప్పుడో ప్రాణంమీదికి వస్తుంది కాని ఎప్పుడూ రాదుగదా! మరి ఎప్పుడో అలా ప్రాణంమీదికివస్తుందని ఎప్పుడూ ఇంకొరి జాబులు (పర్సనల్‌వి అయినా) చదవటంలో గల అర్థమేమిటి? ఏదైనా మరీ తప్పనిసరి అయినప్పుడు తప్ప, సాధ్యమైనంతవరకు మరొకరి జాబులు చదవటం మానేసుకుంటే ఎంతో బావుంటుంది. భార్యాభర్తలు రాసుకునే జాబులు కూడా తనిఖీచేసి మరీ ఇచ్చేవారిని కూడా కొందర్ని నేను చూచా. మరి దాన్లో వాళ్లకు వచ్చే ఆదాయ మేమిటో, ఆనందం ఏమిటో నాకర్థంకాదు. అంతకంటే నీచమైన పని మరొకటి లేదని తెలిసికూడా ఎందుకలా చేస్తారో అంతుచిక్కదు. పోనీ అజ్ఞానం వల్లనా అంటే— బాగా డిగ్రీలు ఒకటికి

(43-వ పేజీ చూడండి)

ఉండ్రాళ్ళతద్దె

ఇది భాద్రపద బహుళతదియనాడు (సెప్టెంబరు 11 న) వస్తుంది. ఉండ్రాళ్ళ తద్దె మన పిల్లల పండుగలలో ఒకటి. ఇది వస్తోందంటే, ఆడపిల్లల సరదా ఇంతా అంతా కాదు. సాధారణంగా అట్లతద్దె, ఉండ్రాళ్ల తద్దె తెలియని వారుండరు. మద్రాసువంటి పెద్ద పట్టణాలలో ఉండే కొందరికి ఈ పండుగంటే తెలియకపోవచ్చు. తెలుగుదేశంలోని హిందువులందరూ యథాశక్తి, ఈ పండుగ చేసుకుంటారు. మన దేశములో మున్నూట అరవై రోజులూ ఏవో పండుగలు, పర్వదినాలు, వ్రతాలు నోములే. నాగరికతలు బలిసినకొద్దీ, ఈ పండుగలు, నోములు, వేడుకలూ క్రమంగాపోతున్నాయేమోననిపిస్తుంది. అయినా, కొన్ని నోములు, వ్రతాలు, మన ఆడవాళ్ళలో పాత సాంప్రదాయపు పద్ధతులు జీర్ణించి పోవడంవల్ల పూర్తిగా మాసుకోలేకుండా వున్నాము. ఈ ఉండ్రాళ్ల తద్దె పండుగకు ఆడపిల్లలతోపాటు చిన్న మగపిల్లలు కూడా కలసి ఆడుకుంటారు.

దీనికి ముఖ్యం గోరింటాకు గనుక, క్రితంరోజునే ఆకు తెచ్చి పెట్టుకుని, తలంటి పోసుకుని, ఆరాత్రి రుబ్బి చేతులకు కాళ్లకు పెట్టుకుని, తెల్లవారు జామునే కడుక్కుని, పండువెన్నెల్లో చేతులు యెవరివి బాగా పండాయోనని చూసుకుంటారు. తర్వాత ఉట్టికింద ముద్ద తిని, తలలు దువ్వుకుని, క్రితంరోజే సిద్ధంగా వుంచుకున్న పువ్వులు పెట్టుకుని, తాంబూలాలు వేసుకుని, వెన్నెల్లో ఆడుకుంటారు. పెళ్లయిన వాళ్లు, పెళ్ళికాని పిల్లలు, మధ్యాహ్నము నోము యథావిధిగా నోచుకుంటారు. ఆరోజంతా ఒకళ్ళ ఇళ్ళకు ఒకళ్ళు వెళ్ళి ఉయ్యాలలూగుతారు. పెద్దపెద్ద ఊపులూపి, ఒకళ్ళ నొకళ్ళు పెళ్ళయిన పిల్లలు మొగుడి పేరు చెప్పేదాకా ఆపకుండా ఊపుతూనే వుంటారు. ఇలా ఆ రోజంతా రకరకాల ఆటలతో పాటలతో సరదాగా కాలక్షేపం చేస్తారు.

ఈ నోము ఫలితం అన్యోన్య దాంపత్యం కోసం అని, ఈ నోము కథవల్ల మనకు అర్థమవుతుంది.

ఒక రాజుకు నలుగురుకొడుకులు వుంటారు. నలుగురూ పెళ్ళిళ్ళయి అందులో ముగ్గురు మాత్రం భార్యలతో కాపురాలు చేస్తూంటారు. నాలుగోవాడు మాత్రము వేశ్యతో కాలక్షేపం చేస్తూ ఇంటిగొడవే పట్టించుకోడు. ఇలావుండగా కొన్నాళ్ళు పోయాక వేశ్యకు ఇంకొకరితో స్నేహమై ఇతన్ని ఏలా అయినా వదిలించుకుందామని ఆలోచిస్తూ వుంటుంది. ఈలోగా ఉండ్రాళ్ళతద్దె వస్తుంది. ఈ తద్దెకు నోము నోచుకుంటానని, కావలసిన సామగ్రి తెచ్చిపెట్టమని రాజుకొడుకుని అడుగుతుంది. నిముషంలో తెస్తానని ఏమేమికావాలో చెప్పమని అడుగుతాడు. అప్పుడు వేశ్య ఆకు

సిహెచ్. సావిత్రి

గీకు; బియ్యం గియ్యం; పప్పూ గిప్పూ కూరా గీరా; బెల్లం గిల్లం; నెయ్యి గియ్యి; పసుపూ గిసుపూ, కుంకుమ గింకుమ, పీటా గీటా, వక్కా గిక్కా, అని ఏవేవో చెప్పి తెచ్చిపెట్టమనిఅడుగుతుంది. అన్ని వస్తువులూ పట్టుకుని మధ్యాహ్నము వేశ్య ఇంటికివచ్చి "గి" అనే వస్తువులుమాత్రం దొరకలేదంటాడు. అంతకుముందే అన్ని కుండలూ కడిగిన పళ్ళనీళ్ళు ఒక కుండలో పోసివుంచి రాజకుమారుడి ముఖముమీద ఇక నా ఇంటికి రావద్దని విసిరిపోస్తుంది. అప్పటికే అపరాహ్ణం తిరిగిపోతున్నందువల్ల ఆ కుర్రవాడు బాగా ఆకలిగావుండి తన ఇంటికిపోయి వీధి అరుగు మీద కూర్చుంటాడు. ఆ రాజకుమారుడి తండ్రికి భోజనాలవేళకి వాకిట్లో ఎవరు వుంటే వాళ్ళను పిలిచి సుష్టుగా భోజనము పెట్టిగాని తను తినడం అలవాటులేదు. ఆ ప్రకారం వాకిట్లో కొచ్చి చూస్తే కొడుకే కనిపిస్తాడు. సంతోషంతో కొడుకుని లోపలికి తీసుకువెడతాడు. ఆ రోజే తద్దె కాబట్టి నలుగురు కోడళ్లూ నోమునోచుకుని పూజ చేసుకుంటారు. నాలుగవ కొడుకు కూడా వచ్చి నోముభోజనం ఆరగిస్తాడు. నాటినుంచి వేశ్యఇంటికి పోకుండా, ఇంటిదగ్గరే సుఖంగా వుండిపోతాడు.

ఈ నోము పెళ్లయినతర్వాత ఐదేళ్ళు నోచుకుని ఉద్యాపన చేసుకోవాలి. అట్లతద్దె నోముకు ఎప్పుడైనా ఉద్యాపన చేసుకోవచ్చుగాని, ఈ నోము మాత్రం తద్దినాడే చేసుకోవాలి. ఐదుగురు ముత్తయిదులకు తలంటి సామాన్లు, రుబ్బిన గోరింటాకుముద్ద క్రితంరోజు సాయంత్రమే ఇచ్చి, ఆ తెల్లవారు జామున ఉండ్రాళ్ళతో, ఇంకా పిండివంటలతో ఆ ముత్తయిదువులకు భోజనముపెట్టి, ఐదురవికెల గుడ్డలలో అయిదేసి కానులు పెట్టి, తాంబూలములు ఇచ్చి ఈ నోము ఉద్యాపన చేసుకోవాలి వ్రతలోపమయినా భక్తి తప్పకూడదంటారు. ★

హల్వాలు

పి. అనసూయ

బూడిద గుమ్మడికాయ హల్వా

కావలసిన వస్తువులు : పాలు-అర్థశేరు; పంచదార-పది పలములు; నెయ్యి ఐదు పలములు. బూడిద గుమ్మడి కాయ బద్దలు-నాలుగు, జీడిపప్పు రెండణాలకు, కుంకుమ పువ్వు, పచ్చకర్పూరం, ద్రాక్ష తగుమాత్రంగా తీసుకోవాలి. ఏలకులపొడి ఒక అణాది.

తయారుచేయు పద్ధతి : బూడిద గుమ్మడి కాయ ఒకటి తీసుకుంటే చాలా ఎక్కువ అవుతుంది కనుక ఓ నాలుగు బద్దలు తీసుకోవాలి. బజార్లో బద్దలుకోసి అమ్ముతుంటారు. అవి తెచ్చి సన్నగా, పైనవున్న చెక్కు తీసేయాలి. బద్దలోపల వున్న గుజ్జు, విత్తనాలను శుభ్రంగా తీయాలి. ఆ తర్వాత దానిని కొబ్బరి తురిమినట్లుగా కొబ్బరి పీటలో తురిమి ఓ పళ్ళెంలో వుంచాలి. పొయ్యి మీద బాణలి వుంచి కొద్దిగా నేయి వేసి బాగా కాగిన తర్వాత ఈ తురుముకున్న గుమ్మడికాయను వేయించాలి. నేతిలో వేయించిన గుమ్మడికాయ 'కోరును' (తురిమిన దానిని) ఓ పాత్రలో వుంచాలి.

జీడిపప్పు, ద్రాక్షకూడా కాస్త నేతిలో వేయించుకోవాలి.

అర్థశేరు పాలతో కోవా తయారు చేసుకోవాలి. లేదా బజారులో అమ్ముతారు. ఈ రెండు సరిపడకపోతే మనమే ఓ అర్థశేరు పాలను కాగబెట్టి దానిలో కాస్త చింతపండు రసమో, లేక నిమ్మరసమో వేస్తే అవే విరిగిపోతాయి. ఆ విరిగిన పాలనైనా వుపయోగించుకోనవచ్చును. పది పలముల చక్కెరను లేత పాకం పట్టి వుంచుకోవాలి. పాకం పట్టడం అందరికీ తెలిసిందేగా. పొయ్యిమీద ఈ విరిగిన పాలు, లేదా కోవాను వుంచి దానిలో కొద్దిగా నేయి ఈ గుమ్మడికాయ కోరును వేసి బాగా కలియబెట్టాలి. తర్వాత చక్కెర పాకం పోసేయాలి మూతబెట్టి మంటను తగ్గించాలి. గుమ్మడికాయ కోరు బాగా వుడికాక, ద్రాక్ష, ఏలకులు, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం, మిగిలిన నెయ్యి వేసి మరలా కలియబెట్టి దించేశాక మూతవేయాలి. తర్వాత ఓ పళ్ళానికి నేయిరాచి ఈ హల్వాను దానిపై పోసి చల్లారనిచ్చి తింటే చాలా రుచిగావుంటుంది. హల్వా లన్నింటిలోకి గుమ్మడికాయ హల్వాదే అగ్రస్థానం రుచిలో.

* * *

కారెట్ హల్వా

కావలసిన వస్తువులు: క్యారెట్-10 పలములు. నెయ్యి-5 పలములు, పావుశేరు-కోవా; పంచదార- 10 పలాలు. జీడిపప్పు రెండణాలకు; కిసిమిస్ పండ్లు; కుంకుమ పువ్వు; పచ్చకర్పూరం; ఏలకులు తగు మాత్రం.

తయారుచేయుపద్ధతి: 10 పలములు క్యారెటును తెచ్చి శుభ్రంగా కడిగి, పొడిగుడ్డతో తుడుచుకోవాలి. తర్వాత దానిని కొబ్బరిని తురుముకున్నట్లుగా తురుముకోవాలి. ఈ తురుముకొన్న క్యారెటును కొద్దిగా నేతిలో వేయించుకొని ఓపళ్ళెంలో వుంచుకోవాలి. పావుశేరు పాలతో కోవా తయారుచేసుకోవాలి, లేదా బజారులో అమ్మేది తెచ్చుకోవాలి. జీడిపప్పు ద్రాక్ష వేయించి (నేతిలో) తీసుకొని వుంచుకోవాలి. ఓ కళాయి పాత్రలో నవటాకు నీళ్ళుపోసి ఈ పదిపలముల పంచదారతో లేతపాకం పట్టుకోవాలి. బాగా పాకం వచ్చాక ఈ క్యారెటును వేసి గరిటెతో అడుగుమాడకుండా కలియబెట్టుండాలి. పాకం క్యారెటు ఈ రెండుకలిసి బాగా ముద్దగా అవుతుంది. అప్పుడు నెయ్యి, కోవా, ద్రాక్ష, కుంకుమ పువ్వు, పచ్చకర్పూరం, ఏలకులు వేసి మరలా కలియబెట్టాలి ఓ పళ్ళానికి నేయి రాచి దానిలో ఈ హల్వాను పోసి చల్లారనివ్వాలి పద్ధతి అంతా బూడిద గుమ్మడికాయ హల్వా తయారుచేసే పద్ధతే అయినా రుచిమాత్రం వేరుగా వుంటుంది. కుంకుమపువ్వు ఏలకులు, పచ్చకర్పూరం హల్వాకు రుచితోపాటు సువాసన నిస్తాయి.

* • *

సేమ్యా హల్వా

కావలసిన వస్తువులు: పంచదార-15 పలములు. నెయ్యి 5 పలములు; పాలు. పావుశేరు. సేమ్యా-10 పలములు, జీడిపప్పు, ద్రాక్ష, మిఠాయిరంగు. బాదంపప్పు.

సేమ్యాను కాస్త నేతిలో దోరగా వేయించాలి. జీడిపప్పు, ద్రాక్షనుకూడా నేతిలో వేయించాలి. ఓ కళాయి పాత్రలో పావుశేరు పాలుకొద్దిగా నీరు - ఎక్కువనీరు పోస్తే హల్వా చాలా పల్చగా అవుతుంది— పోసి బాగా కాగనివ్వాలి. పాలు తెర్లినాక, సేమ్యా వేసి కలియబెటి మూతవేయాలి. సేమ్యావుడికిందో లేదో చూచి వుడికిన తర్వాత పంచదార, నేయి పోసి మరలా వుడకనియ్యాలి. తర్వాత జీడిపప్పు, ద్రాక్ష, సన్నగా తరిగిన బాదంపప్పు ముక్కలు వేసేయాలి. మిఠాయిరంగు ఓ చిటికెడు కొద్దిగా పాలలో కలిపి లేదా నీళ్ళలో కలిపి వేయాలి. ఓ పళ్ళానికి నెయ్యిరాచి దానిపై దీనినిపోసి చల్లారనియ్యాలి. ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే నీళ్ళు ఏమాత్రం ఎక్కువైనా హల్వా గట్టిపడదు. అందుకని చేతితో తీసుకొని తినాల్సిన హల్వా గ్లాసులోపోసుకొని త్రాగవలసివస్తుంది నీళ్ళు ఎక్కువైతే. మిఠాయిరంగు కూడా చాలాతక్కువగా వాడాలి. సామాన్యంగా లడ్డుకు వాడే కలరే వాడుతారు చాలామంది.

హల్వాలు చేయడంలో నెయ్యి, కోవాలను బట్టేరుచివస్తుంది. మంచి నేయి మంచి కోవా అయితే చాలారుచిగా వుంటాయి. కాస్త శ్రద్ధగాచేస్తే యింటిల్లపాది హాయిగా తినవచ్చు. కానీ ఎటొచ్చి కాస్త ఖర్చు మాత్రం ఎక్కువే అవుతుంది.

* * *

"సగ్గుబియ్యం హల్వా"

కావలసిన వస్తువులు: సగ్గు బియ్యం-10 పలములు, పంచదార-15 పలములు, పాలు అర్థశేరు, నేయి-5 పలములు, తగుమాత్రం ఏలకులపొడి, జీడిపప్పు, ద్రాక్ష.

తయారుచేయుపద్ధతి సగ్గుబియ్యం హల్వా చేయడం పద్ధతంతా సేమ్యా హల్వాలాగే ఉంటుంది. సగ్గుబియ్యాన్ని కాస్త నేతిలో వేయించుకోవాలి. జీడిపప్పు ద్రాక్షనుకూడ వేయించుకోవాలి. ఓ కళాయిపాత్రలో ఓ నవటాకు నీళ్ళు, పాలుపోసి బాగా ఉడకనియ్యాలి. అంటే పాలు నీళ్ళు బాగా తెర్లాలి. ఈ మరుగుతున్న పాలలో వేయించిన సగ్గుబియ్యంపోసి మూత వేసేది. అప్పుడప్పుడు కలియ పెడ్తూండాలి. లేకపోతే వుండలు కట్టుతుంది. సగ్గుబియ్యం బాగావుడికాక చక్కెర పోసేయాలి. ఇవన్నీ కలిసి ఓ ముద్దగా తయారవుతుంది. ఈ ముద్దలో

నేయిపోసి, ద్రాక్ష, జీడిపప్పు, ఏలకుల పొడి వేసి మరలా కలియబెట్టి మంట తగ్గించేసేయాలి. ఓ పళ్లానికి నేయిరాచి యీ హల్వాను దానిపై పోసేసి చల్లారనియ్యాలి. ప్రతిపండుగకు పాయసంతాగి విసుగెత్తిపోతాముకదా ఈసారి ఏదైనా పండుగకు సగ్గుబియ్యంహల్వా ప్రయత్నించండి. కాస్త నెయ్యి ఎక్కువపట్టుతుందనితప్ప మిగతా ఖర్చంతా పాయసానికైనంతే అవుతుంది.

* * *

కేసరి హల్వా

కావలసిన వస్తువులు: బొంబాయిరవ్వ-అర్ధశేరు, పంచదార-10 ఫలములు, నేయి-౫ పలములు, పాలు-పావుశేరు, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం, ద్రాక్ష, జీడిపప్పు, ఏలకులు, మిఠాయిరంగు.

తయారుచేయుపద్ధతి: రవ్వను కాస్తా నేతిలో వేయించిపుంచాలి. ద్రాక్ష, జీడిపప్పునుకూడా నేతిలో వేయించుకోవాలి. ఓ కళాయిపాత్రలో పావుశేరు పాలు, నవటాకు నీళ్ళుపోసి బాగా మరగనియ్యాలి. ఈ మరుగుతున్న పాలలో వేయించిన రవ్వను పోస్తూ, గరిటెతో కలియబెడ్తుండాలి. రవ్వ ఉడికినతర్వాత పంచదారను పాకంపట్టకొని ఆ పాకంను ఉడికిన రవ్వలో పోసేయాలి. మరలా కలియబెటి కాసేపయాక నెయ్యిని, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం, ఏలకుల పొడి, చిటికెడుకలరు పాలలో కలిపి ఇవన్నీ పోసి బాగా కలియబెటి, సన్నమంటమీద ఉడకనియ్యాలి. కొద్దిసేపు అయ్యాక దించేయాలి. ఇదే బజారులో అమ్మే కేసరి హల్వా.

ఈ కేసరిహల్వా బాగా చల్లారాక, చిన్న చిన్న ముద్దలుగా చేసి ఉంచుకోవాలి. మైదాపిండి లేదా గోధుమపిండిని పూరీలకు కలుపుకున్నట్లుగా కలుపుకొని పూరీలుగా చేసుకోవాలి. తర్వాత ఒకపూరీ మధ్యలో ఈ చల్లారిన కేసరిహల్వాముద్దను పెట్టి పైన ఇంకోపూరీ పెట్టాలి. తర్వాత రెండుపూరీల 4 అంచులనుమడిచితే పూరీ స్క్వేర్ షేపు వస్తుంది. పొయ్యిమీద పెనముపెట్టి దానిమీద నెయ్యిరాచి ఈ మడచిన పూరీలను కాల్చాలి. సన్నసెగమీద కరకరలాడేలాగ కాల్చాలి. పూరీలను కాల్చినట్లుగా నూనె లేదా నేతిలో తేల్చితే పూరీ విడిపోయి కేసరి బయటకు వచ్చేస్తుందికాబట్టి, పెనంమీద దోసెను కాల్చినట్లు కాల్చాలి. దీన్నే మడతపూరీలంటారు. ఒక్కో పండుక్కు ఒక్కో హల్వా చొప్పున ప్రయత్నించండి.

★

బాదం హల్వా

కావలిసిన సామానులు: ¼ వీశె బాదం కాయలు, చక్కెర, 1 నేతిగిన్నెడు నెయ్యి, 1 అణా ఏలకులు, కుంకుమపువ్వు, కొంచెము పచ్చకర్పూరము.

చేయు విధానము: బాదంకాయలు కొడితే పప్పు వస్తుంది. బాదంపప్పుల్ని ఒక గిన్నెలో నీళ్లలో ఒక పావుగంటసేపు నాననిస్తే పై పొట్టు శుభ్రంగా వచ్చేస్తుంది. పొట్టు తీసిన పప్పుని రోట్లోవేసి కొంచెము బరకగా రుబ్బాలి. ఈ రుబ్బిన ముద్ద ఎంత ఉంటుందో చూసుకొని సుమారు అంత పంచదార తీసి పెట్టుకోవాలి. స్టైయిన్ లెస్ స్టీల్ గిన్నె పొయ్యిమీద పెట్టి అందులో ఈ రుబ్బిన ముద్ద, పంచదార వేసి గరిటతో త్రిప్పుతూ ఉండాలి. పంచదార కరిగి పాకం అయ్యాక ఈ పాకంలో బాదంముద్ద బాగా ఉడుకనివ్వాలి. ఉడుకుతుంటే బాదం సువాసన చక్కగా వస్తుంది. ఏలకులు పొడుం కొట్టుకొని సిద్ధంగా ఉంచుకోవాలి. బాదం ముద్ద ఉడికిన తర్వాత ఒక నేతిగిన్నెడు నెయ్యిపోసి కలియబెట్టి ఒక అయిదు నిమిషాలపాటు పొయ్యిమీద ఉంచాలి. నెయ్యి వేశాము గనుక హల్వా అడుగంటదు. అప్పుడు ఏలకుల పొడివేసి క్రిందికిదించి పచ్చకర్పూరము, కుంకుమపువ్వు రెండూ నలిపివేసి మరోసారి కలియబెట్టి మూతపెట్టి ఉంచాలి. ఒక అయిదు నిముషములుపోయాక మరో పాత్రలోకి తీసిపెట్టుకుంటే అడుగు అంటకుండా బాగుంటుంది. ఈ హల్వా స్పూనుతో తీసుకొని తినేందుకు వీలుగా ఉంటుంది. హల్వాకు రంగు కావాలనుకున్నవారు కొంచెం మిఠాయి రంగుకూడ వేసుకోవచ్చు.

ఆర్. సుశీలారాణి,
(కోవరం గుట్టపల్లి)

* * *

గులాబిపూల హల్వా

ఈ హల్వా చేయటం చాలా సులభం. చలవ చేస్తుంది. శరీరానికి చాలా మంచిది. ముందు పదిగులాబీలకొలతలు ఇస్తాను. బాగుండి కుదిరితే ఇంకా ఎక్కువ చేసుకొనవచ్చు. పాడవదు, పరికదా నెలలు నిల్వవుంటుంది.

పది గులాబీలు, అర్థ పావుశేరు చక్కెర, కొంచెంకుంకుమపువ్వు, యాలకుగింజలపొడి, అరకప్పు పాలు కావాలి.

ముందు గులాబీల రెక్కలు త్రుంచి విడిగా ఒక పళ్ళెములో నీడపట్టున రెండు రోజులు ఆరనివ్వాలి. ముట్టుకుంటె గలగల్లాడాలి. అరకప్పు పాలను వెడల్పు మూతిగల గిన్నెలో పోసి కాగనివ్వాలి. అవి బాగా మరుగుతున్నప్పుడు ఆరిన ఈ గులాబీరేకులు వేసి చెమ్చాతో బాగా కలపాలి. పాలు, రేకులువుడికి ముద్దగా అవుతుంది. అప్పుడు దించి, చల్లారనివ్వాలి; చక్కెర ముదురు పాకంపట్టాలి. పాకంరాగానే కుంకుమపువ్వు నలిపి వేయాలి. యాలకుగింజలపొడికూడా వేసి, చల్లారిన పాలు, గులాబీల ముద్దకూడా వేసి అంతా కలిసేలా బాగా కలపాలి. పాకంలో ఉడికి ఇది అంతా ముద్దగా అయి ఘుమ ఘుమ లాడుతుంది. అప్పుడు దించి, గాలివచ్చే ప్రదేశములో బెట్టి చల్లగా చల్లారనివ్వాలి.

వెడల్పు మూతిగల సీసాను శుభ్రంగా తుడిచి నీరులేకుండా కొద్దిసేపు ఆరబెట్టి, ఆనక చల్లారిన ఈగులాబీపూల హల్వా పెట్టి మూత గట్టిగా పెట్టవలెను. కొద్దిగ కొద్దిగ తిన్న తియ్యగా బాగావుంటుంది. మా హైదరాబాదు వైపు దీన్ని ఆకుల్లో వాడతారు. చాలా బావుంటుంది. మీరు కూడా ప్రయత్నించండి.

* * *

బ్రెడ్‌తో తీపి, కారం

తీపి

కావలసిన వస్తువులు: నాలుగు అణాల బ్రెడ్, అరకప్పు పాలు, అర్థపావు చక్కెర, రెండుతులముల సీమబాదంపప్పు, పిస్తా, జీడిమామిడిపప్పు, కప్పునెయ్యి.

ముందు బ్రెడ్డును అరచేయిఅంత ముక్కలు చేసుకోవాలి. బాణలిలో నెయ్యి వేసి, మరిగాక ఒక్కొక్క బ్రెడ్డుముక్కను వేసి గోధుమరంగు వచ్చేదాక వేయించాలి. అన్నీ అయాక విడి, విడిగా పెద్దపళ్లెంలో పేర్చాలి.

అరకప్పు పాలలో బాదంపప్పు, పిస్తా, జీడిమామిడి ముక్కలు ముక్కలుగా కొట్టి వేయాలి.

కొంచం సెగపై బాగా కాగనివ్వాలి. చిక్కగా కాగాక దింపి వుంచుకోవాలి.

అరకప్పు చక్కెరతో ముదురుపాకం పట్టి వుంచుకోవాలి. బ్రెడ్ ముక్కలు వున్న పళ్ళెం కొద్దిగ నిప్పులమీదపెట్టి, ప్రతి ముక్కమీద, రెండు టేబులు స్పూనుల పాలు పొయ్యాలి. తరువాత చక్కెర పాకం రెండు చెమ్చాలు పొయ్యాలి. ఈ విధంగా అన్ని ముక్కలమీద సమంగా, ముక్క అంతటా వచ్చేలా పోసి, ఒక అయిదు నిమిషాలు నిప్పులమీద వుంచి తీసివేయాలి. చల్లారేక తింటే, చాలా బావుంటుంది.

బ్రెడ్‌తో పకోడీలు

నాలుగుఅణాల బ్రెడ్, పావుశేరు శెనగపిండి, తగినంత వుప్పు, కారం, అల్లం, వెల్లుల్లిముద్ద, కొంచెం నూరిన కొబ్బరి ముద్ద. శెనగపిండిలో, కారం, వుప్పు, వెల్లుల్లి

(43-వ పేజీ చూడండి)

స్త్రీలు - ఉద్యోగాలు

టి. వి. శారద

రోజురోజుకీ ధర లెక్కువై జీవనప్రమాణం ఎక్కువైపోతున్న ఈ రోజుల్లో స్త్రీ కూడా ఉద్యోగంచేసి కుటుంబానికి ఆర్థికంగా సహాయ పడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయం ఈ నాడు బాగా గుర్తింపబడ్డది కూడా. అయితే స్త్రీ ఉద్యోగం చెయ్యడానికి అవసరానికి దగ్గట్టుగా అవకాశాలు ఉన్నాయా అన్నది ఆలోచించవలసి ఉంది.

ఆమధ్య నెహ్రూగారు ఏదో సభలో మాట్లాడుతూ ఒక దేశంయొక్క అభివృద్ధి ఆ దేశంలోని (1) స్త్రీల పరిస్థితిపైన (2) ఇనుము ఉక్కు పరిస్థితిపైన ఆధారపడి ఉంటుందన్నారు. మన ప్రస్తుత విషయం మొదటిది. జనాభా లెక్కలని పరిశీలిస్తే ఈ విషయంలో దేశం స్వతంత్రంవచ్చిన దగ్గిర్నించి చాలా అభివృద్ధి సాధించినట్టు కనబడుతుంది.

1951 జనాభా లెక్కలప్రకారం మన దేశంలో ఏభైలక్షలమంది స్త్రీలు స్వయం పోషకంగా ఉంటున్నారు. విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత్ కౌర్, పద్మజా నాయుడు, దుర్గాబాయి, లక్ష్మి మీనన్ మొదలగువారు అత్యున్నత పదవుల నాక్రమించి జాతీయ, అంతర్జాతీయ కీర్తి నార్జించేరు. 1954 లెక్కలప్రకారం ఫ్యాక్టరీలలో పని చేసే కూలీజనంలో 11.86% స్త్రీలని తేలింది. అయితే సూక్ష్మంగా ఆలోచిస్తే ఈ అభివృద్ధి గర్వకారణమే అయినా అంత చెప్పుకోదగినదిగా కనబడ్డం లేదు. ఎంచేతంటే పై చెప్పిన రెండు తరగతులకు చెందని మధ్యతరగతి స్త్రీల పరిస్థితి ఏమంత ప్రోత్సాహకరంగా లేదు.


ఇప్పటివరకు స్త్రీలకు ఉపాధ్యాయినీవృత్తి, వైద్యవృత్తి మాత్రమే తగినవిగా పరిగణింపబడుతున్నాయి. వాటి ప్రాముఖ్యం చాలా ఎక్కువే అయినా అందులో ఆసక్తి లేని వారికీ, అంతవరకు చదువుకోనేందుకు ఆర్థిక స్తోమతు లేనివారిని ఈ రెండును ఉపయోగపడవు. సెకండరీ స్కూలు విద్య మాత్రమే గల స్త్రీలకుగల ఉద్యోగావకాశములు బహు తక్కువ. కాని డిగ్రీలు పుచ్చుకొన్న వారికంటే వీరిసంఖ్య ఎక్కువ.

ఇప్పుడిప్పుడు టైపిస్టులగాను, క్లర్కులగాను, టెలిఫోను ఆపరేటర్లగాను పనిచేయుటకు స్త్రీలు సిద్ధపడుతున్నారు. కాని ఇటువంటిపనులకు పెద్ద పట్టణములలోనే ఎక్కువగా అవకాశాలుంటాయి. అయితే అటువంటి చోట్లగల జీవన వ్యయ ప్రమాణానికి (Cost of living) ఇటువంటి ఉద్యోగాలవల్ల వచ్చే కొద్ది జీతాలు చాలవు.


'నర్సింగ్'లో స్త్రీలకి బాగా అవకాశముంది. ఇది ఇంతవరకు మనదేశంలో స్త్రీలను అట్టే ఆకర్షించలేదు. రెండవ పంచవర్ష ప్రణాళిక లక్ష్యం ప్రకారం 31,000 నర్సులు, 32,000 మిడ్ వైవ్స (మంత్రసానులు) అవసరం ఉన్నారు. నర్సింగ్ వంటి ఉత్తమ సేవాకార్యం మరి ఒకటి లేనట్టు అనిపిస్తుంది. దీనివల్లనే కదా ఫ్లారెన్స్ నైటింగేల్ జీవితం సార్థకం చేసికొని శాశ్వతమైన కీర్తి నార్జించింది.

ఇంతేగాక జర్నలిజమ్, సెక్రెటేరియన్ షిప్, సోషల్ సర్వీసు మొదలైన వాటిలో కూడా స్త్రీలు ప్రవేశించాలి.

(56 వ పేజీ చూడండి)



రెక్కాడితే కాని డొక్కాడని వాళ్ళకి దురదృష్టవశాత్తూ, ఆ రెక్కలు రాలిపోతే వాళ్ళ గతి ఏమిటి? జీవితాంతం, యాతనపడవలసిందేనా? గట్టి సంకల్పం, ఉన్నంతలో పరిస్థితిని చక్కబెట్టుకోగల శక్తియుక్తులూ ఉంటే, దిగులుపడ నవసరం లేదనీ, అవస్థలు తప్పించుకో వచ్చుననీ అంగవైకల్యం సంప్రాప్తించిన అనేకులు నిరూపించారు. ఇలాంటి వారికి సహాయం చేయడంకోసం అంతర్జాతీయ సంఘం ఒకటి ఉంది. ఈ సంఘం సప్తమవార్షికసభ ఇటీవల లండన్ నగరంలో జరిగింది. కుంటివారికీ, గుడ్డివారికీ ఉపాధులు కల్పించి, వాళ్లూ ప్రయోజకులు కావడానికి తగు మార్గాలను వీరు ఆలోచించారు. ఈ చిత్రంలో చక్రాల కుర్చీ మీద కూర్చున్న ఆమె పేరు డాలియా డడ్జన్. ఒకప్పుడు ఈమె వృత్తి రంగస్థల నటన. హఠాత్తుగా, 24 వ ఏట ఆమెకు పక్షవాతంవచ్చి, కాళ్ళు పడిపోయాయి. డాలియా ఆ జబ్బునుండి కోలుకున్నాక, "ఇప్పుడేం చేయాలి" అన్న సమస్య ఎదురైంది. ఎంతో అసంభవం. అందుకని ఆమె ఫొటోగ్రఫీ నేర్చుకుంది. కొద్ది రోజుల్లోనే ఆ విద్యలో ప్రావీణ్యం సంపాదించి, పేరు తెచ్చుకుంది. ఇప్పుడు ఆవిడకు ఒక స్వంత స్టుడియో ఉంది. పెద్ద వ్యాపారం. అలా కుర్చీలో కూర్చుని, పనివాళ్లచేత లైట్లు అమర్పించి, ఫొటోలు తీస్తుంది. నవ్వుతూ కబుర్లు చెబుతూ వచ్చిన కొతాదార్ల అభిమానం సంపాదించుకుంది. ఒక వ్యాపార సంస్థకి ఫొటోలు తీయడంలో 'మోడల్ గా' నిలబడ వచ్చిన అమ్మాయిని ఇవతలవైపు చూడవచ్చును.



శ్రీమతి మతుకుమల్లి సుశీల గారి వ్యాసము — "భార్యలు - భర్తలు" — చదువుటకు చాల బాగుంది. నిజముగా ప్రతిగృహిణి తన నిత్యజీవితములో అనుసరించుటకు ఆమె వ్రాసిన అంశములన్నీ చాల సులభసాధ్యము. నేటిస్త్రీలు తమ కష్టసుఖాలను చెప్పుకొనడానికి ఉన్న వసతులలో చెప్పుకోదగినవి — పత్రికలు. ఇందువలన ప్రతిస్త్రీ ముందడుగువేసి తనతోటి స్త్రీని వుద్ధరించు ఉద్దేశ్యములో వుపదేశాల నిస్తున్నది. నిజము చెప్పవలెనంటే ఈనాడు మన మహిళలకు కావలసింది వుపదేశములనిచ్చు స్త్రీలుకాదు, వుపదేశములను ఆచరణలో పెట్టగలిగెడు ఆదర్శమహిళలు.

చివుకుల భారతి, మద్రాసు.

* * *

21-8-57 వనితాలోకంలో మతుకుమల్లి సుశీలగారు వ్రాసిన "భార్యలు - భర్తలు" అనే వ్యాసం రెండుసార్లు చదివినాను. వారితో నేను ఏకీభవిస్తున్నాను. వారికి నా ధన్యవాదాలు.

ప్రపంచంలో జరిగే విషయాలే, కళ్ళకు కట్టినట్లుగా వ్రాసినారు. ఇదివరకు మా ఇంటి ఎదురుగా ఒక కుటుంబం ఉండేది. వాళ్లు మొత్తము నలుగురు భార్యా, భర్త తండ్రి, తమ్ముడు. భార్య లేచేటప్పటికే 7 గంటలైయ్యేది. భర్తే కాఫీ చేసేవారు. ఆఫీసుకు పోయేటప్పటికి ఒక్కొక్క దినము వంటచేసేది. లేకపోతే అన్నంకూడ పూర్తిగా చేసేదికాదు భార్య. ఆ భర్తపాపం ఆరోజు ఏ హోటలులోనైనా భోజనం చేసేవాడు. ఆమెను ఎప్పుడైనా ఇంత లేటుగా చేస్తే ఎట్లా అని కేకలేస్తే, నాచేత కాదని మొండిగా జవాబు చెప్పేది. వాళ్ళు గట్టిగా పోట్లాడుతుండేవారు. ఇండ్లు దగ్గరగా వుండటంవల్ల వాళ్ళపోట్లాటలు మాకు బాగా వినిపించేవి. ఇట్లు జరిగే సంసారాల్ని చూస్తే మనకంతో జాలివేస్తుంది. కాని, వారినివీమన్నా ఇలాగెందుకు చేస్తారా అని అడిగామా? మన ముఖానే అనేస్తారు మా ఇంటిసంగతి మీకెందుకని?

ఇటువంటి వ్యాసాలు చదివినప్పుడన్నా వాళ్ళలో మార్పు వస్తుందని ఆశిస్తున్నాను.

వి. అహల్యాదేవి, బళ్ళారి.

* * *

మతుకుమల్లి సుశీలగారు వ్రాసిన "భార్యలు-భర్తలు" వ్యాసం చాలా బాగుంది. ఆమె వ్రాసినట్లు ఆడవారు బజారువెళ్ళడం కొన్ని పరిస్థితుల్లో విలువదేమో. (ఇరుగు, పొరుగును బట్టి) మాదూరపుబంధువు ఒకామె వుంది. ఆమె భర్తకి తీరదని, బజారుపని, పిల్లలను స్కూల్లో జాయిన్ చెయ్యటం లాంటి పనులన్నీ ఆమె చూచుకునేది. అందుకని వాళ్ళ ఇరుగు, పొరుగువాళ్ళు ఆజంటని గయ్యాళి భార్య, అమాయకపుభర్త క్రింద జమకట్టారు. మొగుణ్ణి చెవులుపట్టుకుని ఆడిస్తుందని, ఇష్టమొచ్చినట్లు రోడ్లవెంబడి తిరుగుతుందని, ఏమేమో అనేవారు. వాళ్ళు కేర్ చేసేవాళ్లు కాదు. ఎప్పుడైనా ఆ సంభాషణ వస్తే "కొన్నాళ్ళల్లాగే అనీ,అనీ నోరు నొప్పడితే వాళ్ళే మానేస్తారు. మనమెందుకమ్మా బాధపడడం" అనేవాళ్లు.

ఇదివరకటికీ, ఇప్పటికీ ఈ భార్యాభర్తల్లో ఒక సుగుణం కన్పిస్తున్నది. పూర్వం భర్త ఏదైనా పొరపాటు (తప్పు) చేస్తే భార్యపొరపాట్న అలా కాదు ఇలా అది పొరపాటు (తప్పు) అని చెప్పిందో, ఆమె వీపు శుద్ధి అయ్యేది. అందరిసంగతీ కాదనుకొండి. కొందరి సంగతే.

అమ్మలక్కలమాటలు నమ్మి, ఒకరినొకరు, అనుమానించుకొని లేనిపోని అనర్థాలు కల్పించుకునే భార్యాభర్తలులేకపోలేదు. అందుకే ఒకరిమాటలు వినేప్పుడు ఇది నమ్మదగిందా, కాదా, ఆమె లేక ఆయన అలాచేసేరకమే? అలా చెప్పేవాళ్ళెవా, అని యోచించి మసలాలి. అంతేకాని గుడ్డెద్దు చేలోబడ్డట్లు అన్నీనమ్మి, నమ్మిందే మనస్సులో పెట్టుకొని ప్రతి చిన్న విషయానికీ, ఆయన్నావిడా, ఆవిడని ఆయనా విసుక్కుంటూంటే ఆ కుటుంబం ఎల్లావుండాలో అల్లావుంటుంది.

ఇంతకీ భార్యా-భర్తా ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఏగొడవా వుండదు. ఎటొచ్చీ ఒకళ్ళనొకళ్లు అర్థంచేసుకోని భార్యాభర్తలకే, వాళ్ళని చూస్తున్న ఇరుగు, పొరుగులకే అనర్థాలన్నీను. సుశీలగారు ఇంత చక్కని వ్యాసం వ్రాసి మనకందించినందుకు పతితల తరఫున అభినందనలు.

పి. ఆర్. లక్ష్మి, (గుంటూరు).

* * *

ఈమధ్య "ఆంధ్ర వారపత్రిక"లో వనితావాణి అను శీర్షికలో శ్రీమతి సరోజినిగారు వ్రాసిన "ఆడపిల్లల పెళ్ళిళ్ళు-తలిదండ్రుల అగచాట్లు" అను వ్యాసమును చదివి అమితానందించితిని. ఆమెగారికి నా కృతజ్ఞత. కాని ఆడవారు చదువుచుండుట చూచి మగవారికన్న ముఖ్యంగా ఆడవారికే అసూయ కలుగుచుండును. ఈ అసూయ అను జబ్బు ఎంత తొందరగా పోవునో ఆడవారిలో అంత తొందరగా ఎక్కువ విద్యావంతులగుదురు. "ఎదిగిన పిల్లలకెందుకమ్మా ఇంకా చదువు, చక్కగా ఇంటిపనులు చూచుకుంటే చాలు" అను అమ్మలక్కల మాటలువిని చాలమంది తలిదండ్రులు ఆడపిల్లలకు చదువు చెప్పించుట మానుదురు. వారి మాటలను లెక్కచేయనినాడే మనం బాగుపడేది.

జి. కృష్ణమూర్తి, గద్వాల.

* * *

మతుకుమల్లి సుశీలగారు "భార్యలు-భర్తలు" వ్యాసం చాలచక్కగా వ్రాశారు. స్త్రీజాతిలోని లోపములను నిష్పక్షికంగా తెల్పినందుకు నా ధన్యవాదాలు.

పాలపర్తి వెంకటసుబ్బారావు,
(విజయనగరం).

* * *

ఈ వారం వనితాలోకం శీర్షిక క్రింద పి. అనసూయగారు వ్రాసిన బెంగుళూరి పూరీ తయారుచేయటము ఎలాగో చదివాను. వెంటనే అది చేసి చూచాను. చాలా బాగా కుదిరినవి. వారికి నా అభినందనలు తెలియచేయాలనిపించింది. కనుక పత్రికద్వారా అనసూయగారికి నా అభినందనలు తెలుపుచున్నాను.

పొట్టూరి సరోజ, (గుంటూరు).

* * *


చూడండి! సన్‌లైట్
సగంబిళ్ల మాత్రమే ఈ
బట్టలన్నిటిని ఉతికింది!
అట్లు చేయునట్టిది ఆ
అధికమైన నురగ!
SUNLIGHT SOAP
సన్ లైట్
సబ్బు
బట్టలను తెల్లగాను, కాంతివంతముగాను ఉతుకును!
S. 249-X52 TL

21-8-57 ఆంధ్రపత్రికలో వనితాలోకంలో గృహవైద్యంలో బి. ప్రేమలీలగారు వ్రాసిన గులాబిపువ్వులమందు చదివాను. ఏమండీ! గులాబి పువ్వులు సుకుమారుగా ఎన్ని వానవెయ్యవచ్చు? ఆ తేనె మరల వనికి వస్తుందా? ఇట్లా ఎన్ని రోజులు తాగాలి? ఇంకా ఈ వైద్యములో వివరాలేమైన ఉంటే తెలియపరుస్తారని ఆశిస్తున్నాను.

జి. సత్యవతి (విజయవాడ)

* * *

21-8-57 పత్రికలోని 'వనితాలోకంలో' మతుకుమల్లి సుశీలగారు రాసిన 'భార్యలు భర్తలు' అనే 'వ్యాసం చాలా బాగుంది. ఈ రోజుల్లో చాలామంది స్త్రీలు తమ తమ సంసార విషయంలో స్వయంగా అన్నీ చూసుకొంటున్నారు. అయినప్పటికీ కొంతమంది ఆమె రాసినట్లుగా పురుషులను శ్రమ పెడుతున్నారు. అటువంటివారు ఈవ్యాసం చదివాక అన్నా తమ పద్ధతులను మార్చుకొని ఆదర్శ గృహిణులుగా మారుతారని ఆశిస్తున్నాను.

పెద్ద పెద్ద వ్యాసాలు రాయలేనప్పటికీ తమ ఉద్దేశాలను వ్యక్తపరిచేందుకుగాను, తమ పత్రికలో ప్రత్యేకముగా 'వనితావాణి' అని ప్రచురిస్తున్నందుకు మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

జె. ఆర్. మణి [మద్రాసు]

* * *

ఈవారం (21-8-57) వనితాలోకం శీర్షికలోని "భార్యలు-భర్తలు" అను వ్యాసం చాల బావుంది. శ్రీమతి మతుకుమల్లి సుశీల గారు ఈవ్యాసం స్త్రీపురుష పక్షపాతల లేకుండా వ్రాశారు. నవీనకాలంలో యిటువంటి "భార్యలు" (కొంతమంది) లేరనడానికి వీలులేదు. మామిత్రుడొకడున్నాడు. అతనికి జీతం తీసికొన్న మరునాటికి సినిమాకి వెళ్దామంటే శ్రీమతిగారి వద్దకు వెళ్ళాలి. ఏమిట్రా సంగతి?" అంటే "స్త్రీ పురుషులకు సమాన హక్కులోయ్ అన్నాడు. ఇది సమాన హక్కులా అవుతుంది. ఆవిడ కోరేది అధిక్యత. ఇలాంటి సోదరీ(మణులు) అక్కడక్కడ కొందరు ప్రకాశిస్తున్నారు. అటువంటి వారికి ఈవ్యాసం కొద్దిగా పరిణామం తేగలుగుతుందని ఆశించుతూ ఆవ్యాస రచయిత్రికి నా అభివందనములు తెలుపుతున్నాను.

బి. ఆర్. కృష్ణన్ [వాయల్పాడు]

★

(36-వ పేజీ తరువాయి)

రెండు పుచ్చుకు, పెద్దమనుషులుగా (పేరుకు) చలామణీ అవుతూ ఎవరికైనా ఏ విషయంలోనైనా సరే అడిగిందే తడవు అరగంట ఆపకుండా లెక్చరివ్వగల మేధావంతులే అలాటిపని చేస్తారంటే ఎంత అన్యాయమైన విషయమో ఆలోచించండి.

భాష తెలీకపోతే...

జాబుల్లో ఎవరుమాత్రం ఏం రాసుకుంటారు? పోనీ ఏదైనా కష్టసుఖాలు ఆప్తులకు రాసుకుంటారే అనుకుందాం. అది చదవకపోతే వచ్చే నష్టమేముంది? ఫ్రీగా వాళ్ళవుద్దేశ్యాలు ఉత్తరాల్లోనైనా ఇతరులకు చెప్పుకునే స్వతంత్రం రాసేవాళ్ళకు లేదూ? ఇప్పుడెందుకో మా వాళ్ళమ్మాయి సంగతి జ్ఞాపకం వస్తోంది. ఆవిడ పాపం అలా "ఎవరో" తన జాబులు చదువుతున్నారని ఇంగ్లీషులోగాని, హిందీలోగాని రాయటం మొదలెట్టిందట. అలా రాసినా కనీసం ఆ రెండు భాషలూ తెలిసిన వాళ్ళ దగ్గరికైనా వెళ్ళి ఓపిగ్గా అర్థం చెప్పించుకు మరీ పోస్టుకు పంపేవారట ఇంట్లో వారు.

కథలో గాడిద కాబట్టి—

కొందరు భర్తలుగూడా, భార్యలు జాబులురాస్తే అనుమానపడుతుంటారు. అలాంటి వారిని చాలమందిని నేను చూచాను. భార్యరాసే ప్రతిజాబూ భార్య ఏమన్నా అనుకుంటుందేమోనని అక్కడ చదవకున్నా, మనస్సుండబట్టక చదివికాని పోస్టులో వెయ్యరు ఆ "భర్తలు." అలాగే ఎవరి దగ్గర్నుంచైనా కనీసం పుట్టింటినుంచైనాసరే తోబుట్టువులెవరైనా ఆవిడకు రాస్తే ఏం దుర్బోధలు రాసిపంపారో (తమ మనస్సు అలాటిది కాబట్టే)నన్న అనుమానంతో ఉండబట్టలేక చదివి మరీ ఇస్తుంటారు. ఇలాటి విషయాలు తెలియని, చూడని వాళ్ళకు కొత్త వింతగా వుండొచ్చు. ఓ కథకూడా వుంది చిన్నది. ఎవరో ఒకడు పాపం స్నేహితుడికి జాబు రాసుకుంటున్నాడట. వెనగుండా ఓ పెద్ద మనిషి ఆ జాబును చదువుతున్నాట్ట. ఈ రాసే అతనికి అది తెలిసి ఆ జాబులోవెంటనే ఇలా వ్రాశాడుట. "అడ్డగాడిద ఒకడు నా వెనకాలేచేరి ఈజాబంతా చదువుతున్నందువల్ల ఇంతకంటే ఎక్కువ రాయలేకపోతున్నాను" అంటూ; ఇంకేముందీ ఆవెనక వుండే "అడ్డగాడిద"కు పట్టరాని పరాభవంకలిగి వుడాయించాడుట. అల్లాగే ఈ వుత్తరాల దొంగకు అగుణం పొయ్యే వుపాయమేదో! అయితే కథలో "గాడిద" కాబట్టి అంత త్వరగా సిగ్గుపడి బుద్ధితెచ్చుకు వదిలాడు కాని వాస్తవిక జగత్తులోని వాళ్లు అలా వదలనే వదలరు. ఏది ఎటొచ్చినా ఈ వుత్తరాల దొంగలుంటే మహా కష్టమే! ఒకవేళ ఇలా రాశానని భుజాలు తడుముకున్నా మళ్లీ అంతలోనే సర్దుకుంటారే కాని అగుణం మానరు. ఎలా మానుతారు? పుట్టుకతో వచ్చిన జాడ్యం పుడకలతో గాని పోదు. పైగా అలాటివాళ్ల పద్ధతుల్ని ఇలాటి వ్యాసాలూ, వుపన్యాసాలు మారిస్తే ఇంకేం, మంత్రాలకు చింతకాయలు తపీ తపీమని రాల్తాయి భూమ్మీద. ఈ ఉత్తరాలు దొంగతనంగా చదవటమనేది మహా చెడ్డపని అని చెప్పడం మాత్రం మనవంతు. ఇక పద్ధతిమార్చుకోడం "వాళ్ల" వంతు. ఏమంటారు? ★

బ్రెడ్‌తో పకోడీలు

(39-వ పేజీ తరువాయి)

ముద్ద కొబ్బరిముద్ద వేసి, పకోడీల పిండిమాదిరి గట్టిగా కలపాలి. బ్రెడ్‌ను చిన్న చిన్న ముక్కలుగాచేసి ఈ ముద్దలో వేసెయ్యాలి.

పొయ్యిమీద బాణలిపెట్టి, నూనెగాని, నెయ్యిగాని పోసి, మరిగాక, చేతితో బ్రెడ్‌ముక్కల అంతటా శెనగపిండి అంటేలా, చేతితో పకోడీల మాదిరి బాణలిలో వేసి, వేయించాలి. వేగాక తీసి, తింటే చాలారుచిగా వుంటాయి. ★


స్త్రీలు - ఉద్యోగాలు

(40-వ పేజీ తరువాయి)

చైనా దేశంలో అతి స్వల్పకాలంలోనే స్త్రీలు వ్యవసాయం! ఇంజనీరింగులలో చెప్పుకోతగినంత మంది పనిచేస్తూ గొప్ప అభివృద్ధిని సాధించేరు. ఈ విషయంలో భారతీయ మహిళలు వారి పొరుగుదేశపు సోదరీమణుల ఆదర్శాన్ని అనుకరించాలి.

బెంగాల్‌లోవలె మన ప్రాంతాల్లోకూడా తోలుపని, ఊలుపని, కుట్టుపని మొదలగు గృహపరిశ్రమలని ప్రోత్సహించాలి.

ఉద్యోగాలు తగినన్ని లేక పోవడమే కాకుండా స్త్రీలు ఉద్యోగం చెయ్యడం మర్యాదకి భంగకరమని చాలా కుటుంబాల్లో ఉన్న అభిప్రాయం కూడా నేటి మన ఆర్థిక క్లిష్ట పరిస్థితికి చాలావరకు కారణం. ఇటువంటి అభిప్రాయాలకి స్వస్తి చెప్పినప్పుడే దేశం ఆర్థికంగా అభివృద్ధిని సాధించగలదు. ★



మా హైదరాబాదు

ఈనాటిదే కాదు
మా హైదరాబాదు!

కలకాలముననుండి
విలసిల్లు రమ్యమా
కల లన్నిటికి పాదు
మా హైదరాబాదు.

అజంతా, ఎల్లోర
అందాల శిల్పకళ
అద్భుతమ్ముగ నాడు
ఉద్భవించెనుచూడు.

'చారుమీనా'రనగ
చాలమారులు 'తాత'
చెప్పలేదా? నాటి
మెప్పైన కథయందు.

వేయి స్తంభములతో
వెలసిన మహాలయము,
హనుమకొండయు నీకు
కనుపించునయ్యా.

'గోలకొండ' కోట
నేల చూడగ రావు
రామదాసునిపాట
రావేల వినవీవు?

మూసీ నదినిగాంచి,
ముసిముసిగ నవ్వులను
వినరంగ లేవటే,
వేదనల మైమరచి?

హుస్సేను సాగరము
ఒడ్డుపై కూర్చుండ
తానమాడను యొడలు
త్వరపెట్టుచుండదా?

సాలారు జంగుని
కళానికేతనము
కల్లార చూడవలె
కన్పించు వింత భలె

ఈనాటిదేకాదు
మా హైదరాబాదు!

గందం జోయెల్



శ్వశ్రుతుడను రైతు పొలములో గోధుమపంట వేశాడు. ఆసంవత్సరము సకాలంలో వర్షములు కురిశాయి. పంట ఏపుగా పెరిగింది. సమయము రాగానే, రైతు పంట అంతా కోసి గాదెలలో నింపి, ఒక సంవత్సరంపాటు చీకు చింతలు లేకుండా బ్రతుకవచ్చునని సంతోషించాడు.

నండూరి విఠల్ బాబు

శ్వశ్రుతుని యింటిలో ఒకఎలుక, ఒక పిచ్చుక మిక్కిలి సఖ్యముతో నివసిస్తూ ఉన్నాయి. ప్రతిదినము ఎలుకతో కలసి పిచ్చుక ధాన్యపు గాదులలో ప్రవేశించి కడుపునిండా మెక్కుతూ ఉంది. అలా రోజునకు అయిదు పర్యాయాలు అవి గోధుమలు తింటూ, ప్రొద్దు గుంకగనే ఎలుక తన బొరియలోనికి, పిచ్చుక తన గూటిలోనికి పోతూ ఉండేవి.

ఆ రైతు గాదెలలోని ధాన్యమును చెరిసగము తినవలెనని అవి ఒప్పందము చేసుకొన్నాయి. ఒప్పందం ప్రకారము అత్యంత మైత్రితో ఆ రెండూ కాలము గడుపుతున్నాయి. కొన్ని రోజులలో గాదెలలోని ధాన్యము చాలావరకు ఖర్చయిపోయింది. అది చూచి ఎలుక, మిగిలిన ధాన్యమంతా దొంగిలించాలని నిశ్చయించుకుంది. ఒకనాటిరాత్రి, పిచ్చుకకు తెలియకుండా ఎలుక గాదెలలో మిగిలిన ధాన్యమంతా దొంగిలించి తన బొరియను నింపుకొంది.

తెల్లవారగనే, ఆకలితో పిచ్చుక భోజనము చేయుటకై బయలుదేరి ఎలుకను రమ్మని పిలిచింది. ఎలుక కడుపునొప్పిగా యుండుటచే తాను భోజనము చేయనంది. పిచ్చుక గాదెలలో వ్రాలింది. అందులో ఒక్కగింజా లేదు. ఆకలితో బిక్కమొగము వేసుకొని తన గూటికిచేరి ఇట్లా ఆలోచించింది:

"నమ్మించి నన్ను ఎలుకమోసము చేసింది. ఇప్పుడే జంతువుల రాజైన సింహము దగ్గరకు పోయి ఫిర్యాదు చేసి-దీనికి బుద్ధి చెప్పిస్తాను."

ఆ మరునాడు పిచ్చుక సింహము దగ్గరకు పోయి తనకు జరిగిన అన్యాయమును ఆ మృగరాజునకు ఈ విధంగా ఎరిగించింది:

"మృగరాజా! మీ పాలనకు చెందిన ఎలుక ఒకటి నాతో చిరకాలమునుండి స్నేహంగా నివసిస్తూంది. మా యింటి యజమాని గాదెలలోని ధాన్యమును ఇరువురము కలసి భుజింపవలెనని మొదట ఒప్పందము చేసుకొన్నాము. మొన్నటివరకు ఇరువుర మల్లే సంచరించాము. కాని చివరకు ధాన్యము అయిపోయే సమయమున ఎలుక నన్ను మోసగించి, మిగిలిన ధాన్యమంతా ఒకనాటిరాత్రి దొంగిలించి తనబొరియలో పోసుకొన్నది. నేను ఆకలిచే మలమల మాడవలసి వచ్చింది. కావున ఏలినవారు చిత్తగించి, నన్ను మోసగించిన ఎలుకను శిక్షించి, నాకు న్యాయము చేయ వేడుతున్నాను."

పిచ్చుక చేసిన ఫిర్యాదు విని సింహాము నవ్వి "ఓ పిచ్చుకా! నీవు చెప్పిన నేరము ఎలుక చేసినదనుటకు సాక్ష్యములు లేవుగదా? మీ పక్షులెన్నో మా జంతువులను అనేక పర్యాయాలు మోసగించాయి. మీ పక్షులను నమ్మటకంటే తెలివితక్కువ మరొకటి లేదు" అని, హేళన చేసింది.

పిచ్చుకచేసేది లేక బిక్కమొగముతో తిరిగివచ్చి, తమ పక్షులన్నింటికి రాజైన గండుగ్రద్ద దగ్గరకు పోయి తనకు జరిగిన అన్యాయమును గూర్చి మొరపెట్టుకొంది.

గండుగ్రద్ద తన పక్షిజాతిని గురించి సింహాము పలికిన దూషణ భాషణాలు విని కడు క్రోధముతో సింహానికిలా సందేశము పంపింది.

"మీ జంతుజాతి ఎక్కువో మా పక్షిజాతి యెక్కువో తేల్చుకొనవలసిన సమయము ఆసన్నమైంది. కావున ఫలానరోజున, ఫలాన సమయానికి, ఫలానచోట నీ పరివారముతో యుద్ధమునకు రావలసింది. నా పరివారముతో నేను కూడ వస్తాను. బలాబలములను తేల్చుకొందాము."

గండుగ్రద్ద పంపిన కబురు విని సింహాము తోకత్రొక్కిన త్రాచువలె లేచి సమరగర్జన చేసింది. క్షణంలో అడవిలోని జంతువు లన్నీ రణమునకు సిద్ధమయ్యాయి. చిరుతపులులు, ఎలుగుబంట్లు, ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱములు, అన్ని రకముల జంతువులు బారులుతీర్చి యుద్ధభూమికి చేరుకున్నాయి.

గండుగ్రద్ద కూడా కొన్నిలక్షల గ్రద్దలను, కాకులను, గుడ్లగూబలను సేనయందు కూర్చుకొని ఆకాశమంతా క్రమ్ముకొని యుద్ధభూమికి చేరుకుంది. యుద్ధము ప్రారంభమైంది. మూడు గంటల, మూడు నిముషములు యుద్ధము జరిగింది. నెత్తురు ఏరులై పారింది. ఆ ప్రదేశమంతా వేలాది మృతకళేబరముల కుప్పలతో నిండిపోయింది.

మిక్కిలి కష్టముతో చివరకు పక్షులకే విజయం కలిగింది. గండుగ్రద్ద తనతోటి పక్షులను తమతమ గూళ్ళకు పొండనిచెప్పి-తాను అరణ్యము లోపలకు చొచ్చుకొనిపోయి ఒక మఱ్ఱిచెట్టుపై వ్రాలింది.

గండు గ్రద్ద ఒడలంతా గాయములతో నిండిపోయింది. దాని జవసత్వములు నశించాయి. ఆ మహావృక్షముపై ఒకమూల ఒదిగి ఉండి, పోయిన బలమును తిరిగి సంపాదించుటకు మార్గమేమా అని ఆలోచించసాగింది.

ఒకనాటి రాత్రి, ఆ అరణ్యానికి దగ్గరలో గల పట్టణములో నివసిస్తూన్న ఒక వర్తకుడు ఒక గండుగ్రద్దవచ్చి తన భార్యను కాళ్ళతో తన్నుకొని పోతున్నట్లు కలగన్నాడు. తెల్లవారగనే ఆ పీడకలను గురించి భార్యకు చెప్పాడు.

ఆ వర్తకునిభార్య చిరునవ్వు నవ్వి, "నాథా! మన కనేక స్వప్నములు వస్తూ ఉంటాయి. అవన్నీ జరిగితీరతాయనే నిశ్చయ మెక్కడున్నది? ఆశ - అనుమానము - అసూయ అనే ఈమూడూ మానవ జీవితాన్ని దుఃఖభాజనముగా చేస్తూ ఉంటాయి. కావున మీరు నిశ్చింతగా, ఆ దుస్వప్నము సంగతి మరచిపొండి" అని చెప్పింది.

కాని వర్తకునకు అనుమానము పెనుభూతమువలె పీడించసాగింది. దేశదేశముల గాలించి ప్రపంచములో కెల్ల సౌందర్యవతిని అతడు వివాహము చేసుకున్నాడు. నాటినుండి ఆమెను ప్రాణసమానముగా ఆరాధిస్తున్నాడు. ప్రాణాధికమైన ప్రేయసికి వాటిల్లు ప్రమాదం తలచుకొనగానే ఆ వర్తకుని హృదయమున సంక్షోభము కలిగింది.

చివరకు ధనుర్బాణాలు ధరించి తనకు స్వప్నములో కనిపించిన గ్రద్దను అన్వేషించుటకై అడవిలోనికి బయలుదేరాడు.

అడవిలో వర్తకుడు వెదుకగా, వెదుకగా ఒక మఱ్ఱిచెట్టుపై, వంటి

నిండా గాయములతో కదల శక్తి లేక పడియున్న పక్షిరాజు గండు గ్రద్ద కనిపించింది. తనకు స్వప్నములో కనిపించిన దదే కనుక వర్తకుడు దానిని చంపుటకు నిశ్చయించుకొన్నాడు. విల్లెక్కుపెట్టి బాణము వదలుటకు సిద్ధముగా నున్న వర్తకుని జూచి గ్రద్ద "ఓ వర్తకుడా! నన్ను చంపబోకు. నిస్సహాయులను, ఆయుధము లేనివారిని - పారిపోవు వారిని, దీనులను చంపుట ధర్మ విరుద్ధమని ఎరుగవా? నన్ను చంపక ప్రాణములు రక్షించినచో నీకు గొప్ప సహాయము చేస్తాను" అని ప్రార్థించింది.

వర్తకుడు 'ఈ గ్రద్ద చేయు సాయ మేమున్న'దని భావించి మరల విల్లు నెక్కుపెట్టాడు.

మరల గ్రద్ద జాలిగొల్పు స్వరముతో "ఓ వర్తకుడా! నన్ను చంపినచో నీకు లభించు లాభ మేమున్నది? నన్ను రక్షించి ఇంటికి తీసుకుపోయి మూడు సంవత్సరముల మూడు నెలల మూడు రోజులు పోషించు. నా మునుపటి శక్తి నాకు లభించగానే, నీకు గొప్ప సహాయము చేస్తాను" అని చెప్పింది.

వర్తకుడు మరల ఆలోచించాడు. ఏమైనా గ్రద్దను ప్రాణములతో వదిలిపెట్టుట క్షేమము కాదని భావించి మరల విల్లు నెక్కుపెట్టాడు. మరల గ్రద్ద "ఓ వర్తకుడా? నన్ను నిష్కారణముగ చంపబోకు, నా మాటనమ్ము. నన్ను మూడు సంవత్సరముల, మూడు నెలల, మూడు రోజులు పోషించు. నా మునుపటి జవసత్వములు రాగానే, నీకు గొప్ప సహాయము చేస్తాను" అని నమ్మకముగా పలికింది.

వర్తకునకు కొంత నమ్మకము కలిగి విల్లు దించివేశాడు. గండు గ్రద్దను యింటికి తీసుకొనిపోయి గాయములకు కట్లుకట్టి - చికిత్స చేయించాడు.

రెండు మేకలను కూర వండించి గ్రద్ద ముందుంచాడు. గ్రద్ద ఆ కూరనంతా భుజించింది. ఇట్లు పూటకు రెండు మేకలు గ్రద్దకు ఆహారముగా వర్తకుడు కొంటున్నాడు. అతని దగ్గరగల డబ్బంతా ఖర్చయిపోయింది. ఒకనాడు వర్తకుడు విచారముగా నుండగా గండు గ్రద్ద "మిత్రమా! నీ విచారకారణము గ్రహించాను. నేను చెప్పినట్లు చెయ్యి. నీకు కావలసినంత ధనము లభిస్తుంది. అరణ్యమునకు ఉత్తరమునగల మైదానములో మా పక్షిజాతికి, మృగములజాతికి యుద్ధము జరిగింది. అందు లక్షలాది జంతువులు మరణించాయి. నీవుపోయి ఆ జంతువుల చర్మములను బాగు చేసి, సంతకు గొనిపోయి విక్రయించుము," అని చెప్పింది.

వర్తకుడు గండు గ్రద్ద చెప్పిన విధముగా చర్మము లన్నియు పదును చేయించి సంతలో అమ్మాడు. అతనికి బోలెడు ధనము వచ్చి భాగ్యవంతుడైనాడు. గండు గ్రద్దను మాత్రము మిక్కిలి ప్రేమతో చూస్తూన్నాడు.

ఒకసంవత్సరముగడచిపోయింది. ఒకరోజున గండుగ్రద్ద వర్తకునితో తనను అరణ్యములో ఎత్తయిన మర్రిచెట్లు పెరుగు ప్రదేశమునకు తీసుకొని పొమ్మంది. ఆ వర్తకుడు గుర్రమునకు బండికట్టి-అందులో గండు గ్రద్దను కూర్చుండబెట్టి మర్రిచెట్లుగల అరణ్యప్రదేశమునకు తెచ్చాడు.

గండుగ్రద్ద రెక్కలు విప్పుకొని ఆకాశములో మబ్బులను దాటి ఎంతో ఎత్తున కెగిరి ఒక్క విసురున వచ్చి మర్రిచెట్టునకు గ్రుద్దుకొన్నది. చెట్టు రెండుగా చీలి క్రింద పడింది.

"వర్తకుడా! మునుపటి బలము నాకు తిరిగి రాలేదు. మరొక సంవత్సరము నన్ను పోషించు" అన్నది.

రెండవ సంవత్సరము గడచిపోయింది. మరల గండుగ్రద్ద నల్ల మబ్బులకంటె ఎత్తున కెగిరి మర్రిచెట్టునకు గ్రుద్దుకొన్నది. మర్రిచెట్టు రెండుగా చీలి నేలపై బడింది. గండుగ్రద్ద "వర్తకుడా! మునుపటి బల మింకా నాకు రాలేదు. మరొక్క సంవత్సరము పోషించు" అన్నది.

మూడుసంవత్సరముల, మూడు నెలల, మూడు రోజులు గడచిపోయాయి. వర్తకునితో గండుగ్రద్ద

అరణ్యమునకు వచ్చి ఆకాశములోనికెగిరి వేగముగా అన్నిటికంటే ఎక్కిలి పెద్దదయిన మర్రిచెట్టును గుద్దింది. ఆ ఊపునకు అరణ్యమంతా కంపించింది. మర్రిచెట్టు తునాతునకలై ఆ తునకలు గాలిలో ఎగిరిపోయాయి. అపుడు గండుగ్రద్ద వర్తకునితో "ఓ మిత్రుడా! నా పోయిన బలము తిరిగి వచ్చినది. నీ గుఱ్ఱపుబండితో సహా నావీపుపై ఎక్కు. క్షణములో నిన్ను మా యింటికి తీసుకుపోయి గొప్ప బహుమతు లిస్తాను" అన్నది.

వర్తకుడు గుఱ్ఱపుబండితో సహా గండుగ్రద్దపై కెక్కాడు. నీలాకాశములో మబ్బులనుదాటి గండుగ్రద్ద ఎగురుతున్నది. అడవులను, కొండలను నదీనదములను దాటి సముద్రముపై పోతోంది.

గండుగ్రద్ద వర్తకునితో "మిత్రుడా! క్రింద సముద్రము చూడు" అన్నది. వర్తకుడు క్రిందకు చూస్తుండగా గండుగ్రద్ద ఒక్క విదిలింపుతో వర్తకుని క్రిందకు విసరివైచింది.

పాపము! వర్తకుడు సముద్రములో పడిపోతున్నాడు. కాని సముద్రములో పడకపూర్వమే గండుగ్రద్ద అతనిని పట్టుకొని తిరిగి వీపుమీద నెక్కించుకొంది.

మళ్ళీ గండుగ్రద్ద "మిత్రమా! క్రింద సముద్రములో ఎన్ని మొసళ్లున్నవో చూచావా?" అన్నది. వర్తకుడు తలవంచి చూస్తుండగా అది మరల నాతని సముద్రములోనికి నెట్టివైచింది. అతడు సముద్రములో పడకముందే మరల పట్టుకొని, వీపుపై నెక్కించుకొని, యింకను ఎత్తున కెగిరింది.

గండుగ్రద్ద వర్తకునితో "మిత్రమా! క్రింద సముద్రములో చూడు. తిమింగిలము లెన్ని గుంపులుగా ఉన్నవో" అన్నది. వర్తకుడు క్రిందికి చూస్తుండగా క్రిందికి విసరివైచి తిరిగి ముక్కునకు కరచుకొని వీపుపై నెక్కించుకొని యిట్లన్నది.

"మిత్రమా! మృత్యుభయ మెట్టిదో ఇప్పుడు నీకు తెలిసినదా?"

"ఔను. నేనసలు బ్రతుకుతాననుకొనలేదు" అని వర్తకుడు ప్రత్యుత్తర మిచ్చాడు.

"నీవు ఆనాడు నాపై విల్లు మూడు సార్లు ఎక్కు పెట్టినపుడు - నేను కూడా ఇట్టి బాధనే అనుభవించాను" అని చెప్పి గండు గ్రద్ద ఇంకా ఎత్తునకు ఎగిరిపోయింది.

అది మూడు గంటల మూడు నిముషముల మూడు క్షణములు ప్రయాణముచేయగా చివరకు వారు "తామ్రరాజ్యము" చేరారు.

(ఇంకా ఉంది) ★

సినిమా

★ చలనచిత్రకథలు ★

"ఎంతో సాధకబాధకాలు ఉన్నా, కొత్తనటుల్ని తీసుకోవడంవల్ల సినిమాలలో కథలు కొంత మెరుగవడానికి వీలుంటుంది" అని దర్శక నిర్మాత బిమల్ రాయ్ ఇటీవల ఒక సందర్భంలో అన్నారు.

కొత్తనటుల్ని తీసుకున్నట్లయితే, కథను కట్టుదిట్టంగా అల్లడంలో, అందుకు తగినట్టు స్క్రిప్టును రూపొందించడంలో దర్శకనిర్మాతలు కొంచెం ఎక్కువ శ్రద్ధ (అంటే దాదాపు తగినంత) తీసుకోవడానికి తెరిపి ఉంటుందని ఆయన సూచించారు. ఇప్పుడు దర్శక నిర్మాతలు రోజుకు 48 గంటలసేపు బెంగెట్టుకునేది, బాక్సాఫీసు హీరో, హీరోయిన్లు షూటింగుకు డేట్ ఇస్తారా అనే విషయంమీద, తమ తెలివితేటలూ, శక్తియుక్తులూ వినియోగించేది ఇద్దరు ముగ్గురు పెద్దనటుల్ని ఒక్క సెట్ మీదకు ఏకకాలంలో తీసుకువచ్చి నిలబెట్టడానికి.

చలనచిత్రానికి అతి ముఖ్యమైన కథ గురించి ఆలోచించడానికి ఓపికా లేదు, తెరిపీలేదు అని ఆయన చెప్పారు.

మంచికథలు రాస్తామంటే పెద్దనటులు ఎవరూ అడ్డుపడుతున్నారని కాదు. ఆమాటకొస్తే వాళ్ళషరతుల్లో డబ్బుకన్న ముఖ్యమైనది మంచికథ, మంచిపాత్ర ఉండాలన్నదే.

ఊహలు మంచివే అయినా, ఉన్న పరిస్థితులలో అవి ఎందునా పొందకుండా పోతున్నాయి.

చిత్రనిర్మాణ సంకల్పంతోపాటు మొట్టమొదటగా కలిగే ఆలోచన నటీనటుల గురించే. తరువాతి ఆలోచనా, దానితరువాతిదీ—ఆ తరువాతి ఆలోచనా అన్నీ ఈ రెండు ముఖ్యమైన తారల గురించినవే అవుతున్నాయి. వాళ్లు ఒప్పుకోవాలి, అనాలి, సెట్టుకు వస్తాననాలి, రావాలి, వేళకి రావాలి, వచ్చాక మూడ్ కుదరాలి, అప్పుడు అదృష్టం కలిసిరావాలి. ఇదీ వరస. దానా దీనా అన్నిటికన్న ముఖ్యమైన కథగురించి, సందర్భాసందర్భాలగురించి, సబబు వెసబబులగురించి అట్టే పట్టించుకోరు.

ఈ పరిస్థితి సర్వత్రా ఒక్కలాగే ఉంది.

ఎందరో మంచిమంచి విషయాలను తీసుకుని కథలు వ్రాయిస్తున్నారు. అయితే, చిత్రానికి కావలసిన రీతిని వాటిని తిరిగి పోత పోసినపుడు మటుకు, అనేక కారణాల వల్ల, అసలు కథలో బలం, జవం హరించుకపోతున్నట్టు కనబడుతుంది. ఎంతో కట్టుదిట్టముగా ఒక సమస్యను కట్టుకువస్తారు. దాని స్వరూపాన్ని చక్కగా తెరమీద చిత్రించడానికి ఉపక్రమిస్తున్నారు. కొంత పోగాసరికి, చిత్రవిచిత్రమైన అవాంతరాలు వచ్చి పడుతున్నాయి. క్రమంగా ఆ సమస్య ప్రాధాన్యం క్షీణించి పోతుంది. ఈలోగా

(54-వ పేజీ చూడండి)



పొన్నలూరివారి "శోభ" లో రాజసులోచన.

బొంబాయి సినిమాలేఖ

స్వాతంత్ర్య సమర శతవార్షికోత్సవాలూ స్వాతంత్ర్య సిద్ధి దశమ వార్షికోత్సవాలూ కలిసి వచ్చిన ఆగస్టు నెల 31 రోజులూ పర్వదినాలే అందుకని బొంబాయి నిర్మాతలు పలువురు ఆ నెలలో కొత్త చిత్రాలకు ప్రారంభోత్సవాలు జరిపారు

గతతరం వెండితెర వేలుపుగా వెలిగిన నటి శోభనాసమర్థ్ తన రెండవ తనయ తనూజ నాయికగా, ఒక చిత్రాన్ని ఆరంభించింది దీనికి ఆమె దర్శకత్వం కూడా నిర్వహిస్తుంది దర్శకత్వానికిది రెండవసారి ఆమె తొలి చిత్రం 'హమారీ బేటీ' అందులో తన పెద్ద కుమార్తె నూతన సమర్థ్‌ను పరిచయం చేయడం జరిగింది ఆ నాడు ఆ చిత్రానికి ప్రారంభోత్సవం జరిపిన దర్శక నిర్మాత కిదార్ శర్మ ఈనాడు దీనికి 'శుభోక్తి' పలికారు సర్దార్ చందులాల్ షా 'క్లాప్' కొట్టారు ఈ పూజ శ్రీ సౌండ్ స్టుడియోలో జరిగింది

* * *

ఎస్ కె మాలిక్ స్టుడియో (పాతమాడర్న్ స్టుడియో) లో ఆగస్టు 20 న గోయెల్ సినీ కార్పొరేషన్‌వారు తమ కొత్తచిత్రం 'సైరక్షా' ఆరంభించారు గీతాబాలి తొలి షాట్‌లో నటించింది దేవేంద్ర గోయెల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సదనా దర్శకుడు కథ, మాటలూ ఎస్ కె ప్రభాకర్ వ్రాస్తున్నారు

ఇందులో నాయకుడు నిత్యయవ్వనుడు అశోక్‌కుమార్



రింక్ ఫిలింస్‌వారి
'నయా జమానా'లో మాలాసిన్హా.



బిమల్ రాయ్, నిర్మిస్తున్న 'మధుమతి' చిత్రంలో జానీవాకర్.

అనూప్‌కుమార్, నైనా, ముగాప్రురీ, జస్వంత్, ఎస్ కె ప్రేమ్, నజీర్ హుసేన్, రాధాకిషన్‌లు పాల్గొంటున్నారు సంగీత దర్శకుడు రవి ఛాయాగ్రహకుడు పారిమన్ ఇరానీ

* * *

దీపక్ ఫిలింస్ వారు ప్రకాష్ స్టుడియోలో ఒక్కసారే రెండుచిత్రాలు ప్రారంభించారు

ఒకటి 'రాజప్రతిజ్ఞ' నిరూపరాయ్, జయరాజ్ పాల్గొంటారు దర్శకుడు జస్వంత్ ఝవేరీ రెండవది 'పృథ్వీరాజ్ చౌహాన్' దీనికి హార్‌సుఖ్ భట్ దర్శకుడు ఈ రెండు చిత్రాలకు పాటలు భరత్ వ్యాస్, వ్రాస్తారు. సంగీతం దర్శకుడు మణిఖ్యాక్ బాబు

* * *

నవకళానికేతన్ వారు శక్తి సమంత దర్శ

బొంబాయి సినిమాలేఖ

కత్యాన నిర్మించే 'వారంట్' చిత్రంలో నాయికా నాయకులు మధుబాల, అశోక్‌కుమార్‌లు. కె. ఎన్. సింగ్, తివారీ, మదన్ పురి, కృష్ణకుమారి, ఆగా, సుందర్, కుందన్, కామో మొదలగు వారు ఇతర భూమికలు నిర్వహిస్తారు. అపరాధన పరిశోధన ఇతివృత్తంగాగల ఈ చిత్రానికి సంభాషణలు బ్రజేంద్రగౌర్ వ్రాశారు. సంగీత దర్శకుడు రవి.

ఈ తరహా కథలు చిత్రించడంలో నిపుణుడని పేరుతెచ్చుకున్న శక్తి సమంత, అమియ చిత్రావారు నిర్మిస్తున్న 'డిటెక్టివ్' అనే చిత్రానికి కూడా దర్శకత్వం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రదీప్‌కుమార్, మాలా సిన్హా, జానీవాకర్, కె. ఎన్. సింగ్, డెయిసీ ఇరానీ, కృష్ణకాంత్, ధుమల్ నటిస్తున్నారు.

గాయని గీతాదత్ (రాయ్) సోదరుడు ముకుల్‌రాయ్ దీనికి సంగీతం సమకూర్చుతున్నారు. పాటలు శైలేంద్ర, హస్రత్‌లు వ్రాస్తున్నారు.

* * *

హీరోయిన్ల జాబితాలో ఒక కొత్తనటి పేరు చేరింది. ఆమె నటి రూప్‌మాల. ఇదివరకు ఆమె 'వాంప్' పాత్రలు ధరిస్తూ వచ్చింది. ఇప్పుడు ఫిలించిత్రవారి 'చందన్ హార్'లో ఆమె నాయికగా నటిస్తున్నది. మహీపాల్, భగవాన్ ఇతరనటులు. ఈ చిత్రానికి దర్శకుడు, నిర్మాత ఎం. కరీం.

* * *

పంచదశవర్ష ప్రణాళిక

మహారాష్ట్ర చలనచిత్రకారులంతా ఇటీవల ఒక సభ జరిపి, పరిశ్రమాభివృద్ధికి పథకాలు ఆలోచించారు. ఇందుకై మొదట మూడు సంఘాలు నెలకొల్ప నిశ్చయించారు. ఒకటి మహారాష్ట్ర చలనచిత్ర వ్యాపారం అభివృద్ధికి మార్గాలు అన్వేషించి, నిర్ణయించి సలహాలు ఇస్తుంది. రెండవది టెక్నీషియన్ల సంఘం. వీరు సాంకేతిక అభివృద్ధికి మార్గాలు సూచిస్తారు. నిర్మాణ కార్యక్రమం సులభంగా సవ్యంగా సాగడానికి సలహాలు ఇచ్చి తోడ్పడుతారు. మూడవది ఈ పరిశ్రమలో పనివారంతా ఏర్పరచుకునే సహకార సంఘం.

శ్రీ వి. జి. జోగ్ ఈ సభను ప్రారంభిస్తూ మహారాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి పదిహేనేళ్ళ పథకం ఒకటి అవసరము అన్నారు. దీనికి నాందిగా, మహారాష్ట్ర హిందీభాషలలో కనీసం రెండేసి చిత్రాల నిర్మాణం ఆరంభించాలనీ, ఆపైన టెక్నికలర్‌లోగాని, సినిమాస్కోప్‌లోగాని చిత్రాలు నిర్మించి అంతర్జాతీయ విపణిలో పోటీచేసి వెలుగుకురావాలనీ ఆయన అన్నారు. ఈ నిర్మాణ కార్యక్రమాన్నీ, వ్యాపార వ్యవహారాలనుకూడా చలనచిత్రకారుల సహకార సంఘం నిర్వహించాలని ఆయన సూచించారు.

* * *

ప్రభాత్ స్టుడియో (పూనా)ను కొని పునరుద్ధరించిన మహారాష్ట్ర నిర్మాత వి. హెచ్. కల్కర్, ఒక డిస్ట్రిబ్యూషన్ సంస్థనుకూడా నెలకొల్పారు. చిత్రనిర్మాణం చురుకుగా సాగుతోంది. ప్రభాత్ పేరిట



విజయా ప్రొడక్షన్స్‌వారి కొత్తచిత్రం 'అప్పుచేసి పప్పుకూడు'లో గిరిజ, రేలంగి.

ఆయన నిర్మిస్తున్న తొలి హిందీ చిత్రం "గజ్ గౌరీ"కి ప్రముఖ రచయిత శ్రీ జి డి మడ్గూల్కర్ కథ, మాటలూ వ్రాశారు దర్శకుడు రాజా ఠాకూర్ ప్రముఖ మహారాష్ట్ర నటీ నటులు సులోచన, సాహుమోదక్, అనంత్ మరాఠే, నానా పల్సీకర్, విశ్వమిత్ర ఘంటే, రత్నమాల, నీలు, పాల్గొంటున్నారు సంగీతదర్శకుడు సుధీర్ ఫడ్కే

* * *

ఇతర సంస్థలు ఇక్కడ నిర్మిస్తున్నవి మరి నాలుగు ఉన్నాయి రెండు హిందీవి, ఒకటి మరాఠీ చిత్రం, మరొకటి తెలుగు

విభూతిమిత్రా నిర్మిస్తున్న సంగీత ప్రధాన చిత్రం "ఘుంగ్రూ"లో భరత్ భూషణ్, వైజయంతిమాల, నిషి, జీవన్ నటిస్తున్నారు

ఈ చిత్రానికి కూర్చే సంగీతం అంతటికీ 'పీలు' రాగం ఒక్కటే ప్రాతిపదిక కాగలదని, సంగీత దర్శకుడు ఒ పి నయ్యార్ చెప్పారు

రెండో చిత్రం "గౌరీ శంకర్"లో త్రిలోక్ కపూర్, సులోచన పాల్గొంటున్నారు దర్శకుడు రాజా నేనే

కాగా ఇక్కడ తయారవుతున్న మరాఠీ చిత్రం 'లక్ష్మీపూజా' తెలుగు చిత్రం 'సమ్రాట్ విక్రమార్క'

(ఆంధ్ర వార పత్రిక బొంబాయి విలేఖరి)

సినిమా వార్తలు

రెండు కొత్త చిత్రాలకు ఇటీవల ప్రారంభోత్సవాలు జరిగాయి

ఒకటి సుధాకర్ ఫిలింస్ (కొత్త సంస్థ కూడా) వారితొలిచిత్రం ఆగస్టు 29 వ దీనికి వీనస్ స్టుడియోలో ప్రారంభోత్సవం జరిగింది శాంతారాం చిత్రం 'ఆద్మీ' కథ దీనికి మాతృక రచయిత ఆత్రేయ

ఎన్ టి రామారావు, జమున, రేలంగి, గుమ్మడి ప్రభృతులు పాల్గొంటున్నారు దర్శకుడు డి యోగానంద్

* * *


మరో చిత్రం సాహిణీ (పెంకిపెళ్లాం) ప్రొడక్షన్స్ వారి జానపదం ఈ చిత్రాన్ని వీరు తెలుగులోను, తమిళంలోనూ కూడా నిర్మిస్తున్నారు తెలుగుచిత్రానికి 'బండరాముడు' అని పేరు పెట్టారు రచయిత ఆత్రేయ దీనికి రెండవ వేదీన వాహినిలో ప్రారంభోత్సవం జరిగింది

ఎన్ టి రామారావు, సావిత్రి ఇందులో ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు

దర్శకులు పి పుల్లయ్య

* * *

జయంతీ పిక్చర్సువారి కొత్త చిత్రానికి రచన పూర్తి కావచ్చింది కె వి రెడ్డి దర్శకత్వాన తయారు కానున్న ఈ చిత్రంలో నాగేశ్వరరావు, జమున, రేలంగి మొదలగు



అనుపమా వారి 'ఎం. ఎల్ ఎ' చిత్రంలో గాంధేయ మార్గాలను మనసా గౌరవించి ఆచరించి నిలచిన భూషయ్యగా పెరుమాళ్లు.

వారు పాల్గొంటారు

రచయిత పింగళి నాగేంద్రరావు

* * *

ఈ నెలాఖరులోగా విడుదల కాగల తెలుగు చిత్రాలు నాలుగు అన్నీ సాంఘికాలే ఇవి కాక మరొకటి — నరసూ వారి సాంఘిక చిత్రం "భలే అమ్మాయిలు" ఆరున విడుదల అయింది ఇందులో అమ్మాయిలు సావిత్రి, గిరిజ అబ్బాయిలు రామారావు, జగ్గయ్య, ప్లస్ రేలంగి రచయిత సదాశివబ్రహ్మం సంగీతం రాజేశ్వరరావు దర్శకుడు వేదాంతం (భలేరాముడు) రాఘవయ్య

* * *


మరో వారం తరువాత–సెప్టెంబరు 12 న, ఆర్ ఎన్ ఆర్ పిక్చర్సువారి సాంఘికం "ప్రేమే దైవం" విడుదల అవుతుంది గుమ్మడి, ఆర్ నాగేంద్రరావు, రాజనాల, చలం, శ్రీరంజని, సంధ్య, సూర్యకళ, ఇ వి. సరోజ, బేబీ ఉమ పాల్గొన్నారు రచన జె కె మూర్తి, సంగీతం హెచ్ వి పద్మనాభశాస్త్రి దర్శకత్వం నాగేంద్రరావు

* * *

అనుపమావారి "ఎం ఎల్ ఎ" మూడు వంతులు, ఈ నెల మూడో వారంలో విడుదల కావచ్చునను కొంటున్నారు భూ సంస్కరణల సమస్యకు ప్రాధాన్యంగల ఇతివృత్తంతో తయారౌతున్న ఈ చిత్రానికి తాపీ ధర్మారావు, ఆరుద్ర కథను రూపొందించి, మాటలూ పాటలూ వ్రాశారు కె బి (ముద్దు బిడ) తిలక్ దర్శకత్వం నిర్వహించారు సావిత్రి, జగ్గయ్య, గుమ్మడి, పెరుమాళ్లు, రమణారెడ్డి చదలవాడ, గిరిజ, సూర్యకళ మొదలగువారు పాల్గొంటున్నారు

రమణమూర్తి అనే కొత్తనటుడిని దర్శకుడు తిలక్ ఈ చిత్రంలో పరిచయం చేస్తున్నారు

ఇదికాక, హైదరాబాద్ కు చెందిన



అంజలీవారి "సువర్ణసుందరి" చిత్రం ఆంధ్రలోని 17 కేంద్రాలలో శతదినోత్సవాలు జరుపుకొంది తెనాలి స్వరాజ్య టాకీసులో ఉత్సవం జరిగినప్పటి చిత్రం నటీనటులూ అధ్యక్షత వహించిన విద్యామంత్రి శ్రీ పట్టాభిరామారావు, స్వరాజ్య టాకీసు యజమాని శ్రీ ఎస్ గోపాలరావు

విశ్వవిద్యాలయానికి రు. 50 వేలు విరాళం

నటి అంజలీదేవి ప్రకటన

"వంద చిత్రాలలోను నటించడం పూర్తి కాగానే, ఒక విశ్వవిద్యాలయానికి యాభైవేల రూపాయలు ఇవ్వాలని సంకల్పించాను" అని ప్రముఖ నటి శ్రీమతి అంజలీదేవి ప్రకటించగానే, సికందరాబాద్ రాజేశ్వర్ టాకీస్ కరతాళ ధ్వనులతో నిండిపోయింది

ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన 'సువర్ణ సుందరి' శతదినోత్సవ సభలో అంజలీదేవి ఈ నిర్ణయాన్ని ప్రకటించింది ఇప్పటికి ఆమె పాల్గొన్న చిత్రాలు 70 మిగతా 30 రెండు మూడు సంవత్సరాలలో పూర్తికాగలవని ఆశిస్తున్నానని ఆమె తెలియచేసింది

'సువర్ణ సుందరి' శతదినోత్సవాలను పురస్కరించుకొని, నటవర్గం అంజలీదేవి, నాగేశ్వరరావు, రేలంగి, గుమ్మడి, సి ఎస్ ఆర్ బాలకృష్ణ, రమణారెడ్డి, రాజసులోచన, గిరిజ, సూర్యకళ ప్రభృతులు, నిర్మాత, సంగీత దర్శకుడు ఆదినారాయణరావు, దర్శకుడు వేదాంతం రాఘవయ్య, ఛాయాగ్రాహకుడు రెహమాన్, నృత్యదర్శకుడు వెంపటి సత్యం, కళాదర్శకుడు వాలి, సమేరియా అధిపతి సుందర్ లాల్ నహతా మొదలగువారు ఆంధ్రలో వివిధ పటణాలకు వచ్చారు మొత్తం 17 కేంద్రాలలో శతదినోత్సవాలు జరిగాయి నిర్మాతలూ, ఈ చిత్రాన్ని విడుదలచేసిన సమేరియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్, ప్రదర్శించిన థియేటర్ల వారూ పరస్పరం అభినందించుకున్నారు ప్రేక్షకుల అభినందనలందుకుని కృతజ్ఞత తెలియచేశారు

రాజధానిలో జరిగిన ఉత్సవానికి ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు బహుమతులు పంచిపెట్టారు శ్రీయుతులు దేవులపల్లి రామానుజరావు, ఎం ఎస్ రాజలింగం, ప్రభృతులు ప్రసంగించారు ★

సినిమా వార్తలు

ఖుర్షీద్ అనే నర్తకికూడా తొలిసారిగా తిలక్ ఇందులో అవకాశమిస్తున్నారు

ఈ చిత్రానికి పెండ్యాల నాగేశ్వరరావు సంగీతం సమకూర్చారు

* * *

విఠల్ ప్రొడక్షన్స్‌వారి హాస్యరస ప్రధాన చిత్రం "వద్దంటే పెళ్ళి" నాలుగోవారంలో విడుదల కాగలదంటున్నారు

శ్రీరంజని, కృష్ణకుమారి, చలం, రమణారెడ్డి, సి ఎస్ ఆర్ పాల్గొన్నారు రచన రామచంద్, జి కె మూర్తి దర్శకుడు విఠలాచార్య

* * *

ఐదవ చిత్రం చందమామా ఫిలింస్ వారిది తమిళ క్షేత్రంలో విజయవంతంగా సాగిన 'తంగమలై రహస్యం' అనే చిత్రాన్ని వీరు తెలుగులోకి డబ్ చేసి విడుదల చేస్తున్నారు జయంతీ సౌండ్ స్టుడియోలో చురుకుగా పని సాగుతోంది దీనికి మాటలూ, పాటలూ శ్రీశ్రీ వ్రాశారు డబ్బింగ్ కూడా ఆయనే నిర్వహిస్తున్నారు జగ్గయ్య, జమున, పార్వతి, వసంతకుమార్, కె వి ఎస్ శర్మ ఆయా పాత్రల గాత్రధారణ నిర్వహిస్తున్నారు ★

చలన చిత్ర కథలు

(50 వ పేజీ తరువాయి)

కాలాతీతం కావస్తుందని కథను గబగబా ముగించడం జరుగుతోంది తెరవెనక జరిగే కథ ఎంత వున్నా, అక్కడి సాధక బాధకాలు ఎంతటివి అయినా, తెరమీద చూచేవాడికి, ఫలితం బాగుండకపోతే చివర ఆశాభంగం కలుగుతుంది లేదా, చూసినదంతా ఎందుకు నాపొందనట్లు, తేలిపోతుంది అతనిదృష్టిలో కథని, కథాంశాన్ని నిర్లక్ష్యంచేస్తున్నారనిపిస్తుంది

బిమల్ రాయ్ చెప్పినట్లు కారణాలు ఏవైనా కావచ్చు, ఎన్ని అయినా ఉండవచ్చు ప్రేక్షకుడికి ఫలితంముఖ్యం ఇప్పటి తెరమీది ఫలితాలు అనేకం ఒక్కలాగే ఉంటున్నాయి ఎత్తుగడ, ముగింపు, పాత్రలు మొదలైనవి

చాలా కథలు, ఏవో కొన్ని సూత్రాల ప్రకారం కొన్నితరహాల పాత్రలను రకరకాలుగా కలపడం వేరుచేయడం వంటి గుణకారాలమీదనే తయారవుతున్నాయన్న భావం సర్వత్రా కలుగుతోంది ★



ఎన్. ఎస్. కృష్ణన్ మృతి

చలనచిత్ర హాస్యనటులలో అగ్రశ్రేణి వ్యక్తి అనిపించుకున్న ఎన్. ఎస్. కృష్ణన్ మృతి దక్షిణభారత చలనచిత్ర పరిశ్రమలో వారందరికీ, ప్రేక్షకలోకం అంతటికీ అత్యంత సంతాపం కలిగించింది. ఆగస్టు 30వ తేదీ ఉదయం 11-15 గంటలకు కృష్ణన్ మరణించాడన్న వార్త తెలియగానే, మద్రాసులోని ఫిలింస్టుడియోలలో పనులు నిలిపివేశారు. నటీనటులూ, ఇతర కళాకారులూ పలువురు కృష్ణన్ ఇంటికి వెళ్ళి, కృష్ణన్‌కు తెరమీదిజంట, నిజజీవితంలో భార్యఅయినమధురంకు సానుభూతిని తెలియజేశారు. వేలాదిజనంతో ఆ వీధి నిండి పోయింది. మర్నాడు ఉదయం కృష్ణన్ భౌతికకాయాన్ని నగరం ముఖ్య వీధులలో ఊరేగించారు. దాదాపు లక్షమంది ప్రజలు, చలనచిత్రకారులు శ్మశానవాటికకు వెళ్లారు. అక్కడ సభలో ఎం. జి. రామచంద్రన్, శివాజీ గణేశన్, నాగయ్య, తంగవేలు ప్రభృతులంతా కృష్ణన్‌కు జోహారులర్పించారు. క్రితంరోజుసాయంత్రం బి. ఎన్. రెడ్డి, ఎ. వి. మెయ్యప్పన్, కృష్ణన్ ప్రతిభా విశేషాలను ముచ్చటిస్తూ మద్రాసు రేడియో కేంద్రంనుండి ప్రసంగించారు.

తమిళనాడులోనే కాక, యావదాంధ్రలోనూ సర్వత్రా గౌరవాభిమానాలు గడించుకున్న హాస్యనటుడు కృష్ణన్ నూరు పైచిలుకు చిత్రాలలో నటించాడు. విద్య, ఆస్తీకూడా లేని కృష్ణన్ వీధుల్లో కూరలమ్ముకుంటూ జీవితం సాగించేవాడు ఒకప్పుడు. తరవాత కొన్నాళ్ళు నాటకాలలో వేషం వేసి 1936 లో చలనచిత్రసీమలో ప్రవేశించాడు. అతని తొలిచిత్రం సతీ లీలావతి. కొద్దిరోజుల తరువాత మధురం కృష్ణన్‌లు కలిసి జంటగా నటించసాగారు. 1940 ప్రాంతాలనుండి పది పదిహేనేళ్ళ పాటు మకుటంలేని రాజుగా కృష్ణన్ తమిళచిత్రసీమను ఏలాడు. అంబికాపతి, తులసీదాసు, శకుంతల, అశోక్ కుమార్, ఆర్యమాల, మంగమ్మశపథం, వంటి చిత్రాలెన్నో కృష్ణన్‌ను ఆంధ్ర ప్రేక్షకులకు కూడా అభిమాన పాత్రుణ్ణి చేశాయి.

రేణుకా ఫిలింస్ పేరిట నాగయ్యగారు నిర్మించిన "భాగ్యలక్ష్మి" చిత్రంలో కృష్ణన్ తెలుగులోహాస్యాన్ని అందించాడు. ఇటీవల అతడు తెలుగులో నిర్మించిన 'పెళ్లి కూతురు' చిత్రాన్నికూడా ఆంధ్రప్రజలు ఆదరించారు.

1951 లో భారత సాంస్కృతిక ప్రతినిధివర్గ సభ్యుడుగా కృష్ణన్ సోవియట్‌రష్యా వెళ్ళివచ్చాడు.

కృష్ణన్‌ది మోటురకం హాస్యంకాదు. జంకూ గొంకూ ఎరుగని వాగుడుకాయపాత్ర అతనికి అభిమానపాత్రమైన దనిపిస్తుంది. దానిద్వారా, నవ్వుతూ పేలుతూ ఎదటివాడిచేత అవకతవకగా మాట్లాడించి వాణ్ణి కుంతగా జమకట్టించేస్తు, పనిలో పనిగా, లోకంతీరును మనుషుల తరహాలను సున్నితంగానే అయినా నిశితంగా విమర్శించేవాడు. సాధారణంగా ఏ చిత్రంలోనయినా తను చెప్పదలచుకున్న సంగతులూ వాటిలో చమత్కారాలూ కృష్ణన్ స్వయంగా ఆలోచించుకునేవాడు. అతనిహాస్యం అతనే కల్పించుకునే వాడు. అందుమీద ముద్ర అతనిదే.

వ్యక్తిగా కృష్ణన్, తోటివారందరి గౌరవాన్ని అభిమానాన్ని చూరగొన్నాడు. దానధర్మాలక్రింద దాదాపు పదిలక్షలుఇచ్చాడు. ★



"నా షెర్వాన్" చిత్రంలో రాజ్ కుమార్.

ఆహార సమస్య

(4- పేజీ తరువాయి)

కేంద్రాన్ని సహాయం అడగడం, ఏ ఇబ్బంది వచ్చినా కేంద్రం మీదికే నిందను తోసివెయ్యడం, కేంద్రం కూడా అవునని సహించి ఊరుకోవడం శోచనీయంగా వుంది.

ఆంధ్రపై చిన్నచూపు

ఇంతమాత్రాన దేశంలో ఆహారోత్పత్తి అధికం చెయ్యవలసిన అవసరం లేదని భావించరాదు. జనాభా పదేళ్ళ కొకసారి నూటికి 12½ వంతుల చొప్పున పెరుగుతోంది. ఇంత భారీ ఎత్తున ప్రజోత్పత్తి అవుతుండగా, ఈ ప్రజలకు ఎంత పండితే మాత్రం సరిపోను? అందుచేత అధికాహారోత్పత్తికి వీలయిన ప్రతిచర్య తీసుకోవలసిందే. దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మిగులు రాష్ట్రమనే మాట నిజమే. కాని ఆంధ్రలో వ్యవసాయ సౌకర్యాలు న్యాయంగా అభివృద్ధి కావలసినంతగా కాలేదు. ఈ కారణంచేత అధికోత్పత్తికి ఎంతో అవకాశం ఉన్నా ఆ అవకాశం నిరుపయోగమై పోతోంది. పొరుగురాష్ట్రమైన మద్రాసులో 55,38,000 ఎకరాలలో 31,03,000 టన్నుల బియ్యం పండుతుండగా, ఆంధ్రలో 71,04,000 ఎకరాలలో 32,25,000 టన్నులు మాత్రమే బియ్యం పండుతోంది. మద్రాసు రాష్ట్రములో మొత్తం 1,22,34,000 ఎకరాలలోనూ 47,22,000 టన్నుల ధాన్యాలు పండుతుండగా, ఆంధ్రలో 2,13,92,000 ఎకరాలలోనూ 53,91,000 టన్నుల ఆహార ధాన్యాలే పండుతున్నాయి. దీన్నిబట్టి ఆంధ్రలో వ్యవసాయం ఎంత వెనకబడివున్నదో ఊహింపవచ్చును. వ్యవసాయ పద్ధతులను నవీనం చేసుకోవడంలోనూ, సౌకర్యాలు కలిగించుకోవడంలోనూ వెనకబడి ఉండబట్టే ఉత్పత్తికూడా వెనకబడి ఉంది. ఆఖరికి ఎరువులఫ్యాక్టరీవిషయంలో కూడా, ఆంధ్రకు ద్వితీయ ప్రణాళికాకాలంలో సదుపాయం లభించేట్లు లేదు. నంగాల్, రూర్కెలాలలో ఎరువుల ఫ్యాక్టరీలు కట్టినతరవాత ఇంకా డబ్బు మిగిలితే ఆంధ్రలో ఒకటి కట్టిస్తామని ఇటీవల ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కె. తెలియజేశారు. ఇప్పుడు దేశానికి ఎక్కువగా అవసరమైనది బియ్యం. బియ్యం బాగా పండించే రాష్ట్రాన్ని ఇలా అశ్రద్ధచేయడంలో అర్థం లేదు.

అధికోత్పత్తిసంగతి అలాఉంచి ప్రస్తుతం అత్యవసరంగా విచారణ చేయవలసింది, ఉత్పత్తిఅయినఆహారాన్ని ఎలా సేకరించడం, ఎలా సరఫరాచేయడం, అటు పంటదారుకూ ఇటు వినియోగదారుకూ సరసమని అనిపించే ధరలను ఎలా నిర్ణయించడం అనేవిషయాలు. ఈ విషయాలను పరిష్కరిస్తే దిగుమతులతో భారీఎత్తున అవసరం లేకుండానే ఆహార పరిస్థితి కుదటపడగలదు. ★

న్యూఢిల్లీలేఖ

(6-వ పేజీ తరువాయి)

లాల్ నెహ్రూకు సమర్పించారన్నమాట. అంగుచేతే మామూలుగా ప్రతీ సంఘ నివేదికను పరిశీలించినంత బాధ్యతతో ప్రణాళికను పరిశీలించడం జరగలేదు. పైగా ప్రణాళిక ఎన్నికల ప్రచారానికి బాగా పనికొచ్చింది. ప్రణాళికను నిభాయించడం కష్టమని ఎవడన్నా నోరెత్తితే వాడు అభివృద్ధి నిరోధకుడనే ముద్రవేయడం జరిగింది. ఇలా ముద్రపడినవారిలో ప్రణాళికా సంఘ సభ్యులు శ్రీ కె. సి. నియోగి ఒకాయన.

* * *

రోడ్లు, ఉత్తరాలు

శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి ఈ మధ్య కలకత్తా వెళ్లారు. కలకత్తా హార్బరు సౌకర్యాలను అతిశీఘ్రకాలంలో అభివృద్ధి చేయడానికిఆయన ఒక పథకం తయారు చేశారు. రవాణా సలహా సంఘ సమావేశానికి అధ్యక్షత వహించారు. రోడ్లను అభివృద్ధి చేయాలనే సంకల్పంకూడా ఆయనకు కలిగింది.

రోడ్ల బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. వీటిని సరియైన స్థితిలో ఉంచేందుకు కేంద్రమే డబ్బు ఖర్చుచేస్తూ ఉంటుంది. దేశరక్షణకు రోడ్లు చాలా ముఖ్యమైనవి. యాత్రలకు కూడా ఇవి ముఖ్యమైన మార్గాలు. ఈ మధ్య ఉత్తరప్రదేశ్‌లోను, పంజాబులోని రోడ్లమీద ప్రయాణంచేసే మహాభాగ్యం నాకు కలిగింది. మైలురాళ్ళమీద ఇంగ్లీషు అంతర్థానమైంది. దానిస్థానాన్ని ఉత్తరప్రదేశ్‌లో హిందీ, పంజాబులో గురుముఖి ఆక్రమించాయి. విదేశీయాత్రికులను ఈ దేశం చూడరండని ఆహ్వానిస్తూ, దానికోసం బోలెడు ఖర్చుచేస్తున్న ప్రభుత్వమే ఇలా ఇంగ్లీషును చెరిపేయడంలో అర్థం కనిపించడం లేదు.

ఈ దేశాన్ని సరదాగా చూడవచ్చిన విదేశీయాత్రికుడు రోడ్లమీద ప్రయాణం చేస్తున్నప్పుడు, తను ఎటు వెళుతున్నది తెలుసుకోవాలా, అక్కర్లేదా? కేంద్ర ప్రభుత్వపు అజమాయిషీలో ఉన్న శాఖలో కూడా ఇలాంటి అనవసరమైన మార్పులు ఎందుకు జరుగుతున్నాయో తెలియదు.

ఇక తంతితపాలాశాఖ సంగతి చూద్దాం. మధురకుపోయే రోడ్డుమీద సెంట్రల్ జైల్ సమీపంలో "విదేశీతపాలాకార్యాలయం" (ఫారిన్ పోస్టాఫీసు) ఒకటి ఉన్నది. ఈ పోస్టాఫీసుకు లాల్ బహదూర్, ఆయన డిప్యూటీ రాజ్ బహదూర్ పార్లమెంటులోని కమ్యూనిస్టు, సోషలిస్టు సభ్యుల నొకసారి తీసుకుపోయి చూపించాలని నాకోరిక. ఆ పోస్టాఫీసులో ఎక్కడచూసినా గుట్టలు గుట్టలుగా ఇంకా తెరవనన్నా తెరవని తపాలా సంచులనేకం కనిపిస్తాయి. ఈ రమణీయ దృశ్యం ఉద్యోగులచురుకుదనానికి తార్కాణం. పరాయి ప్రభుత్వం పరిపాలిస్తున్నప్పుడు ఆ ప్రభుత్వ శ్రేయస్సుకోసం ప్రజలు కష్టపడి పనిచేశారు. ఆ ప్రభుత్వంపోయి మన ప్రభుత్వం వచ్చినతరవాత పనికి బద్ధకిస్తున్నారు. స్వతంత్రభారతంలో మొదటదెబ్బతిన్నది పనిచెయ్యాలనే శ్రద్ధ, బాధ్యత. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



చిట్టిపాప ఆనందం

ఫొటో వి ఉమామహేశ్వరరావు, గుంటూరు]


Regd. No .M.4479. Andhra Patrika Illustrated Weekly

ఎండోమెంటు పోలసీలు

మీ భవిష్యత్తు మీ పైనే ఆధార పడి వుంటుంది

జీవిత భీమా జీవించడానికే. మీరు నిజంగా మీ జీవిత కాలంలోనే జీవిత భీమా ఫలితాలను అనుభవించగలరు. దీనికి సరియైన ప్రణాలిక "ఎండోమెంటు పోలసీ".

"ఎండోమెంటు పోలసీ"కి, పూర్తి జీవిత భీమాకు భేదం వుంది. పూర్తి జీవిత భీమాతో క్లెయిమ్ భీమా చేసిన వారి మరణానంతరం, యిస్తారు. ఇక "ఎండోమెంటు పోలసీ"లో మీరు కొంత కనీస కాలనిర్ణయంలో ప్రీమియమ్‌లు చెల్లిస్తారు. దీని అనంతరం భీమా చేయబడిన పూర్తి మొత్తం మీకు చెల్లించబడుతుంది. (అయితే ఒక వేళ మరణం యీ సమయానికి ముందే జరిగితే యీ మొత్తం అంతా వారిచే నిర్ణయించబడిన వారికి గాని, ఒప్పగించబడిన వారికిగాని చెల్లించబడుతుంది.)



"ఎండోమెంటు పోలసీ". ముసలితనం లోనూ, యింకా వారి ప్రావిడెంట్ ఫండ్‌లో కొంత రాబడిని కలపాలని ఉబలాట పడే మధ్య తరగతి ప్రజలకు సరియైనది భవిష్యత్‌లో దీని అవసరాన్ని గుర్తించిన వారికి చాలా ఉపయోగ పడుతుంది. ఉదాహరణకు, తమ బిడ్డల చదువులకు వివాహాలకు, యింకా మొత్తంగా అవసరమయ్యే యితర అవసరాలకు ఎంతో ఉపయోగ కరంగా వుంటుంది.

"ఎండోమెంటు పోలసీ" మీకు సరియైన పోలసీ కావొచ్చు. మీ అవసరాలకు సరిపోయే విధంగా వున్న ఎండోమెంటుకు సంబంధించిన యితర రకాలైన పోలసీలు మీ జీవిత భీమా ఏజెంటు వద్ద పూర్తి వివరాలు పొందండి.

లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ASP/LIC.19